

'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 133

గురువారం 3-8-2023



భారత్ బల ప్రదర్శన


చివరి వన్డేలో విండీస్‌పై 200 పరుగులతో విజయం. సిరీస్ 2–1తో సొంతం. - 12లో



బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్లు పెరిగారు

117 కోట్ల టెలికం చందాదారులు. మొబైల్ సబ్‌స్క్రైబర్లు 114 కోట్లు. - 13లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బలగాల్ని రంగంలోకి దింపండి

హరియాణాలో మత ఘర్షణల నేపథ్యంలో ఢిల్లీలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని పోలీసులను సుప్రీం ఆదేశించింది.
- వివరాలు 6లో



మహిళల ఆర్థికాభివృద్ధితో పురోగతి

మహిళల నేతృత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే ఆర్థిక పురోగతితో దేశాభివృద్ధి సాధ్యమని ప్రధాని మోదీ చెప్పారు.
- వివరాలు 6లో



కునోలో మరో చీతా మృతి

మధ్యప్రదేశ్ కునో నేషనల్ పార్కులో చీతాల మరణాలు ఆగడం లేదు. బుధవారం ఉదయం ధాత్రి అనే ఆడ చీతా మరణించింది.
- వివరాలు 6లో



సింగపూర్ మంత్రికి ఎదురుదెబ్బ

చంద్రబాబు సన్నిహితుడు, భారతీయ మూలాలున్న సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌కు వేతన చెల్లింపుల విషయంలో ఎదురుదెబ్బ తగిలింది.
- వివరాలు 6లో

రుణమాఫీ మళ్లీ షురూ

గురువారం నుంచే పునఃప్రారంభించాలన్న సీఎం కేసీఆర్.. నేటి నుంచే రైతుల ఖాతాల్లో జమ!



- విడతల వారీగా మొత్తం రూ.19 వేల కోట్లు మాఫీ
- నెలన్నర రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలన్న ముఖ్యమంత్రి
- రైతాంగ సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటన
- రైతు సాధికారత సాధించే వరకు విశ్రమించబోమని స్పష్టీకరణ
- 29.61లక్షల రైతు కుటుంబాలకు లబ్ధి

సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీని తక్షణమే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియను గురువారం నుంచే పునఃప్రారంభించాలని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఎన్ని కష్టాలొచ్చినా రైతుల సంక్షేమం కోసం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తిరిగి చక్కబడిన నేపథ్యంలో, రాష్ట్రంలోని రైతుల పంట రుణాల మాఫీ కార్యక్రమాన్ని పునః ప్రారంభించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

కరోనా, కేంద్రం వైఖరితోనే ఆలస్యం

'ఇచ్చిన మాట ప్రకారం, రైతు రుణమాఫీ కార్యక్రమం కొనసాగించాం. అయితే కేంద్రం తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయం, కరోనా వల్ల సంభవించిన ఆర్థిక సమస్యలు, ఎఫ్‌ఆర్‌బీఎం నిధులను విడుదల చేయకుండా కేంద్రం రాష్ట్రం పట్ల అనుసరించిన కక్షపూరిత వైఖరి తదితర కారణాల వల్ల ఏర్పడిన ఆర్థిక లోటుతో.. రుణమాఫీ ఇన్నాళ్లూ కొంత ఆలస్యమైంది. కానీ రైతులకు అందించాల్సిన రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కొనసాగిస్తూనే వస్తోంది. మేం ఇప్పటికే చెప్పినట్టు ఎన్ని కష్టాలు నష్టాలు వచ్చినా, ఆరునూరైనా రైతుల సంక్షేమాన్ని, వ్యవసాయాభివృద్ధి కార్యాచరణను విస్మరించే ప్రసక్తేలేదు. పైగా వ్యవసాయాభివృద్ధి కోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి ఆదర్శవంతమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నాం. రైతు సాధికారత సాధించే వరకు, రైతులను ఆర్థికంగా ఉన్నతంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించే ప్రసక్తేలేదు..'అని ముఖ్యమంత్రి స్పష్టం

మిగతా 2వ పేజీలో ▶

రైతుబంధు తరహాలో విడతల వారీగా..

➤ రైతుబంధు తరహాలో విడతల వారీగా కొనసాగిస్తూ నెలా పదిహేను రోజుల్లో, సెప్టెంబర్ రెండో వారం వరకు రైతు రుణమాఫీ కార్యక్రమం మొత్తం పూర్తి చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమాన్ని గురువారం నుంచే పునఃప్రారంభించాలని ఆర్థిక మంత్రి హరీశ్‌రావును, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కేసీఆర్ ఆదేశించారు. దీంతో ఆగస్టు 3వ తేదీ నుంచే రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. సీఎం ముఖ్య సలహాదారు సోమేశ్‌కుమార్, హెచ్‌ఎండీఏ ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్ కుమార్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నేటి నుంచే అసెంబ్లీ



- తొలి రోజు దివంగత సభ్యులకు సంతాపం, బిజినెస్ అడ్వయిజరీ కమిటీ భేటీ
- నాలుగు రోజుల పాటు కొనసాగనున్న ఉభయసభల సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ, శాసనమండలి సమావేశాలు గురువారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభమవుతాయి. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమయ్యే సమావేశంలో ముందుగా కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే సాయన్నతో పాటు ఇటీవలి కాలంలో మరణించిన మాజీ ఎమ్మెల్యేలకు సంతాపం పాటిస్తారు. అనంతరం సభ వాయిదా పడుతుంది. ఆ తర్వాత స్పీకర్ అధ్యక్షతన జరిగే బిజినెస్ అడ్వయిజరీ కమిటీ సమావేశంలో శాసనసభ సమావేశాల నిర్వహణ తేదీలు, ఎజెండా ఖరారు చేస్తారు. సుమారు నాలుగురోజుల పాటు శాసనసభ సమావేశాలు జరిగే అవకాశముంది. బీఏసీ భేటీలో విపక్షాల నుంచి వచ్చే సూచనలు, ప్రతిపాదనల ఆధారంగా అవసరమైతే సమావేశాల తేదీలను పొడిగించొచ్చు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే మండలి సమావేశాల్లో తొలిరోజు రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదలపై స్వల్పకాలిక చర్చ

మిగతా 3వ పేజీలో ▶

4 కీలక బిల్లులు

ప్రస్తుత సమావేశంలో 4 కీలక బిల్లులు ఉభయ సభల ముందుకు రానున్నాయి. ఇందులో గతంలో అసెంబ్లీ ఆమోదించినా, గవర్నర్ తిరస్కరించిన మూడు బిల్లులు కూడా ఉన్నాయి. వీటిని ఉభయసభలు మరోమారు చర్చించి ఆమోదిస్తాయి.

1. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఇటీవల కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని బిల్లు రూపంలో సభలో చర్చించి ఆమోదిస్తారు.
2. తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (రెగ్యులేషన్ ఆఫ్ ఏజ్ ఆఫ్ సూపర్‌అన్యూయేషన్) చట్టసవరణ బిల్లు–2022
3. తెలంగాణ ప్రైవేటు విశ్వవిద్యాలయాల చట్టసవరణ బిల్లు–2022
4. తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ బిల్లు–2022

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడమే కాంగ్రెస్ ఎజెండా

- వరద బాధితులు, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ఫోకస్
- భట్టి పాదయాత్ర అనుభవాలు, కీలక సమస్యలను లేవనెత్తే వ్యూహం - 3లో
- అసెంబ్లీ సమావేశాలు కనీసం 15 రోజులు నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి

న్యూస్‌రీల్

వైన్‌షాపుల కేటాయింపునకు లాటరీనే...



వచ్చే రెండేళ్లకు ఏ4 (వైన్) షాపులకు లైసెన్సులు కేటాయించే ప్రక్రియ మొదలైంది. లైసెన్సుల జారీకి సంబంధించిన నిబంధనలతో కూడిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది.
- వివరాలు 2లో

ముఖ్య నేతలంతా అసెంబ్లీకే!



లోక్‌సభ ఎన్నికల కంటే ముందే శాసనసభ ఎన్నికలు జరగనుండటంతో.. రాష్ట్ర పార్టీకి చెందిన ముఖ్యనేతలంతా (ఎంపీలు సహా) తమకు పట్టున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధం కావాలని బీజేపీ అగ్ర నాయకత్వం ఆదేశించినట్టు తెలిసింది.
- వివరాలు 3లో

రాజకీయాలకే నా ప్రాధాన్యత



సినిమాల కంటే రాజకీయాలకే తన ప్రాధాన్యత ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, సినీ నటి జయసుధ తెలిపారు. పేదలకు మంచిచేయాలి.. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశం, పని చేయాలనే తపనతోనే బీజేపీలో చేరానని వెల్లడించారు.
- వివరాలు 3లో

82.92 లక్షల ఎకరాల్లో పంటల సాగు



రాష్ట్రంలో భారీ వర్షాలు కురవడంతో ఒకవైపు పంట నష్టం జరిగినా, మరోవైపు రైతులు వరి నాట్లు వేసు కోవడంలో నిమగ్నమయ్యారు. వానాకాలం సీజన్‌లో 82.92 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది.
- వివరాలు 10లో





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

అభివృద్ధిని చూడలేకే చిల్లర మాటలు..

- ప్రతిపక్ష నాయకులు అడ్డగోలు వ్యాఖ్యలు చేయడం సరికాదు: మంత్రి కేటీఆర్
- రాష్ట్రంలో గెలిచేది బీఆర్‌ఎస్.. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవడం ఖాయం
- హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతున్నాం

వనస్థలిపురం (హైదరాబాద్): బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూడలేకనే ప్రతిపక్ష నాయకులు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారక రామారావు మండిపడ్డారు. ప్రతిపక్షాల నేతలు అడ్డగోలుగా మాట్లాడటం సరికాదని.. కేసీఆర్ వయసును గౌరవించాలని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా నిలుస్తారని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని హస్తినాపురం జీఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. రిజిస్ట్రేషన్లపై ఆంక్షలతో ఇబ్బందిపడుతున్న కాలనీలకు విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం తెచ్చిన జీవో 118 కింద ఎల్బీనగర్ నియోజకవర్గంలోని 4వేల మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలసి

మిగతా 2వ పేజీలో ▶

తెలంగాణ ఎన్నికలకు కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ

- చైర్మన్‌గా కె.మురళీధరన్
- ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఠాక్రే, రేవంత్, భట్టితో పాటు ఉత్తమ్‌కు చోటు



మురళీధరన్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి కె.మురళీధరన్ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, బాబా సిద్ధిఖీ, జిగ్నేష్ మేవానీలను సభ్యులుగా నియమించారు. ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తెలంగాణ వ్యవహారాలు చూస్తున్న ఏఐసీసీ కార్యదర్శులు ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్తమ్‌కు ప్రాధాన్యత: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ అభ్యర్థులను ఖరారు చేయడంలో భాగంగా ఏఐసీసీ ఈ స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో పీసీసీ మాజీ అధ్యక్షుడు,

మిగతా 2వ పేజీలో ▶



'మణిపూర్‌పై ప్రకటన చేసేలా మోదీని ఆదేశించండి' 6లో

బుధవారం మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసిన ఇండియా కూటమి నేతలు

ఆర్టీసీ విలీనం ఎన్నికల స్టంటే

- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ఎన్నికల స్టంటే అంటూ కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చేందుకు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం అన్నారు. - 3లో

- 125 గజాల్లోపు అయితే ఉచితంగా రెగ్యులరైజేషన్
- ఆ తర్వాత స్టాంపు డ్యూటీ చెల్లించాల్సిందే
- దరఖాస్తుల పరిశీలన బాధ్యత కలెక్టర్లకు అప్పగింత
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నోటరీ ఆస్తుల క్రమబద్ధీకరణ



సాక్షి, హైదరాబాద్: పట్టణ ప్రాంతాల్లో నోటరీల ద్వారా క్రయవిక్రయాలు జరిగిన వ్యవసాయేతర ఆస్తుల క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిత్తల్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. వీటి ప్రకారం.. నోటరైజ్డ్ డాక్యుమెంట్లు ఉన్న ఆస్తుల క్రమబద్ధీకరణ కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుతో పాటు నోటరీ డాక్యుమెంటు, సదరు ఆస్తికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు, ఆస్తిపన్ను రశీదు, కరెంటు బిల్లు, వాటర్ బిల్లు, లేదంటే ఆ ఆస్తి స్వాధీనంలో ఉన్నట్టు నిరూపించే ఇతర ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఇలా వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. ఈ దరఖాస్తుల్లో ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఆస్తులు ఉంటే వాటికి జీవోలు 58, 59 (ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల క్రమబద్ధీకరణ) ద్వారా పరిష్కారం చూపిస్తారు. లేదంటే నేరుగా పరిష్కరిస్తారు. ఈ విధంగా రిజిస్టర్ చేసేందుకు 125 గజాల లోపు ఉన్న ఆస్తులపై ఎలాంటి స్టాంపు డ్యూటీ వసూలు చేయరు. అంతకు మించితే మాత్రం మార్కెట్ రేటు ప్రకారం స్టాంపు డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు రూ.5 జరిమానా కూడా చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో వివరించారు. ఇందుకు సంబంధించి ఎలాంటి గడువును పేర్కొనలేదు.


ఇదండీ సంగతి



నీ రుణం డబ్బులు ఐదువేలు చెల్లించక పోయావో నీ ఇల్లు జప్తు చేస్తాం! ఖబడ్దార్!

రైతుల బతుకులపై నీళ్లు!





నాటు వేసిన పొలం ఇసుకలో మునిగింది

➤ రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని ఈ మధ్యనే వరి నాట్లు వేయించా. భారీ వర్షాలతో పాలేరు రిజర్వాయర్ అలుగు పోసింది. ఆ వరదతో పొలం మునిగి ఇసుక మేట వేసింది. రూ.40 వేల వరకు పెట్టిన పెట్టుబడి వరద పాలైంది. ఈ ఇసుకను తీయడానికి, మళ్లీ సాగు చేయడానికి అప్పు తేవాల్సిందే.
– భూక్యా ఉపేందర్, హాట్యతండా, కూసుమంచి మండలం, ఖమ్మం జిల్లా

- భారీ వరదలతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కుదేలైన వ్యవసాయం
- పది రోజుల వానతో 226 మండలాలు అతలాకుతలం
- వరుసగా మూడో ఏడాదీ నష్టపోయిన రైతులు
- ఆస్తులు, ప్రాణనష్టం నుంచి ఇంకా తేరుకోని పల్లెలు

రాష్ట్రంలో వరద నష్టం (ప్రాథమిక అంచనా)

వరద ప్రభావిత మండలాలు	226
బాధిత గ్రామాలు	2,067
దెబ్బతిన్న వరి, పత్తి, ఇతర పంటలు	2,08,751 ఎకరాలు
మృతుల సంఖ్య	42 మంది
మృతి చెందిన పశువులు	109
పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లు	219
పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు	5,980
దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్లు	101 కి.మీ.
దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లు	231 కి.మీ.
గండ్లు, బుంగలు పడిన చెరువులు, కుంటలు	512
మొత్తం నష్టం అంచనా	రూ.2,100 కోట్లు

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్రవ్యాప్తంగా పదిరోజుల పాటు కురిసిన భారీ వర్షాలు వేల గ్రామాలను అతలాకుతలం చేశాయి. ముఖ్యంగా గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఉప నదులు, వాగులు ముంచెత్తి రైతుల ఆశలపై నీళ్లుచల్లాయి. రెండేళ్ల కిందటి షాక్ నుంచి రైతులు పూర్తిగా కోలుకోకముందే.. మొలక దశలోని పంటలను వరదలు తుడిచిపెట్టాయి. మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పోటెత్తిన గోదావరి, ఉప నదులతో పొలాల్లో భారీగా ఇసుక మేటలు పడ్డాయి. నది సమీప మండలాల ప్రజలను కదిలిస్తే కన్నీరే ఎదురవుతోంది.

ఇంకా తేరుకోని జనం..: భారీ వర్షాలు, వరదల నష్టం నుంచి బాధితులు ఇంకా కోలుకోలేదు. ఉమ్మడి వరంగల్,

మిగతా 5వ పేజీలో ▶



బుధవారం వరంగల్ హంటర్‌రోడ్డు ఎన్టీఆర్ నగర్‌లో బురదలో నుంచి నడుస్తున్న గవర్నర్ తమిళి సై

వరద సాయంపై కేంద్రానికి లేఖ రాస్తా

- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వరంగల్‌లోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన

వరంగల్ అర్బన్/హసన్‌పర్తి: వరంగల్ నగరంలో వరద ముంపునకు గురై సర్వస్వం కోల్పోయిన బాధితులకు సాయం కోరుతూ కేంద్రానికి లేఖ రాస్తానని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలో దెబ్బతిన్న ప్రాంతాలను బుధవారం ఆమె సందర్శించారు. జవహర్‌కాలనీ,

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

సహజ వనరులను కాపాడుకోవడం మన బాధ్యత: రాష్ట్రపతి ముర్ము



సాక్షి, హైదరాబాద్: పర్యావరణం, సహజ వనరులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ సంక్షోభం, వాతావరణ అత్యవసర పరిస్థితులపై చర్చించడానికి 'వాక్ ఫర్ వాటర్'సంస్థ బృందం బుధవారం భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసింది. ఈ సందర్భంగా భవిష్యత్ తరాలకు పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచేందుకు చేపట్టే సామాజిక కార్యక్రమాలకు మద్దతిచ్చేందుకు రాష్ట్రపతి తన సుముఖతను వ్యక్తం చేశారని బృందం సభ్యులు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన ''గ్రీన్ ఇండియా చాలెంజ్'' కార్యక్రమం దేశం అంతటా విస్తరించేస్థాయికి తీసుకెళ్లేందుకు ఆయన చేస్తున్న కృషిని రాష్ట్రపతికి వివరించారు. ముర్మును కలిసిన బృందంలో వాక్ ఫర్ వాటర్ సభ్యులు కరుణాకర్‌రెడ్డి, ఎం.వీరన్న, కృష్ణతేజారెడ్డి, మాస్టర్ పవన్‌కృష్ణ రెడ్డి తదితరులు ఉన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

రాజకీయ పార్టీల నేతలతో సీఈఓ వికాస్‌రాజ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ విజ్ఞప్తి చేశారు. శాసనసభ ఎన్నికలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఈవీఎంలు తదితర అంశాలపై బుధవారం ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల నేతలతో బుధవారం సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు.

వీర శైవలింగాయత్, లింగ బలిజలను

ఓబీసీ జాబితాలో చేర్చాలి

జంతర్‌మంతర్‌లో మహాదీక్ష చేసిన వీరశైవ లింగాయత్, లింగ బలిజలు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీసీలుగా ఉన్న వీరశైవ లింగాయత్, లింగ బలిజ కులాన్ని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం మహాదీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఆర్.కృష్ణయ్య, మస్తాన్‌రావు, బీఆర్‌ఎస్ ఎంపీ బడుగు లింగయ్య యాదవ్, డీఎంకే ఎంపీ విల్సన్, మాజీ ఎంపీలు సురేశ్ షెట్కార్, పొన్నం ప్రభాకర్, రాపోలు ఆనంద భాస్కర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పట్లోళ్ల సంగమేశ్వర్, వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ వీరశైవ లింగాయత్, లింగ బలిజలు కేంద్ర ఓబీసీ జాబితాలో లేనందువల్ల కేంద్రస్థాయిలో నష్టపోతున్నారన్నారు. ఈ రెండు కులాలను కేంద్ర జాబితాలో చేర్చేంతవరకూ తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

వీఆర్‌ఎస్ తీసుకున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

రాజకీయాల్లో చేరనున్నట్లు ప్రకటన



ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూ క్యాంపస్ న్యాయ కళాశాలలో 20 ఏళ్లుగా అధ్యాపకుడిగా పని చేస్తున్న గాలి వినోద్‌కుమార్ తన ఉద్యోగానికి వాలంటరీ రిటైర్మెంట్ (వీఆర్‌ఎస్) తీసుకున్నారు. వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా ఓయూ అధికారులు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆయన సమాజ మార్పు కోసం త్వరలో రాజకీయాల్లో చేరనున్నట్లు తెలిపారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ నుంచి ఆయన ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు.

కల్లుగీత సొసైటీలకు 30% మద్యం షాపులు కేటాయించాలి


తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): రాష్ట్రంలో కల్లుగీత సొసైటీలకు 30 శాతం మద్యంషాపులను కేటాయించాలని అందుకు తగిన జీవోను విడుదల చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. కల్లుగీత సొసైటీలకు లైసెన్స్, బార్లు, వైన్స్ షాపులలో 30 శాతం కోటా కేటాయించాలని కోరారు. వీరితోపాటు ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, ఆరె కటికలకు 5 శాతం మద్యం దుకాణాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరానికి కరెంట్ కష్టాలు!

అడిగినప్పుడు సరఫరా ఇవ్వని ట్రాన్స్‌కో

- ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే సరఫరా
- నిరంతరాయంగా నడవలేకపోతున్న పంపులు
- తరచూ నిలిపేయాల్సి రావడంతో పంపుల్లో సమస్యలు
- ప్రాజెక్టు నిర్వహణకు 5391 మెగావాట్ల కరెంట్ అవసరం



సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మక కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి అప్పుడే కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. పంప్‌హౌజ్‌ల నిర్వహణకు అవసరమైన నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు తెలంగాణ ట్రాన్స్‌కో సంసిద్ధతను వ్యక్తం చేయడం లేదు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మాత్రమే విద్యుత్‌ను వినియోగించుకోవడానికి నీటి పారుదల శాఖకు అనుమతిస్తోంది. సౌర విద్యుదుత్పత్తి లభ్యత ఉండే పగటి వేళల్లోనే ప్రాజెక్టుకు విద్యుత్ సరఫరా చేసేందుకు ట్రాన్స్‌కోలోని లోడ్ డిస్పాచ్ సెంటర్(ఎల్డీసీ) స్థానిక సబ్ స్టేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తోంది. నిరంతరంగా నడపాలనే ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా ప్రాజెక్టు పంపులను డిజైన్ చేయగా, నిరంతర విద్యుత్ లేక తరచుగా పంపులను ఆపాల్సి వస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఇప్పటికే కొన్ని చోట్లలోని పంపుల్లోని విడిభాగాలు దెబ్బతిన్నాయని ఓ సీనియర్ ఇంజనీర్ 'సాక్షి'కి తెలియజేశారు.

వాడింది 240 మెగావాట్లే!

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ప్రాజెక్టు నిర్వహణ అవసరాలకు మొత్తం 5391.56 మెగావాట్ల విద్యుత్ అవసరం కానుంది. ప్రాజెక్టులో భాగంగా 109 పంపులను నిర్మించారు. ప్రస్తుత వానాకాలం ప్రారంభంలో వర్షాలు లేకపోవడంతో గత నెల తొలివారంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మిడ్‌మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయకమ్మసాగర్‌లలోకి నీళ్లను ఎత్తిపోశారు. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీళ్లను ఎత్తిపోసే పంప్‌హౌజ్‌లో చెరో 106 మెగావాట్ల సామర్థ్యం గల 4 పంపులు ఉండగా, ఒకే పంప్‌ను నడిపారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్‌కి నీళ్లను ఎత్తిపోసే పంప్‌హౌజ్‌లో చెరో 134 మెగావాట్ల సామర్థ్యం గల 4 పంపులుండగా, అక్కడ సైతం ఒకే పంప్‌ను నడిపారు. దాదాపు 10 రోజుల పాటు పగటి వేళల్లో పంపులను నడిపి 3 టీఎంసీల వరకు నీళ్లను ఎత్తిపోసినట్టు నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. మళ్లీ వర్షాలు ప్రారంభం కాగా పంపింగ్‌ను నిలుపుదల చేశారు. రెండు పంపులు కలిపి మొత్తంగా 240 మెగావాట్ల విద్యుత్ అవసరం కాగా, పగటి పూట మాత్రమే సరఫరా చేసేందుకు ట్రాన్స్‌కో అనుమతిచ్చింది.

యాదాద్రి విద్యుత్ వస్తే..

తీవ్ర వర్షాభావ సమయాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు చాలా ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన తర్వాత ఇలాంటి సందర్భాల్లో పూర్తి సామర్థ్యంతో నీళ్లను ఎత్తిపోయడానికి గరిష్టంగా 5391.56 మెగావాట్ల విద్యుత్ అవసరం కానుంది. ఓ వైపు రాష్ట్రంలోని అన్ని వర్గాల వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరాను కొనసాగిస్తూ కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ మేరకు విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేయడంట్రాన్స్‌కోకు పెను సవాలేనని భావిస్తున్నారు. నిర్మాణం చివరి దశలో ఉన్న 4000 మెగావాట్ల యాదాద్రి, 1600 మెగావాట్ల తెలంగాణ ఎన్టీపీసీ థర్మల్ విద్యుత్ కేంద్రాలు పూర్తయితే కాళేశ్వరం ప్రాజెక్టుకు విద్యుత్ కష్టాలు తప్పే అవకాశాలున్నాయి.

కాళేశ్వరం ప్రాజెక్టు విద్యుత్ అవసరాలను పంప్‌హౌజ్‌ల వారీగా కింది పట్టికలో చూడవచ్చు..

పంప్ హౌజ్	పంపుల సంఖ్య	పంపుల మొత్తం సామర్థ్యం (మెగావాట్లలో)
లక్ష్మీ	17	680
సరస్వతి	12	480
పార్వతి	14	560
నంది	7	870
గాయత్రి	7	973
అన్నపూర్ణ	4	424
రంగనాయకసాగర్	4	537.76
ఎస్‌కేఎంఎస్	8	344
అక్కారం	6	162
మర్కూక్	6	204
రాంపూర్	8	52
రాజేశ్వరరావుపేట	8	52
ముక్పల్	8	52
మొత్తం	109	5391.56

తెలంగాణ ఎన్నికలకు కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ

▶ మొదటి పేజీ తరువాయి



సిద్దిఖీ మేవానీ రాథ్రే ఉత్తమ్

నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డికి స్థానం కల్పించడం ద్వారా కాంగ్రెస్ అధిష్టానం ఆయనకు తగిన ప్రాధాన్యత కల్పించింది. ఈ కమిటీల్లో సాధారణంగా ఆయా రాష్ట్రాలకు చెందిన పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి, ఆయా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే ఏఐసీసీ కార్యదర్శులకు మాత్రమే చోటు కల్పిస్తారు. ఇతర నేతలకు అవకాశమిచ్చినప్పటికీ సామాజిక వర్గాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఈసారి రాష్ట్రం కోసం ఏర్పాటు చేసిన కమిటీలో పీసీసీ అధ్యక్షుడి సామాజిక వర్గానికే చెందిన ఉత్తమ్‌ను నియమించడం గమనార్హం. ఇలా చాలా తక్కువ సందర్భాల్లో మాత్రమే జరుగుతుందని, ఉత్తమ్‌కు అధిష్టానం అరుదైన గౌరవాన్ని ఇచ్చిందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

అసంఘటిత రంగం వల్లనే పాల ఉత్పత్తిలో సమస్యలు

డెయిరీ డెవలప్‌మెంట్ సహకార సమాఖ్య చైర్మన్ సోమా భరత్ కుమార్



సాక్షి, హైదరాబాద్: పాల ఉత్పత్తి, పంపిణీల్లో అత్యధిక శాతం అసంఘటిత రంగంలోనే ఉండిపోవడం అనేక సమస్యలకు దారితీస్తోందని.. వీటిని పరిష్కరించేదుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ సహకార సమాఖ్య చైర్మన్ సోమా భరత్‌కుమార్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో సహకార రంగం బలంగా ఉండేదని కానీ కొందరు ఈ వ్యవస్థలను నాశనం చేయడంతో ఇప్పుడు ఉత్పత్తి తగ్గిపోవడమే కాకుండా కల్తీ ఉత్పత్తులతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. శీతలీకరణ యంత్రాల తయారీ సంస్థ 'రాక్‌వెల్'ఇండస్ట్రీస్ నగరంలో ఏర్పాటు చేసిన తొలి 'ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను ప్రారంభించిన సోమా భరత్‌కుమార్ ఆ తరువాత మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో సహకార సంఘాల వ్యవస్థను మళ్లీ బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఐదు లక్షల లీటర్ల సామర్థ్యమున్న మెగా డెయిరీ త్వరలోనే హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాక్‌వెల్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ గుప్తా పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ మా విజయమే: రేవంత్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ సాగించిన ఉద్యమాలు, పోరాటాలతో రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన ఒత్తిడి ఫలితంగానే రాష్ట్రంలోని రైతాంగానికి రుణమాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, ఇది కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ విజయమేనని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన కాంగ్రెస్ ప్రతినిధి బృందం రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేసిందని, రుణమాఫీ వారం రోజుల్లో అమలు చేయకపోతే బ్యాంకుల ముందు ధర్నాలు చేస్తామని హెచ్చరించామని, కేసీఆర్ మెడలు వంచి రైతు రుణమాఫీని సాధించామని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసీఆర్ అసమర్థత కారణంగానే రుణమాఫీ నాలుగేళ్ల ఆలస్యం అయిందని, రుణమాఫీని అన్ని వడ్డీలతో కలిపి చెల్లించాలని, రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగేంతవరకు వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ ప్రకటనలో రేవంత్ వెల్లడించారు.

లాటరీనే...

- పాత నిబంధన ప్రకారమే 2023–25 సంవత్సరాలకు వైన్‌షాపుల కేటాయింపు
- ఉత్తర్వులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి
- రూ.2వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వ అంచనా



సాక్షి, హైదరాబాద్: వచ్చే రెండేళ్లకు ఏ4 (వైన్) షాపులకు లైసెన్సులు కేటాయించే ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు లైసెన్సుల జారీకి సంబంధించిన నిబంధనలతో కూడిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. సీఎస్ శాంతికుమారి జారీ చేసిన జీఓ నంబరు 86 ప్రకారం పాత పాలసీలోని నిబంధనల ప్రకారం ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి, నవంబర్ 30, 2025 వరకు మద్యం విక్రయించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 2,620 షాపులకు లైసెన్సులు జారీ చేస్తారు. ఇందుకు లాటరీ పద్ధతినే పాటిస్తారు. దరఖాస్తు ఫీజు కూడా గతంలో లాగానే రూ.2లక్షలుగా ఉంటుంది. ఎక్సైజ్ ఫీజు శ్లాబులూ, ఇతర నిబంధనలన్నీ గత పాలసీ మేరకే ఉంటాయి. గతంలో మాదిరిగానే గౌడ సామాజికవర్గానికి 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారు. ఈ రిజర్వేషన్ల ప్రకారమే జనాభా ప్రాతిపదికన ఏ జిల్లాలో ఎన్ని షాపులు కేటాయించాలో బుధవారమే నిర్ణయించారు. ఈ షాపుల సంఖ్య ప్రకారం గురువారం ఆయా జిల్లాల కలెక్టర్లు డ్రాలు నిర్వహించి ఏ షాపులు ఏ ఏ వర్గాలకు కేటాయించాలో నిర్ణయిస్తారు. ఇతర షాపులకు కూడా లాటరీ పద్ధతిలోనే లైసెన్సులు ఇస్తారు. లాటరీ ప్రక్రియ జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో గతంలో నిర్వహించిన విధంగానే జరుగుతుందని తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వైన్ షాపుల కేటాయింపు ద్వారా ఈసారి కూడా రూ.2వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

ఏ4 షాపుల కేటాయింపు నిబంధనలు ఇలా...

- లైసెన్సులకు గత పాలసీ మాదిరిగానే దరఖాస్తు చేసుకోవాలి. ఫీజులోనూ ఎలాంటి మార్పు లేదు. రూ.2లక్షలు దరఖాస్తు కోసం చెల్లించాలి. లాటరీ వచ్చినా రాకపోయినా ఆ డబ్బులు ప్రభుత్వానికే జమవుతాయి. ఒకరు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు కూడా చేసుకోవచ్చు.
- రెండేళ్ల పాటు మద్యం విక్రయించుకునే ఫీజు గతంలోలాగే ఉంచారు. పాత స్లాబుల ప్రకారమే ఫీజులు నిర్ధారించారు. 5వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో సంవత్సరానికి రూ.50 లక్షలు, 5–50వేల జనాభా వరకు రూ.55 లక్షలు, 50వేల నుంచి లక్ష జనాభా వరకు రూ.60లక్షలు, లక్ష నుంచి 5లక్షల జనాభా వరకు రూ.65లక్షలు, 5 నుంచి 20లక్షల జనాభా వరకు రూ.85లక్షలు, 20లక్షల పైన జనాభా ఉన్న ప్రాంతాల్లో షాపులకు రూ.1.10 కోట్లు ఎక్సైజ్ ఫీజుగా నిర్ణయించారు.
- జీహెచ్ఎంసీ పరిధిలోని షాపులకు వర్తించే స్లాబు, జీహెచ్ఎంసీకి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండే షాపులకు, ఇతర కార్పొరేషన్లకు వర్తించే స్లాబులను కూడా ఐదు కిలోమీటర్ల పరిధిలోని షాపులకు వర్తింపజేస్తారు. మున్సిపాలిటీలకు వర్తించే స్లాబును ఆయా మున్సిపాలిటీలకు రెండు కిలోమీటర్ల దూరంలోని షాపులకు కూడా వర్తిస్తుంది.
- లైసెన్స్ ఫీజు ప్రతి ఏడాది ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చు. అంటే రెండేళ్లలో 12 సార్లు ఫీజు చెల్లించాలి. ఇందుకు సంబంధించి బ్యాంకు గ్యారెంటీ కింద మొత్తం ఫీజులో 25 శాతానికి ఇస్తే సరిపోతుంది.
- గతంలో మాదిరిగానే దరఖాస్తుతోపాటు ధరావతు (ఈఎండీ) చెల్లించాల్సిన అవసరం ఉండదు.
- మద్యం విక్రయాల ద్వారా లైసెన్సీలకు కమిషన్ (మార్జిన్) కూడా గతంలో ఉన్న విధంగానే నిర్ణయించారు. వార్షికఫీజు కంటే 10 రెట్ల టర్నోవర్ వరకు 27 శాతం మార్జిన్ ఇస్తారు. మీడియం, ప్రీమియం బ్రాండ్లపై 20 శాతం, బీర్లపై 20 శాతంగా మార్జిన్ నిర్ధారించారు. పదిరెట్ల టర్నోవర్ దాటిన తర్వాత మాత్రం అన్ని బ్రాండ్లకు 10శాతం మార్జిన్ మాత్రమే ఇస్తారు.
- పర్మిట్‌రూం కోసం అదనంగా ఏడాదికి రూ.5లక్షలు చెల్లించాలి. వాకిన్‌స్టోర్ కావాలంటే మరో రూ.5లక్షలు చెల్లించాలి.
- జీహెచ్ఎంసీ, పరిసర ప్రాంతాల్లోని షాపులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, ఇతర ప్రాంతాల్లోని షాపులు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు విక్రయాలు జరుపుకోవచ్చు. మద్యం బాటిల్ లేబుల్‌పై ఉన్న ధరకు మాత్రమే విక్రయించాలి. ప్రతి షాపులో మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. దరఖాస్తు ప్రక్రియ ద్వారా కేటాయింపబడని షాపులకు మళ్లీ టెండర్లు పిలవాలా లేక అవుట్‌లెట్లు ఏర్పాటు చేయాలా అనే దానిపై ఎక్సైజ్ కమిషనర్ నిర్ణయం తీసుకుంటారు.

మద్యం లాటరీల షెడ్యూల్ ఇలా..

ప్రక్రియ	తేదీ
గౌడ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసిన షాపుల ఎంపిక	ఆగస్టు 03, 2023
నోటిఫికేషన్ జారీ.. దరఖాస్తుల స్వీకరణ	ఆగస్టు 04, 2023
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ	ఆగస్టు18, 2023 (సాయంత్రం ఆరు గంటల వరకు)
లాటరీల నిర్వహణ	ఆగస్టు21, 2023
తొలి వాయిదా ఫీజు చెల్లింపు	ఆగస్టు 21, 22 తేదీల్లో
కొత్త షాపులకు స్టాక్ ఇచ్చేది	నవంబర్ 30, 2023 నుంచి
కొత్త షాపులు తెరిచేది	డిసెంబర్1, 2023 నుంచి

సీఎం కేసీఆర్ డిజైన్లతోనే విపత్కర పరిస్థితులు

- అశాస్త్రీయంగా కాళేశ్వరం, సీతారామ సాగర్ ప్రాజెక్టులు
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: 'రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును అశాస్త్రీయంగా కట్టింది.. సీతారామసాగర్ ప్రాజెక్టును సైతం అశాస్త్రీయంగా నిర్మిస్తున్న కారణంగా వరదలు వచ్చినప్పుడు తీవ్రత ఎక్కువగా ఉంటోందని సీఎల్పీనేత మల్లు భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదలు, విపత్తుల నిర్వహణలో చురుగ్గా ఉండి ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వ యంత్రాంగం స్తబ్దుగా ఉన్న కారణంగా రాష్ట్రంలో ఈ పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు. ప్రాజెక్టు డిజైన్లు ఇంజనీర్లు రూపొందించాల్సి ఉండగా, సీఎం కేసీఆర్ స్వయంగా రూపొందించిన కారణంగా వరద ప్రభావం ఉందని భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వ్యక్తుల ఆధారంగా కాకుండా, సిద్ధాంతాలపై నడుస్తోందన్నారు. ఇతర పార్టీల్లో స్వేచ్ఛ, అంతర్గత ప్రజాస్వామ్యం లేని కారణంగానే ఎక్కువమంది కాంగ్రెస్‌లో చేరుతున్నారని భట్టి తెలిపారు. కాంగ్రెస్‌లో టికెట్ల విషయంలో ముందుగా హామీలు ఇవ్వడం ఉండదని.. శాస్త్రీయంగా సర్వేలు చేసి, అభ్యర్థుల విజయావకాశాలను అంచనా వేసిన తర్వాతే అధిష్టానం ఖరారు చేస్తుందన్నారు.

రుణమాఫీ మళ్లీ షురూ

▶ మొదటి పేజీ తరువాయి

చేశారు. ఇప్పటికే అందించిన రుణమాఫీ పోను మరో రూ.19 వేల కోట్ల రుణమాఫీని రైతులకు అందించాల్సి ఉందని తెలిపారు.

బకాయిలు చెల్లించిన వారికే మాఫీ వర్తింపు!

లక్షలోపు పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తోంది. ఇప్పటివరకు రూ.36 వేల వరకు బకాయిలను మాత్రమే ప్రభుత్వం విడుదల చేయగా.. ఇప్పుడు మిగిలిన వారికీ మాఫీ సొమ్మును ప్రభుత్వం అందజేయనుంది. అయితే చాలామంది రైతుల నుంచి రైతుబంధు సొమ్మును బ్యాంకులు రుణమాఫీ కింద తీసుకున్నాయి. మరోవైపు కొత్త రుణం పొందాలంటే రెన్యువల్ చేయాల్సి ఉంటుంది కాబట్టి రైతులు బకాయిలు చెల్లించినట్లైతే తర్వాత రుణమాఫీ సొమ్మును వారి ఖాతాల్లో వేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కొందరు రైతులు సొంతగా బ్యాంకులకు చెల్లింపులు చేశారు. కొందరు మాత్రం చెల్లించలేకపోయారు. దీంతో లక్షలాది మంది రైతులు డిఫాల్టర్లుగా మారినట్లు అంచనా. కాగా కొత్త రుణాల రెన్యువల్ కోసం బ్యాంకులకు రుణం చెల్లించిన రైతులకు సైతం ఇప్పుడు రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడించాయి. గతంలో ప్రభుత్వం ప్రకటించిన రైతుల జాబితా ప్రకారమే సొమ్మును వారివారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం మరోసారి స్పష్టత ఇవ్వాల్సి ఉందని అధికారులు అంటున్నారు. రూ.19 వేల కోట్ల చెల్లింపుతో రూపాయి కూడా మిగలకుండా తెలంగాణలో సంపూర్ణ 'రైతు రుణమాఫీ'కార్యక్రమం పూర్తి కానుందని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మొత్తం 42 లక్షల ఖాతాలకు సంబంధించి రుణమాఫీ జరగనుంది. తద్వారా 29.61 లక్షల రైతు కుటుంబాలు లబ్ధి పొందనున్నాయని ప్రభుత్వం ప్రకటించింది.

అభివృద్ధిని చూడలేకే చిల్లర మాటలు..

▶ మొదటి పేజీ తరువాయి

రెగ్యులరైజేషన్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం కేటీఆర్ మాట్లాడారు.

దేశంలో నంబర్‌వన్‌గా నిలిపాం

'ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసి చూడు'అని సామెత ఉందని, తెలంగాణ ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇవ్వడంతోపాటు పేద అమ్మాయిల పెళ్లికి ఆర్థిక సాయం కూడా చేస్తోందని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును అతి తక్కువ కాలంలో పూర్తిచేశామని, రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికి సురక్షిత తాగునీరు ఇచ్చామని పేర్కొన్నారు. నల్లగొండ ఫ్లోరైడ్, పాలమూరు వలసల సమస్యలు తొలగిపోయాయని పేర్కొన్నారు. గతంలో గాంధీ, ఉస్మానియా, నిమ్స్ మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండేవని.. ఇప్పుడు హైదరాబాద్ నలుమూలలా 10వేల బెడ్లతో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే ఆస్పత్రుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు.

వేల కుటుంబాలకు లబ్ధి: సుధీర్‌రెడ్డి

తాను కాంగ్రెస్‌లో ఉన్నప్పట్నుంచే రిజిస్ట్రేషన్లపై ఆంక్షల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నానని, దీనికోసమే బీఆర్ఎస్‌లో చేరానని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చెప్పారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్‌గుప్తా, ఎగ్గె మల్లేశం, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'రైతు రుణమాఫీ'పై నేడు బీఆర్ఎస్ సంబరాలు

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో గురువారం రాష్ట్రవ్యాప్తంగా సంబరాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావు పిలుపునిచ్చారు. రుణమాఫీ కార్యక్రమాన్ని వెంటనే పూర్తి చేయాలని సీఎం నిర్ణయించడంపై కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో రైతులందరితో కలిసి పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించుకోవాలన్నారు. అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం అవుతున్నప్పటికీ ఎమ్మెల్యేలు ఈ సంబరాల తాలూకు కార్యక్రమాలను సమన్వయం చేసుకోవాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, రైతుబంధు సమితులతో పాటు సహకార సంఘాల ప్రతినిధులు ఈ సంబరాల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వచ్చే ఐదేళ్లలో పదివేల ఉద్యోగాలు

'వీఎక్స్ఐ' కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి కేటీఆర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/మాదాపూర్: దేశం నలుమూలల నుంచి తరలివస్తున్న ప్రతిభాపాటవాలు కలిగిన యువతకు హైదరాబాద్ నిలయంగా మారుతోందని మంత్రి కేటీ రామారావు అన్నారు. కస్టమర్ మేనేజ్మెంట్ పరిష్కారాలు, బిజినెస్ ట్రాన్స్‌ఫర్మేషన్ సేవల్లో ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన 'వీఎక్స్ఐ' హైదరాబాద్ తొలి కార్యాలయాన్ని కేటీఆర్ బుధవారం ప్రారంభించారు. హైదరాబాద్‌లో సంస్థ అభివృద్ధికి సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఆధునిక సాంకేతికతతో ఏర్పాటవుతున్న తమ సంస్థ ఈ ఏడాది చివరి నాటికి ఉద్యోగాలు కల్పిస్తుందని, వచ్చే ఐదేళ్లలో 10 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. భారత్‌లో తమ దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించినట్లు వీఎక్స్ఐ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జేర్డ్ మోరిసన్ వెల్లడించారు. ఉద్యోగులు నైపుణ్యాలు పెంచుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకునేలా తమ సంస్థ చేయూతను ఇస్తుందని సంస్థ ప్రతినిధి సుబీర్ చక్రవర్తి వెల్లడించారు.

రక్షణలో 'ఆత్మనిర్భరత' దిశగా బీడీఎల్

ఆకాశ్ క్షిపణి మొదటి రేడియో ఫ్రీక్వెన్సీ సీకర్‌ను డీఆర్‌డీఎల్‌కు అప్పగించిన భారత్ డైనమిక్స్



డీఆర్‌డీవో చైర్మన్ సమీర్‌కు ఆర్‌ఎఫ్ సీకర్‌ను అందజేస్తున్న బీడీఎల్‌చైర్మన్ మాధవరావు

సాక్షి, హైదరాబాద్: అత్యాధునిక సీకర్ ఫెసిలిటీ సెంటర్(ఎస్ఎఫ్‌సీ)లో ఆకాశ్ క్షిపణి కోసం ఉత్పత్తి చేసిన తొలి రేడియో ఫ్రీక్వెన్సీ (ఆర్ఎఫ్) సీకర్‌ను డీఆర్‌డీవోకు భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) అప్పగించింది. భూమి మీది నుంచి గాలిలోకి, గాలిలో నుంచి గాలిలోకి మిస్సైల్స్‌ను ప్రయోగించినప్పుడు లక్ష్య సాధన కోసం ఉపయోగించే క్లిష్టమైన టెక్నాలజీ కలిగిన ఇంటెన్సివ్ సబ్ సిస్టమ్‌నే సీకర్‌గా పేర్కొంటారు. ఈ రేడియో ఫ్రీక్వెన్సీ సీకర్‌ను డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) రీసెర్చ్ సెంటర్ ఇమారత్‌లో రూపొందించగా, బీడీఎల్ కంచన్‌బాగ్ యూనిట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్‌సీలో ఉత్పత్తి చేశారు. కంచన్‌బాగ్ యూనిట్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో బీడీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎ. మాధవరావు తొలి ఆర్ఎఫ్ సీకర్‌ను డీఆర్‌డీఓ చైర్మన్, కార్యదర్శి డాక్టర్ సమీర్ వి కామత్‌కు అందజేశారు.

దేశ రక్షణ సామర్థ్యాలలో ముందడుగు

ఈ సందర్భంగా కామత్ మాట్లాడుతూ బీడీఎల్‌లో సీకర్ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఆర్ఎఫ్ సీకర్ ఉత్పత్తి రంగంలో భారత్ స్వయం ప్రతిపత్తిని సాధించి, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేయడంలో దోహదపడుతుందన్నారు. బీడీఎల్ సీఎండీ మాధవరావు మాట్లాడుతూ ఈ విజయం దేశ రక్షణ సామర్థ్యాలలో ముందడుగని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త యు.రాజాబాబు, డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త, డైరెక్టర్ జి.ఎ. శ్రీనివాసమూర్తి, ఆర్‌సీఐ డైరెక్టర్ అనింద్య బిశ్వాస్, ఏఏస్ఎల్ డైరెక్టర్ బి.వి.పాపారావు, బీడీఎల్ డైరెక్టర్ ఎన్. శ్రీనివాసులు, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ వెన్నం ఉపేందర్, బీడీఎల్ భానూర్ యూనిట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.ఆర్.ప్రధాన్ (రిటైర్డ్), బీడీఎల్ ఈడీ (కంచన్‌బాగ్) పీవీ రాజా రామ్, బీడీఎల్ జీఎం ఎం. శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

అసెంబ్లీలా నడపండి.. లేదా పేరు మార్చేయండి

బీజేపీ నేత, మాజీ ఎంపీ బూరనర్సయ్య



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీని గడీ, బడి మాదిరిగా కాకుండా ఒక శాసనసభలా నడిపించాలని లేదా అసెంబ్లీ పేరును మార్చేయాలని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూరనర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. దొర గడీలో ఆదేశాలిచ్చినట్టు, బడిలో హెడ్మాస్టర్ లాగా ఆర్డర్లు వేసి ఏకపక్షంగా నడిపించొద్దని, ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని సూచించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కనీసం 15 రోజులు సమావేశాలు నిర్వహించాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై దృష్టితోనే ఆర్టీసీ విలీనంపై కేసీఆర్ ఆదరబాదరాగా నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ఈ నెల 6న 21 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని నర్సయ్య తెలిపారు. మోదీ చేసేదే చెబుతారని.. కేసీఆర్ కూడా ఆయనను చూసి నేర్చుకుంటే మంచిదని సూచించారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

ఏబీవీపీ జాతీయ కార్యదర్శి అంకిత పవార్



పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయకపోతే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) జాతీయ కార్యదర్శి అంకిత పవార్ హెచ్చరించారు. మంగళవారం నిర్వహించిన కదనభేరీ సభ ప్రారంభం మాత్రమే అని ముందు ముందు ఈ ప్రభుత్వానికి సినిమా చూపిస్తామన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీతో కలిసి ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో కుటుంబపాలనతో రాష్ట్రాన్ని దోచు కుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ క్వీన్‌గా దేశవ్యాప్తంగా ప్రచారం పొందారని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు కేజీ టు పీజీ ఉచిత విద్య అని చెప్పి ఎన్నికలు కాగానే ఆ హామీనే విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్ నిర్ణయాలపై సంబరాలా?: షర్మిల



సాక్షి, హైదరాబాద్: వరద బాధితులకు సాయం అందక చస్తుంటే..కేసీఆర్ చారిత్రక నిర్ణయాలపై సంబురాలా అంటూ వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. వర్షాలకు ఇళ్లు కూలి, వరదల్లో కొట్టుకుపోయి 41 మంది ప్రాణాలు పోతే మీకు సంతోషమా అని బుధవారం ట్విట్టర్ వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 10 వేల ఎకరాల్లో పంటలు మునిగి రూ.2 వేల కోట్ల నష్టం జరిగితే మీకు సంబరమా అని నిలదీశారు. చరిత్రాత్మక నిర్ణయాలు అంటే రుణమాఫీ చేయకపోవడమా, నిరుద్యోగ భృతి ఎగ్గొట్టడమా, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వకపోవడమా, ఇంటికో ఉద్యోగం ఇవ్వకపోవడమా అని దుయ్యబట్టారు. సిగ్గు లేకుండా వరద బాధితులకు రూ.10 వేలు ఎగ్గొట్టిన చరిత్ర కేసీఆర్‌దని ఆమె విమర్శించారు. మోసపూరిత హామీలిచ్చిన కేసీఆర్‌కు చేయాల్సింది సంబురాలు కాదని బడితపూజ అని అన్నారు.

ఆర్టీసీ కార్మికులపై కేసీఆర్‌ది కపట ప్రేమ: రాములు



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికులపై సీఎం కేసీఆర్‌ది కపట ప్రేమ అని, వారిని మరోసారి మోసం చేసేందుకే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాములు నాయక్ ఆరోపించారు. ఆర్టీసీ కార్మికులందరూ తనకు వ్యతిరేకంగా ఉన్నారనే ఆలోచనతో ఎన్నికల్లో లబ్ధి పొందాలనే వ్యూహంతోనే కేబినెట్‌లో హడావుడి నిర్ణయం తీసుకున్నారని బుధవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో వ్యాఖ్యానించారు. నిజంగా ఆర్టీసీ కార్మికులపై కేసీఆర్‌కు ప్రేమ ఉంటే సమ్మె కాలంలో కార్మికులకిచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేకపోయారని ప్రశ్నించారు. విలీనంపై ఏర్పాటు చేసిన సబ్ కమిటీలో కూడా కార్మికులకు స్థానం ఎందుకు కల్పించలేదని నిలదీశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ 2018 మేనిఫెస్టోలో చెప్పిందని రాములు గుర్తుచేశారు.

బీసీల అవకాశాలు హరిస్తున్నారు: దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 72 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 60% బీసీలున్నా ఈ స్థానాల్లో సగానికి పైగా ఆధిపత్య కులపాలకులే రాజ్యమేలుతూ వారి అవకాశాలను హరించివేస్తున్నారని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ మండిపడ్డారు. ప్రధాన పార్టీలు బీసీలకు టికెట్లు ఇస్తామని చెబుతున్నారే కానీ టికెట్లు కేటాయించలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీవాదాన్ని బలంగా వినిపించి మెజార్టీ సీట్లను బీసీలు కైవసం చేసుకునేలా ముందుకు సాగుతామని వివరించారు.

ముఖ్య నేతలంతా అసెంబ్లీకే!

బీజేపీ అగ్ర నాయకత్వం నిర్ణయం..

- వెంటనే సన్నద్ధం కావాలని రాష్ట్ర నేతలకు సూచన
- ఇకపై చేరికల వేగం మరింత పెంచాలని ఆదేశాలు
- నియోజకవర్గాల్లో వివిధ కార్యక్రమాల నిర్వహణ
- ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు సీట్లలో ప్రత్యేక ప్రణాళికలు అమలు
- బీఆర్‌ఎస్ వైఫల్యాలను నిలదీసేలా కార్యాచరణ
- ఈ నెల 20 నుంచి రాష్ట్ర నియోజకవర్గాల్లో ఇతర రాష్ట్రాల బీజేపీ ఎమ్మెల్యేల పర్యటనలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో బీజేపీ తన వ్యూహాలకు పదునుపెడుతోంది. దక్షిణాదిలో పార్టీ విస్తరణ, తెలంగాణలో అధికార సాధన లక్ష్యంగా కార్యాచరణకు తుదిరూపునిస్తోంది. లోక్‌సభ ఎన్నికల కంటే ముందే శాసనసభ ఎన్నికలు జరగనుండటంతో.. రాష్ట్ర పార్టీకి చెందిన ముఖ్యనేతలంతా (ఎంపీలు సహా) తమకు పట్టున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధం కావాలని బీజేపీ అగ్రనాయకత్వం ఆదేశించినట్టు తెలిసింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఆలోచన ఉన్నా.. రెండు రోజులుగా ఢిల్లీలో పార్టీ ముఖ్యనేతలతో రాష్ట్ర నాయకుల సమావేశాల సందర్భంగా స్పష్టత వచ్చినట్టు సమాచారం. బుధవారం దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా భేటీ అయినప్పుడు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ నాయకత్వం సన్నద్ధమవుతున్న తీరుపై ఆరా తీసినట్టు తెలిసింది. 2019 ఎన్నికలతో పోల్చితే దక్షిణాది నుంచి ఎక్కువగా ఎంపీ సీట్లు గెలిచేందుకు అవసరమైన వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని మోదీ సూచించినట్టు బీజేపీ వర్గాలు చెప్పాయి. ఈ క్రమంలో పార్టీ విస్తరణకు తెలంగాణ అనుకూలంగా ఉందని పేర్కొన్నారని అంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమవడంలో భాగంగా చేరికల వేగం పెంచాలని.. అన్ని అసెంబ్లీ స్థానాల్లో క్షేత్రస్థాయి నుంచి వివిధరూపాల్లో కార్యక్రమాల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారని వెల్లడించాయి. ప్రధానంగా రాష్ట్రంలోని 19 ఎస్సీ, 12 ఎస్టీ రిజర్వుడ్ సీట్లలో పార్టీ బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని.. ఆయా చోట్ల తప్పనిసరిగా బహిరంగ సభలు నిర్వహించాలని, వాటిలో ముఖ్యనేతలు పాల్గొనేలా చూడాలని సూచించారని తెలిపాయి.

బీఆర్‌ఎస్ వైఫల్యాలను నిలదీసేలా..

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ సర్కారు వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలపై అంశాల వారీగా ఆందోళనలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. స్థానికంగా నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది. డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు వంటి ప్రధాన అంశాలపై బీఆర్‌ఎస్‌ను ఇరకాటంలో పెట్టేలా కార్యాచరణను రూపొందిస్తోంది. మరో నాలుగు నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఎన్నికల వ్యూహాల అమలుకు జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ క్రమంలోనే అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సభలు, ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాలను పూర్తి చేయాలని నిర్ణయించారు.

నియోజకవర్గాల్లో ఇతర రాష్ట్రాల బీజేపీ ఎమ్మెల్యేల పర్యటన

ఈ నెల 20వ తేదీ నుంచి రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన 119 మంది బీజేపీ ఎమ్మెల్యేలు వారం పాటు పర్యటించనున్నారు. వారంతా ఏడు రోజులు తమకు కేటాయించిన నియోజకవర్గంలోనే ఉంటారు. పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్లలో బసచేసి.. ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితులను పరిశీలించనున్నారు. అనంతరం ఆయా అసెంబ్లీ సీట్లలో పార్టీ పరిస్థితి, ప్రధాన పార్టీల బలాబలాలు, పోటీచేసే అభ్యర్థులు, వివిధ సామాజికవర్గాలు, స్థానిక పరిస్థితులపై జాతీయ నాయకత్వానికి నివేదికలు సమర్పించనున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడమే కాంగ్రెస్ ఎజెండా

- వరద బాధితులు, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ఫోకస్
- భట్టి పాదయాత్ర అనుభవాలు, కీలక సమస్యలను లేవనెత్తే వ్యూహం



సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్ల రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమే ఎజెండాగా కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సమావేశాలకు సిద్ధమవుతోంది. నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రంలో ఉద్యమసాధన ఆకాంక్షలు నెరవేరని తీరును ఎండగట్టాలని అనుకుంటోంది. రాష్ట్రంలో ఇటీవల సంభవించిన భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టాన్ని సభ దృష్టికి తేవడం ద్వారా వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ప్రజలకు వివరించేలా అసెంబ్లీలో గళమెత్తాలని నిర్ణయించింది. దీంతో పాటు సీఎల్పీనేత మల్లు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నిర్వహించిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర అనుభవాలు, ప్రజలు ఏకరువు పెట్టిన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం ద్వారా వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని భావిస్తోంది. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం అశాస్త్రీయంగా జరుగుతోందని, ముఖ్యంగా మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులు, చెరువుల నిర్వహణలో ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం కారణంగానే తాజా వరదనష్టం జరిగిందని, ప్రాణ, ఆస్తి, పంట నష్టాలకు ప్రభుత్వ ఎత్తుగడల లోపమే కారణమనే అంశాలను ఫోకస్ చేయాలని నిర్ణయించింది. కాగా, ఈ అసెంబ్లీ సమావేశాలు కనీసం 15 రోజుల పాటు నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని భావిస్తోంది. ఈ సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించేందుకుగాను గురువారం కాంగ్రెస్ శాసనసభాపక్షం సమావేశం కానుంది. ఇక, ఈ అసెంబ్లీ గడువు తీరేలోపు ఇవే చివరి సమావేశాలనే చర్చ జరుగుతోంది. 2018 జరిగిన ఎన్నికల్లో గెలిచిన 19 మంది ఎమ్మెల్యేలతో అసెంబ్లీలోకి అడుగుపెట్టిన కాంగ్రెస్‌పార్టీ చివరి సమావేశాల నాటికి తన ప్రాతినిధ్యాన్ని కోల్పోయి ఐదుగురికి మాత్రమే పరిమితం కావడం గమనార్హం.

నేటి నుంచే అసెంబ్లీ

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతుంది. అనంతరం జరిగే బీఏసీ సమావేశంలో మండలి నిర్వహణ తేదీలు, ఎజెండా ఖరారు చేస్తారు.

చివరి సమావేశాలని...

తెలంగాణ రెండో శాసనసభకు ఇవి చివరి సమావేశాలుగా భావిస్తున్న నేపథ్యంలో అధికార, విపక్ష పార్టీలు అసెంబ్లీ వేదికగా తమ ఎజెండా వినిపించేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఉచితవిద్యుత్, ధరణి వంటి అంశాలపై స్వల్పకాలిక చర్చ ద్వారా విపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని అధికార బీఆర్‌ఎస్ భావిస్తోంది. మరోవైపు తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రశ్నోత్తరాలతో పాటు ఇతర చర్చల సందర్భంగా ప్రస్తావించేలా అధికార పక్షం కసరత్తు చేస్తోంది. మరోవైపు విపక్ష పార్టీలు కూడా డబుల్ బెడ్‌రూమ్‌లు, ధరణి లోపాలు, ఇటీవల వరదల మూలంగా సంభవించిన నష్టం తదితరాలపై చర్చకు పట్టుపట్టే అవకాశాలు ఉన్నాయి. కాగా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాలకు ఆయన హాజరవుతారా అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

ఆర్టీసీ విలీనం ఎన్నికల స్టంటే

మంత్రి మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు



కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడిపల్లి: ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ఎన్నికల స్టంటే అంటూ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బుధవారం జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ఎన్నికల స్టంటేనా అని విలేకరులు మంత్రిని ప్రశ్నించగా..'ఆర్టీసీ విలీనం ఎన్నికల స్టంటే. మాది రాజకీయపార్టీ. ఎన్నికల స్టంట్‌లనేవి ఎలాగైనా మాకూ ఉంటాయి. కార్మికుల భవిష్యత్ మంచిగా ఉందా లేదా అని ఆలోచన చేయాలి. మాది దమ్మున్న పార్టీ..మా సీఎం దమ్మున్న సీఎం''అంటూ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చేందుకు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం అన్నారు. దేశంలోనే హైదరాబాద్ నంబర్‌వన్ సిటీ అని, ప్రజారవాణాను మెరుగుపరచాలనే సంకల్పంతో ప్రభుత్వం మెట్రోవిస్తరణకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. దీంతో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజలు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటారని చెప్పారు. కేంద్రం వరంగల్ హైవేపై నిర్మిస్తున్న కారిడార్ పనులు ప్రారంభించి ఐదేళ్లయినా 50 శాతం కూడా పూర్తి కాలేదని, ఇటీవల తనతో పాటు మేయర్ జక్కా వెంకట్ రెడ్డి సీఎం కేసీఆర్‌ను కలిసి ఈ రోడ్డు దుస్థితిని సీఎంకు వివరించామని చెప్పారు. వెంటనే స్పందించిన కేసీఆర్ ఆర్‌అండ్‌బీ నిధులతో రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ గ్రంథాలయ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, కమిషనర్ ఇస్లావత్ నమ్యానాయక్ పాల్గొన్నారు. అంతకుముందు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

రేపు నగరానికి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో బండి సంజయ్ నగరానికి రానున్నారు. శుక్రవారం ఉదయం ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తనకు కేటాయించిన చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు, హైదరాబాద్ బీజేపీ శ్రేణులు సంజయ్‌ను సన్మానించనున్నాయి. ఓపెన్ టాప్ జీపులో శంషాబాద్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సంజయ్ చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన 'మీట్ అండ్ గ్రీట్'కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కార్యకర్తలు, నాయకులను కలిసి సంజయ్ కరీంనగర్ బయలుదేరి వెళతారు.

జూపల్లి చేరిక నేడు

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే బిజీ నేపథ్యంలో వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం కాంగ్రెస్‌లో చేరనున్నారు. వాస్తవానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరేందుకు మంగళవారం రాత్రి ఢిల్లీకి జూపల్లి వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఖర్గే బిజీగా ఉండడంతో చేరిక వాయిదా పడింది. దీంతో గురువారం ఉదయం జూపల్లి సహా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి సహా పలువురు నాయకులు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకుంటారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి మీడియాకు తెలిపారు.

వరద సాయంపై కేంద్రానికి లేఖ రాస్తా

▶ మొదటి పేజీ తరువాయి

నయీంనగర్ నాలా, పోతననగర్, ఎన్టీఆర్ నగర్‌లలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ముంపు బాధితులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. వరద బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమీకరించిన ఆరోగ్య కిట్‌లు, కిరాణా సరుకులను అందజేశారు. ఎన్టీఆర్ నగర్‌లో గవర్నర్ పర్యటిస్తున్న సమయంలో ఓ మహిళ వరదకు అన్నీ కొట్టుకుపోయాయని చెబుతూ ఆమెను పట్టుకుని రోదించారు. గవర్నర్ ఆ మహిళను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ ముంపునకు గురైన ప్రాంతాల్లో సత్వరం సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఇటువంటి పరిస్థితులు ఎందుకు తలెత్తుతున్నాయో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర బృందాలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ నష్టం అంచనా వేస్తున్నట్లు చెప్పారు. నివేదిక ఆధారంగా కేంద్రం స్పందిస్తుందని చెప్పారు. బాధితులకు సహాయం కోసం కేంద్రానికి లేఖ రాస్తానన్నారు. గవర్నర్ వెంట గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌విజయ్ చందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్వాగతం వరకు ఓకే.. ఆ తరువాత కమిషనర్ ఒక్కరే..

గవర్నర్ వరద ముంపు ప్రాంతాల పర్యటనలో బల్దియా కమిషనర్ మినహా జిల్లా అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొనలేదు. కాజీపేట నిట్‌కు చేరుకున్న గవర్నర్‌కు హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్యలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కానీ క్షేత్రస్థాయి పర్యటనకు వీరు రాలేదు. గవర్నర్ వెంట బల్దియా కమిషనర్ రిజ్వాన్ బాషా ఒక్కరే ఉన్నారు.



జూరాలకు మళ్లీ పెరిగిన వరద

- బుధవారం ఉదయం నుంచి పెరిగిన ఇన్‌ఫ్లో... శ్రీశైలం ప్రాజెక్టుకు 39,580 క్యూసెక్కుల నీరు విడుదల
- ప్రాజెక్టులో 7.836 టీఎంసీల నీటి నిల్వలు

ధరూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద మళ్లీ పెరిగింది. నీటి ప్రవాహం తగ్గడంతో రెండ్రోజుల క్రితం గేట్లు మూసివేయగా..బుధవారం ఉదయం నుంచి ఇన్‌ఫ్లో పెరిగింది. రాత్రి 10 గంటల సమయంలో ప్రాజెక్టుకు 95వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా..పది క్రస్టు గేట్లు ఒక మీటర్ మేర ఎత్తి 39,580 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేశారు. అదేవిధంగా 12 యూనిట్లలో విద్యుదుత్పత్తి కోసం 38,864 క్యూసెక్కులు వదులుతుండగా..మొత్తంగా జూరాల నుంచి 83,077 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా...ప్రస్తుతం 7.836 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల క్రస్టు గేట్లు, విద్యుదుత్పత్తి ద్వారా 78,444 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 886 క్యూసెక్కులు మొత్తం 79,330 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రస్తుతం శ్రీశైలంలో 854.40 అడుగులమేర 90.348 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

854 అడుగులకు చేరిన శ్రీశైలం నీటిమట్టం

- ప్రాజెక్టులోకి 79,330 క్యూసెక్కులు
- కనీస మట్టాన్ని చేరుకున్న నీటి నిల్వలు
- ప్రస్తుతం 90.34 టీఎంసీల నిల్వలు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం 6 గంటలకు 79,330 క్యూసెక్కుల నీరు చేరుతుండటంతో నీటిమట్టం కనీస స్థాయి(ఎండీడీఎల్) 854 అడుగులను దాటింది. ప్రస్తుతం ప్రాజెక్టుల్లో 854.4 అడుగుల్లో 90.34 టీఎంసీల నిల్వలున్నాయి. 854 అడుగులకు పైన నిల్వలుంటేనే సాగునీటి అవసరాలకు ప్రాజెక్టు నుంచి నీళ్లను విడుదల చేసుకోవడానికి వీలు కలగనుంది. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 885 అడుగులు. పూర్తి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు. శ్రీశైలం ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 125 టీఎంసీలు అవసరం. మూసీ నుంచి పులిచింతల ప్రాజెక్టులోకి 8,348 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటినిల్వ 34 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ పరీవాహక ప్రాంతంలో వర్షాలు ఆగిపోవడటంతో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ప్రవాహం తగ్గిపోయింది. ఆల్మట్టిలోకి 98 వేల క్యూసెక్కులు చేరుతుండగా...నారాయణపూర్‌లోకి 67 వేల క్యూసెక్కులు చేరుతోంది. నారాయణపూర్ డ్యామ్ నుంచి 45 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలుతున్నారు. ఇక కృష్ణా ప్రధాన ఉపనది అయిన తుంగభద్రలోనూ వరద ఉధృతి తగ్గింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 24,719 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వలు 82 టీఎంసీలకు చేరుకున్నాయి.



రాజకీయాలకే నా ప్రాధాన్యత

- బీజేపీలో చేరిన అనంతరం మాజీ ఎమ్మెల్యే, సినీ నటి జయసుధ
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన తరుణ్‌ఛుగ్, కిషన్‌రెడ్డి, డీకే అరుణ



జయసుధకు రశీదు అందిస్తున్న తరుణ్ చుగ్, కిషన్‌రెడ్డి. చిత్రంలో డీకే అరుణ

సాక్షి, న్యూఢిల్లీ: సినిమాల కంటే రాజకీయాలకే తన ప్రాధాన్యత ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, సినీ నటి జయసుధ తెలిపారు. పేదలకు మంచిచేయాలి.. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతోనే బీజేపీలో చేరానని వెల్లడించారు. బుధవారం ఢిల్లీలో బీజేపీ కేంద్ర కార్యాలయంలో తెలంగాణ పార్టీ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ సమక్షంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ పార్టీ సభ్యత్వ రశీదు అందించి కండువా కప్పి జయసుధను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మోదీ నాయకత్వంలో దేశం సాధించిన అభివృద్ధి చూసి, ప్రధాని విధానాలకు ఆకర్షితురాలినై మార్పు కోసం బీజేపీలో చేరానని చెప్పారు. ప్రజలకు మేలు జరగాలనే జాతీయ పార్టీలో చేరానని, క్రైస్తవుల గొంతు వినిపిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, జయసుధ చేరిక పార్టీకి మరింత ఉత్సాహం ఇస్తుందన్నారు. పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆమె తగిన సేవలందిస్తారని భావిస్తున్నట్లు తరుణ్ ఛుగ్ తెలిపారు.


6న నల్లగొండకు కిషన్‌రెడ్డి

'డబుల్'పై నిరసన ర్యాలీ... 7న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 6న నల్లగొండలో కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్రూం ఇళ్ల హామీని పూర్తిచేయాలంటూ పార్టీపరంగా నిర్వహిస్తున్న నిరసన ర్యాలీ, సభలో ఆయన పాల్గొంటారు. అదేరోజు వివిధ పార్టీలకు చెందిన పలువురు స్థానిక నేతలు బీజేపీలో చేరే కార్యక్రమం ఉంటుందని పార్టీ వర్గాల సమాచారం. ఈ పర్యటనలో భాగంగా ముఖ్య కార్యకర్తల సమావేశం, కోర్‌కమిటీ మీటింగ్‌లో కిషన్‌రెడ్డి పాల్గొంటారు. అంతకు ముందు 6న ఉదయం కేంద్రమంత్రి హోదాలో నాంపల్లి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రధాని మోదీ 21 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించడంలో భాగంగా ఈ కార్యక్రమం జరగనుంది. 7న ఇందిరాపార్కు వద్ద జరగనున్న మహాధర్నాలోనూ ఆయన పాల్గొంటారు.

ఆసియాలోనే అత్యంత పెద్దదిగా...

సకల హంగులతో..199 ఎకరాల్లో రూ.403 కోట్లతో కోహెడ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం: వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి



సమావేశంలో ఎమ్మెల్యే అక్బరుద్దీన్, మంత్రులు నిరంజన్‌రెడ్డి, మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్: సకల హంగులతో కోహెడ మార్కెట్ నిర్మిస్తున్నామని, వ్యాపారులు, ట్రేడర్లు, రైతులకు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ మంత్రుల నివాస సముదాయంలో కోహెడ పండ్ల మార్కెట్ నిర్మాణంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..ఆసియాలోనే అత్యంత పెద్దది కోహెడ మార్కెట్ అని అన్నారు. 199 ఎకరాల్లో రూ.403 కోట్లకు పైగా ఖర్చుతో నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. 48.71 ఎకరాల్లో షెడ్ల నిర్మాణం, కమీషన్ ఏజెంట్లు అందరికీ దుకాణాలు, 16.50 ఎకరాల్లో కోల్డ్ స్టోరేజీల నిర్మాణం, 11.76 ఎకరాలలో పండ్ల ఎగుమతులకై ఎక్స్ పోర్టు జోన్, 56.54 ఎకరాల్లో రహదారులు, 11.92 ఎకరాల్లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మార్కెట్ నిర్మాణ ప్రణాళిక సీఎం కేసీఆర్ ఆమోదం తీసుకుని ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఎంఐఎం ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీ, కౌసర్ మొహియుద్దీన్, అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, అదనపు సంచాలకులు లక్ష్మణుడు, ఆర్డీడీఎం పద్మహర్ష, డీఎంఓ ఛాయాదేవి, మార్కెట్ కార్యదర్శి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులను వదిలి... మహారాష్ట్రలో రాజకీయాలా?: ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్/తిరుమలగిరి, అర్వపల్లి(తుంగతుర్తి): రాష్ట్రంలో భారీ వర్షాలకు, వరదలకు 30 మంది వరకు చనిపోతే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఏ ఒక్క కుటుంబాన్నీ పరామర్శించకుండా మహారాష్ట్రలో రాజకీయాలు చేస్తూ బిజీగా ఉన్నారని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఆయన బుధవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం తిరుమలగిరి పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి స్థానికులతో కలసి మాట్లాడారు. ఆ తర్వాత అర్వపల్లిలోనూ కొద్దిసేపు ఆగి విలేకరులతో ముచ్చటించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇసుక దందా జోరుగా సాగుతోందని, ఇందులో సీఎం కేసీఆర్‌కు కమీషన్లు అందుతున్నాయని ఆరోపించారు. యాదాద్రి జిల్లాలో 400 ఎకరాల కాందిశీకుల భూమిపై మంత్రి, ఎమ్మెల్యే కన్ను పడిందని, కలెక్టర్ ఈ దందాను ఆపడానికి ప్రయత్నిస్తే జిల్లా కలెక్టర్, ఆర్డీవోను బదిలీ చేశారని ఆరోపించారు. పేదలకు న్యాయం జరగాలంటే వచ్చే ఎన్నికల్లో బీఎస్పీకి ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రవీణ్‌కుమార్ వెంట బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొడిగె మల్లేశ్ యాదవ్, నాయకులు వెంకటేశ్, దాసరి శ్రీను ఉన్నారు. 'పేదల పొట్టగొట్టి కేసీఆర్ ప్రభుత్వం చేసినంత భూదందా ఈ దేశంలో ఏ ప్రభుత్వం చేయలేదు' అని ఆయన ట్వీట్ చేశారు.

AMJAD ALI KHAN
COLLEGE OF BUSINESS ADMINISTRATION
Road No.3, Banjara Hills, Hyderabad.
ADMISSION NOTIFICATION

Application forms from eligible Minority & Non-Minority Students are invited for admission into the following course for the academic year 2023-24:

Course	Eligibility Criteria
BBA | MBA (5 Year Integrated MBA)	Intermediate Pass

Tuition Fee as prescribed by the TAFRC

Date : 02.08.2023 Hony. Secretary



ఆశ కంటే భయమే ఎక్కువ కనబడుతున్నప్పుడు కూడా
నిలిచి ఉండటం వివేకమైన పని కాదు;
వెనక్కి తగ్గడం పారిపోయినట్టు కాదు!
– మిగెల్ సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 3 ఆగస్టు 2023

మళ్లీ మతం మంటలు!

విశ్వాసాల ప్రాతిపదికగా చెలరేగిపోయే మూక మనస్తత్వం ఆధునిక నాగరికతకు అత్యంత ప్రమాదకారి సుమా అని రెండు వందల యేళ్లనాడు అమెరికా మాజీ అధ్యక్షుడు థామస్ జెఫర్సన్ హెచ్చరించారు. తరాలు మారినా, అప్పటితో పోలిస్తే ఎంతో ప్రగతి సాధించినా ఆ ప్రమాదకర మనస్తత్వాన్ని వదులుకోలేని బలహీనత కొందరిని పట్టిపీడిస్తోంది. ఒక పక్క మూడు నెలల క్రితం ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో చోటుచేసుకున్న అత్యంత దుర్మార్గమైన ఉదంతాలపై పార్లమెంటు లోపలా, వెలుపలా రోజూ ఆందోళన వ్యక్తమవుతోంది. దానిపై చర్చకు విపక్షం పట్టుబడుతోంది. సర్వోన్నత న్యాయస్థానం సైతం మణిపూర్ దురంతాలపై దృష్టి సారించి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం చేష్టలుడిగిపోయిందనీ, రాజ్యాంగ వ్యవస్థ కుప్పకూలిందనీ కటువుగా వ్యాఖ్యానించింది. ఈలోగానే హరియాణాలో దుండగులు చెలరేగిపోయారు. వరసగా రెండురోజులపాటు అడ్డూ ఆపూ లేకుండా సాగిన హింసాకాండతో అక్కడి నూహ్, గురుగ్రామ్ పట్టణాలు అట్టుడికిపోయాయి. ఇద్దరు హోం గార్డులతో సహా అయిదుగురు ప్రాణాలు కోల్పోయి 75 మంది గాయాల పాలయ్యాక, ఒక ప్రార్థనా స్థలంతో పాటు పలు దుకాణాలు తగలబడ్డాక ఇందుకు కారకులని భావిస్తున్న 116 మందిని అరెస్టు చేశారు. హింసాకాండకు ప్రేరేపించిన ఉదంతమేమిటి, ఎవరు ముందుగా దాడికి దిగారన్నది దర్యాప్తు సంస్థలు తేలుస్తాయి. అయితే నిఘా వ్యవస్థ, శాంతిభద్రతల విభాగం పటిష్టంగా ఉన్నచోట ఎవరి ఆటలూ సాగవు. జాగ్రదావస్థలో లేని సమాజంలోనే మూకలు చెలరేగుతాయి. భివానీలో ఇద్దరు ముస్లిం యువకుల హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉండి, తప్పించుకు తిరుగుతున్న మోను మానెసార్ అనే యువకుడు తాను ర్యాలీకి రాబోతున్నానని ఒక వీడియో సందేశం పంపటంతో నూహ్‌లో ఉద్రిక్తత ఏర్పడిందని పోలీసులకు సమాచారం లేదంటే ఆశ్చర్యం కలుగుతుంది.

మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఏదో యాదృచ్ఛికంగా మొదలైనట్టు కనబడిన దాడి వెంటవెంటనే వేరే ప్రాంతాలకు విస్తరించటం, రెండు వర్గాలూ మారణాయుధాలు ధరించి చెలరేగిపోవటం దేన్ని సూచిస్తోంది? కొందరికి బులెట్ గాయాలు కూడా ఉన్నాయంటే పరిస్థితి ఎంత దిగజారిందో అర్థమవుతుంది. పరస్పరం దాడులకు ఇరువైపులా దుండగులు అన్నివిధాలా సిద్ధంగానే ఉన్నారు. ఏమాత్రం సంసిద్ధత లేకుండా చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయింది ప్రభుత్వ యంత్రాంగమే! ఏమనుకోవాలి దీన్ని? మణిపూర్ దుండగులు ఆ రాష్ట్రాన్నే కాదు, దేశాన్నే అంతర్జాతీయంగా అపఖ్యాతిపాలు చేశాక, సాఫ్ట్‌వేర్ సంస్థలతోపాటు ఎన్నో బహుళజాతి కార్పొరేట్ సంస్థలు కొలువుదీరిన హరియాణాలో సైతం అలాంటి మూకే విచ్చలవిడిగా, ఇష్టానుసారంగా విరుచుకుపడిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తుంది. సాయుధ పోలీసు బలగాలను తరలించి, 144 సెక్షన్ విధించి అంతా సవ్యంగా ఉన్నదని చెప్పడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుండగానే గురుగ్రామ్ అంటుకుంది. అక్కడి మిలీనియం సిటీ, బాద్షాపూర్ ప్రాంతాల్లో దుకాణాల దహనం, లూటీలు పోలీసుల సాక్షిగా కొనసాగాయి. గొడవలు జరిగిన ప్రతిచోటా స్థానికులు చెప్పే మాటలే ఇప్పుడు నూహ్, గురుగ్రామ్ ప్రాంతవాసులు చెబుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చాన్నాళ్లుగా ఆ ప్రాంతాలకు వస్తున్నారని, స్థానిక యువతను సమావేశపరిచి అవతలి మతం గురించి రెచ్చగొట్టే వ్యాఖ్యలు, నినాదాలు చేస్తున్నారన్నది వారి మాటల సారాంశం. స్థానికులు కొన్ని రోజులుగా గమనించిన అంశాలపై నిఘా విభాగానికి ముందస్తు సమాచారం లేకపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. దేశ రాజధానికి సమీపంలో ఉండే ప్రాంతంలో ఈ దుఃస్థితి ఉండటం రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే కాదు, కేంద్ర ప్రభుత్వానికి సైతం తలవంపులు తీసుకురాదా? వచ్చే నెలలో న్యూఢిల్లీలో జీ–20 శిఖరాగ్ర సదస్సు జరగబోతోంది. దానికి అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలతో సహా పలువురు దేశాధినేతలు తరలిరాబోతున్నారు. కనీసం హరియాణా ప్రభుత్వానికి ఈ స్పృహ అయినా ఉందా లేదా అనిపిస్తోంది.

దేశంలో చెదురుమదురుగా మతపరమైన ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్న మాట వాస్తవమే అయినా, విచ్చలవిడిగా మారణాయుధాలతో మూకలు చెలరేగిన సందర్భాలు అదృష్టవశాత్తూ ఇటీవలి కాలంలో లేవు. కానీ ఉన్నట్టుండి రెండు రాష్ట్రాల్లోనూ రాక్షస మూకలు చెలరేగాయి. ప్రభుత్వంలో బాధ్యతాయుత స్థానంలో ఉన్నవారు ఇలాంటి సమయాల్లో జాగ్రత్తగా మెలగాలి. లేనట్టయితే సమస్య మరింత జటిలమవుతుంది. నూహ్ సమీపంలోని ఒక ప్రముఖ ఆలయంలో అనేక మంది యాత్రికులను నిర్బంధించారని హరియాణా హోంమంత్రి అనిల్ విజ్ చేసిన ప్రకటన అటువంటిదే. అందుకు సమర్థనగా నిర్బంధితుల్లో కొందరు తనకు లొకేషన్ కూడా పంపారని చెప్పారు. కానీ ఆ ఆలయ అర్చకుడు దీపక్ శర్మ కథనం భిన్నంగా ఉంది. దర్శనానంతరం తిరిగి వెళ్లిన 2,500 మంది భక్తులు బయట ఉద్రిక్తతలుండటం గమనించి తమంత తాము వెనక్కొచ్చి పరిస్థితి చక్కబడ్డాక వెళ్తామని చెప్పారని ఆయనంటున్నారు. ఏ మతానికి చెందిన ప్రజానీకమైనా శాంతినే కోరుకుంటారు. ఏదో ఉపద్రవం జరిగిపోతోందన్న భయాందోళనలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకుందామని చూసేవారు ఎప్పుడూ ఉంటారు. అలాంటి శక్తులపై కన్నేసి ఉంచితే, వారిని మొగ్గలోనే తుంచితే సమాజంలో సామరస్యపూర్వక వాతావరణం సులభంగా ఏర్పడుతుంది. మన మతస్తులనో, మన కులస్తులనో భావించి ఏ వర్గమైనా పట్టనట్టు ఊరుకుంటే అంతిమంగా అది మొత్తం సమాజానికే చేటు కలిగిస్తుంది. మణిపూర్, హరియాణాల్లో చోటుచేసుకున్న ఉదంతాలు అందరికీ కనువిప్పు కావాలి. అటువంటి శక్తులను ఏకాకులను చేయటంలో అందరూ ఒక్కటి కావాలి.

భద్రతను విస్మరించే అభివృద్ధా?

విశ్లేషణ



రవి చోప్రా

హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. చార్ ధామ్ హైవేతో సహా వందలాది రోడ్లపై వాహనాలను కొండచరియలు నిరోధించాయి. అనేక పెద్ద జలవిద్యుత్ డ్యామ్‌లు వరదల ముప్పు కారణంగా ప్రణాళిక లేకుండా నీటిని విడుదల చేశాయి. పర్వత ప్రాంతాల్లో ప్రాజెక్టులను ఎలా మెరుగ్గా నిర్వహించాలి, తీసుకునే నిర్ణయాల్లో ప్రజలను ఎలా భాగస్వాములను చెయ్యాలి అనే విషయాలపై ఇవి కీలకమైన పాఠాలను అందిస్తున్నాయి. పర్యావరణం, జీవితం, ఆస్తి వంటి విషయాల్లో మెరుగైన భద్రత కావాలంటే, సమర్థమైన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. హిమాలయ అడవులను నాశనం చేస్తూనే విపత్తులను నివారించగలమా? ఇలాంటి ప్రశ్నలకు జవాబులు కూడా వెతకాల్సి ఉంటుంది.

పర్వత ప్రాంత రాష్ట్రాలైన హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ ఒకదాని తర్వాత మరొకటి జూలై నెలలో వరదలతో అతలాకుతలమయ్యాయి. ఈ వరదలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన ప్రాథమిక సమస్యలను ఎత్తి చూపుతున్నాయి. ఈ వరదల్లో అత్యధికంగా దెబ్బ తిన్న రాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్. జూలై మొదటి 11 రోజులలో కులు, బిలాస్‌పూర్, మండి, సిమ్లా, సోలన్‌లలో 77 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతంతో పోలిస్తే, సగటున రోజూ 250 మి.మీ. నమోదైంది. ఉత్తరాఖండ్‌లో జూలై మొదటి 10 రోజులలో సాధారణం నుండి సంచిత వర్షపాతం హిమాచల్ కంటే కొంచెం ఎక్కువగా ఉంది.

కుండపోత వర్షం భారీ నష్టాన్ని మిగిల్చింది. జూలై 14 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో 108 మరణాలు నమోదు కాగా, జూలై 15 వరకు 26 మంది చనిపోయినట్లు ఉత్తరాఖండ్ నివేదించింది. ఉత్తరాఖండ్‌లో ప్రతిష్ఠాత్మకమైన, అన్ని వాతావరణాల్లో పనిచేసే చార్ ధామ్ హైవేతో సహా వందలాది రోడ్లపై వాహనాలను దాదాపు ప్రతిరోజూ కొండచరియలు నిరోధించాయి. దీనివల్ల నివాసితులకు, పర్యాటకులకు కష్టాలు, ఆర్థిక నష్టాలు ఎదురయ్యాయి. గిర్థీ నదిపై వంతెన కూలిపోవడంతో చమోలి జిల్లాలో ఇండో–టిబెట్ సరిహద్దు వరకు రక్షణ బలగాల రాకపోకలు దెబ్బతిన్నాయి. విద్యుత్, నీటి సరఫరాలకు అంతరాయం ఏర్పడి రెండు రాష్ట్రాల్లోనూ పాఠశాలలు చాలా రోజులు మూతపడ్డాయి. వంతెనలు మునిగిపోయాయి లేదా కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడటమే కాకుండా హిమపాతం పట్టణాలను ముంచెత్తింది. హైవేలు విచ్ఛిన్నమైపోయాయి. అనేక భవనాలు, వాహనాలు కొట్టుకుపోయాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌లో వినాశనం మరింత స్పష్టంగా కనిపించింది.

ఈ విపత్తు సమయంలో, బియాస్ అత్యంత విధ్వంసకరంగా మారింది. సహజ కారణాల వల్ల మాత్రమే కాదు... బియాస్ నది పరివాహక ప్రదేశంలోని అనేక పెద్ద జలవిద్యుత్ డ్యామ్‌లు, తమ ప్రాంతాలలో వరదల ముప్పు కారణంగా అకస్మాత్తుగా ప్రణాళిక లేకుండా నీటిని విడుదల చేశాయి. ఇప్పటికే పొంగి పరవళ్లు తొక్కుతున్న నదిలోకి ఈ అదనపు ఉప్పెనలు వెల్లువెత్తి దిగువ ప్రాంతాల్లో నష్టాలను అధికం చేశాయి. ఉత్తరాఖండ్‌లోనూ ఇలాంటి సమస్యలే కనిపించాయి. జూలై 11న, ఉత్తరాఖండ్ జల్ విద్యుత్ నిగమ్ లిమిటెడ్ తాను నిర్వహిస్తున్న 19 ప్లాంట్‌లలో పదిహేడింటిని మూసివేసింది. నదీ పర్యావరణ వేత్తలు, యాక్టివిస్టులు పదేపదే చెబుతూ వచ్చినట్లుగా... జలశక్తి లేదా పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పులకు సంబంధించిన కేంద్ర మంత్రిత్వ శాఖలు, శాస్త్రీయంగా పర్యావరణ ప్రవాహాలను ఏర్పాటు చేసి, డ్యామ్ ఆపరేటర్లు వాటిని అనుసరించేలా చూసినట్లయితే, ఆనకట్ట సంబంధిత సమస్యలను గణనీయంగా తగ్గించవచ్చు.



మౌలిక సదుపాయాల సైట్ల చుట్టూ కూడా కనీవినీ ఎరుగని విధ్వంసం సంభవించింది. నిటారుగా ఉన్న లోయలతో కూడిన చిన్న పర్వత ప్రవాహాలు, పరిమితమైన వరదను భరించే సామర్థ్యాన్ని మాత్రమే కలిగి ఉంటాయి. ప్రాజెక్టుల నుండి నిర్మాణ శిథిలాలు అటువంటి ప్రవాహాలలోకి డంప్ అవుతున్నాయి. వరదను భరించే వాటి సామర్థ్యాన్ని అవి మరింతగా తగ్గిస్తున్నాయి. స్థానిక నివాసితులు రికార్డ్ చేసిన ఒక వీడియో క్లిప్‌ని చూస్తే... క్రూరంగా విరుచుకుపడే, బురదతో కూడిన వరద ప్రవాహం థునాగ్ పట్టణంలోని మార్కెట్ లేన్‌లోకి దూసుకెళ్లి విధ్వంసం సృష్టించింది. మాజీ ముఖ్యమంత్రి జై రామ్ ఠాకూర్ స్వస్థలమైన తాండి గ్రామంలోని ఒక రహదారి నిర్మాణ ప్రాజెక్ట్ శిథిలాలను, అక్రమంగా నరికివేసిన చెట్ల మొదళ్లను నదీ ప్రవాహ మార్గంలో పడేశారు. ఇటువంటి ప్రాజెక్టులను తరచుగా పేలవమైన ప్రణాళికలతో, నిర్మాణ గడువులను వేగంగా చేరుకునే లక్ష్యంతో నాసిరకంగా నిర్మిస్తారు.

నాలుగు లేన్లతో ఉన్న మండి–మనాలి జాతీయ రహదారిలో 100 మీటర్లకు పైగా అతి పెద్ద నిర్మాణ ఉల్లంఘనలు జరిగినట్లు ఒక డ్రోన్ వీడియో చూపించింది. వీటి కారణంగానే మనాలిలో సుమారు 7,000 వాహనాలు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల, హైవేను వాస్తవానికి నది ఒడ్డున నిర్మించారు. ఇక్కడ రహదారిని మెత్తటి నిక్షేపాలపై నిర్మించి ఉండవచ్చు. దీంతో బియాస్ ప్రాంతంలోని నేల కోత మరిన్ని ఇబ్బందులకు కారణమైంది. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ హైవేపై 2013 లోనూ ఇలాంటి వైఫల్యాలే చోటుచేసుకున్నాయి. అయితే హైవే డెవలపర్లు, ఇంజినీర్లు ఆనాడు జరిగిన పెను విపత్తు నుండి ఏ పాఠాలూ నేర్చుకోలేదు. ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ హైవేకి చెందిన ఒక భాగం కూలిపోవడం కూడా, అటువంటి నిర్మాణంలో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని రుజువు చేసింది.

నదీ తీరాలకు కనీసం 100 మీటర్ల దూరంలో భవనాలు ఉండాలనే హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు నిబంధనను కూడా ఉల్లంఘించడంతో మనాలిలోని మూడంతస్తుల హోటల్ బియాస్ నదిలోకి కూలిపోయింది. నిజానికి, మనాలి నది ఒడ్డున హోటళ్లు, గృహ సముదాయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూనే ఉన్నాయి. హరిద్వార్, రిషికేశ్, ఇతర ఉత్తరాఖండ్ నదీతీర పట్టణాలలోనూ ఇదే విధమైన ఉల్లంఘనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పెరుగుతున్న వాతావరణ కార్బన్ డై ఆక్సైడ్ స్థాయిలు, భూతాపం, అధిక సముద్ర ఉష్ణోగ్రతలు ఎక్కువ తేమతో కూడిన మేఘాలను ఉత్పత్తి చేస్తాయి. అయితే స్థానిక పరిస్థితులు అత్యధిక వర్షపాత సంఘటనలను నిర్ణయిస్తాయి. భారతదేశంలో, ప్రపంచ వ్యాప్తంగా కూడా వర్షపాత తీవ్రత, తరచుదనం పెరుగుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఇవి అధిక జనాభా ఉన్న లేదా ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో సంభవించినప్పుడు, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం భారీగా ఉంటుంది. పర్యావరణం, జీవితం, ఆస్తి వంటి విషయాల్లో మెరుగైన భద్రత కావాలంటే, సమర్థవంతమైన నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. నిర్మాణ సమయంలోనూ ఆ తర్వాత కూడా నిజాయితీగా, క్రమబద్ధమైన పర్యవేక్షణను చేపట్టాలి. ఇవన్నీ సాధ్యపడాలంటే మంచి పాలన అవసరం ఉంటుంది. అధిక వర్షపాతాన్ని, వరద తీవ్రతలను తట్టుకునే నిర్మాణ భద్రతాంశాలు మెరుగ్గా ఉండి, మంచి ఇంజినీరింగ్ పద్ధతులకు కట్టుబడి ఉంటే మరణాల సంఖ్య, విధ్వంసం తగ్గుతాయి.

ప్రేరేపిత విపత్తులు సంభవించినప్పుడు ప్రజల జీవితాలు ప్రమాదంలో పడతాయి కాబట్టి, మౌలిక ప్రాజెక్టుల ప్రణాళిక, మంజూరు, పర్యవేక్షణలో ప్రజలు సమర్థమైన స్వరాన్ని కలిగి ఉండాలి. నిజాయితీగా సిద్ధం చేసిన పర్యావరణ ప్రభావ అంచనాలు, పబ్లిక్ హియరింగ్‌లు వంటివి ప్రకృతి, జీవితాలు, ఆస్తికి చెందిన భద్రతలను పెంచడంలో సహాయపడతాయి. నియంత్రణ వ్యవస్థలు, పర్యావరణ ప్రభావిత అంచనాలకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్ క్రమానుగతంగా బలహీనపడటం అనేది ప్రజలకు, ప్రకృతికి వ్యతిరేకమైనది. సమర్థవంతమైన ఆర్థిక వృద్ధి పేరుతో పాలనా యంత్రాంగం ఎన్ని వాదనలు చేసినప్పటికీ వాటన్నింటినీ ఖండించాలి.

చివరగా, మరిన్ని పెద్ద ప్రశ్నలు వేసుకుందాం. సున్నితమైన హిమాలయ ప్రాంతానికి ఉన్న మోసే సామర్థ్యం ఎంత? స్థిరమైన ఆర్థిక వృద్ధికి పరిమితులు ఏమిటి? మనం హిమాలయ అడవులను ఇంకా నాశనం చేస్తూనే విపత్తులను నివారించగలమా? పర్యావరణ సున్నితమైన హిమాలయ నదీ లోయల గుండా తమ వాహనాలను నడపడానికి మరింత మంది పర్యాటకులను ప్రోత్సహిస్తూనే ఉందామా? ఇప్పుడు వీటన్నింటికీ సమాధానాలు వెతకాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది.

వ్యాసకర్త ప్రముఖ పర్యావరణవేత్త
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అత్యంత బాధాకరం



స్నేహితుడు, కళాకారుడు, మాతో కలిసి పనిచేసిన ఆర్ట్ డైరెక్టర్ నితిన్ దేశాయి మరణం దిగ్భ్రాంతికి గురిచేసింది. 'కౌన్ బనేగా కరోడ్‌పతి, కమ్‌జోర్ కడీ, హార్ట్‌బీట్, దస్ కా దమ్, బ్లఫ్‌మాస్టర్, సచ్ కా సామ్నా' లాంటి మా షోలు ఎన్నింటికో ఆయన ప్రపంచ స్థాయి సెట్స్ డిజైన్ చేశారు.

– సిద్ధార్థ బసు, టీవీ షో కన్సల్టెంట్

మిస్ అవుతున్నా!



కళా దర్శకుడు నితిన్ దేశాయి ఆత్మహత్య చేసుకున్నారంటే నమ్మశక్యంగా లేదు. ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. ఏ సమస్య అయినా ఇట్టే పరిష్కరించేవారు. పరిశ్రమ కంటే ముందున్న సృజన శీలి. ప్రతి ఒక్కరూ మనకు తెలియని పోరాటాలను చేస్తున్నారు. ఈ విషాదాన్ని ఎదుర్కొనే బలం ఆయన కుటుంబానికి కలగాలి.

– రసూల్ పూకుట్టి, సౌండ్ డిజైనర్

తెలుస్తోందా?



రాజకీయాలు పట్టని గురుగావ్‌లోని పోష్ అపార్ట్‌మెంట్లలో ఉండే జనాలకు ఇప్పుడు వారి చుట్టూ ఉండే రాజకీయాలు అర్థమవుతున్నట్టున్నాయి. ఎందుకంటే ఇంట్లో పనిచేయడానికి మనిషి రాదు, వాళ్ల బ్లౌజు కుట్టడానికి టైలర్ అందుబాటులో ఉండడు.

– అభిషేక్ బక్షీ, డిజిటల్ కన్సల్టెంట్


సహనం చూపాలి



విమర్శలను స్వీకరించలేని మతానికి ప్రజా వేదికల మీదకు వచ్చే హక్కు లేదు.

– అలీ మాలిక్, నాస్తికుడు

పట్టదా?



పౌర ఆందోళనలు దీర్ఘకాలంలో ఏ వ్యాపారానికైనా మంచివి కావు. కానీ ఇండియన్ కార్పొరేట్లు ఈ విషయమై ఏ విధమైన సున్నితత్వాన్నీ చూపడం లేదు. జరుగుతున్న విషయాల్లో వాళ్లూ చాలావరకు భాగస్థులే!

– సుహాస్ పల్షీకర్, ప్రొఫెసర్

ఇథనాల్‌తో ఒరిగేదేమిటి?

శ్యాం ప్రసాద్ రెడ్డి కోర్శిపాటి జూలై 25న 'సాక్షి'లో రాసిన 'ఇథనాల్‌తో రైతుకు మంచిరోజులు!' వ్యాసం చదివాము. కానీ అందులో రైతుకి ఎలా మేలు జరుగుతుందో ఒక్క మాట కూడా లేదు. వడ్ల ధర పెరుగుతుందా? రైతు ఆదాయం ఎంత పెరుగుతుంది? అసలు ఇథనాల్ కంపెనీలు రైతుల దగ్గర నుండి వడ్లను కొంటాయా? ఇటువంటి వివరాలేమీ లేవు.

ఈ బయో ఆయిల్ తయారీకి మిగిలిపోయిన, పాడైపోయిన ఆహార ధాన్యాలను వాడుతాం కనుక దేశంలో ఆహార కొరత ఏర్పడుతుందని భయం లేదు అనే అంశం చూడడానికి బాగానే ఉంది. కానీ వాస్తవానికి ఇదే ప్రధాన సమస్య. ఎలాగంటే... భారత ప్రభుత్వం 2025 నాటికి బియ్యం, మొక్కజొన్నల నుండి 740 కోట్ల లీటర్ల ఇథనాల్ ఉత్పత్తికి ప్రణాళిక వేసింది. అందుకు ప్రభుత్వ లెక్కల ప్రకారం లీటర్ ఇథనాల్ ఉత్పత్తికి 2.22 కిలోల బియ్యం లేదా 2.7 కిలోల మొక్కజొన్నలు కావాలి. అంటే 164.3 లక్షల టన్నుల బియ్యం కావాలి. అన్ని టన్నుల పాడైన ఆహార ధాన్యాలు మన దగ్గర ఎట్లా లభిస్తాయి? ప్రభుత్వం గిడ్డంగుల నుండి ఇథనాల్ కంపెనీకి బియ్యాన్ని కిలో 20 రూపాయలకే సరఫరా చేస్తున్నది. రైతు దగ్గర వడ్లు కొన్నా కంపెనీకి బియ్యం కిలో రూ. 20 కి గిడుతుందని దీన్ని బట్టి గ్రహించాలి. ఇథనాల్ ఉత్పత్తి పుంజుకోకుండానే ఇప్పుడే ప్రభుత్వం బియ్యం ఎగుమతులను నిషేధించింది. పూర్తి స్థాయిలో ఈ ఆయిల్ ఉత్పత్తి ప్రారంభమైతే ఇక పరిస్థితి ఏంటి? అసలు కొరత భయం లేకుంటే భారత ప్రభుత్వం ఎగుమతులను ఎందుకు నిషేధించినట్లు?


పూర్తిగా ఇథనాల్‌ను మాత్రమే వాడే వాహనాలు అందుబాటులోకి వస్తే ఇథనాల్ ఉత్పత్తిని భారీగా పెంచవలసి వస్తుంది. భారత్ 2022–23లో 4,150 కోట్ల లీటర్ల పెట్రోల్ వినియోగించింది. ఒక లీటర్ పెట్రోల్ 1.51 లీటర్ల ఇథనాల్‌కి సమానం. ఈ లెక్కన పెట్రోల్ బదులు ఇథనాల్‌ను ఉపయోగించాలంటే 6,265 కోట్ల లీటర్లు ఉత్పత్తి చేయాలి. ఇంత పరిమాణంలో తయారుచేయడానికి 1,390 లక్షల టన్నుల బియ్యం కావాలి. 2022– 23లో గిడ్డంగులలో మొత్తం బియ్యం 99 లక్షల టన్నులు మాత్రమే ఉన్నాయి. అంటే దేశంలో గిడ్డంగుల్లో నిల్వ ఉంచిన మొత్తం బియ్యం కూడా ఇంత పరిమాణంలో ఇథనాల్‌ను ఉత్పత్తి చేయడానికి చాలవన్నమాట.

ఇథనాల్ ఉత్పత్తి వల్ల సామాన్య ప్రజలకు, ముఖ్యంగా రైతులకు విశేషమైన ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయనే వాదం ఒకటుంది. ఇదీ నిజం కాదు. లీటర్ ఇథనాల్ రూ. 15కి లభిస్తుందని కొందరు అంచనా వేస్తున్నారు. పోనీ అదే నిజమనుకుందాం. ఒక లీటర్ ఇథనాల్ తయారు కావడానికి 2.22 కిలోల బియ్యం కావాలి. మరి బియ్యం ధర ఎంత ఉంటే లీటర్ ఇథనాల్ రూ. 15కి సరఫరా చేసి కంపెనీ లాభం పొందగలదు? లీటర్ ఇథనాల్ ఉత్పత్తి ఖర్చు 15 రూపాయల లోపు ఉంటేనే ఇది సాధ్యం. ఇది సాధ్యమయ్యే పనేనా? బియ్యం ఉచితంగా ఇచ్చినా లీటర్ ఇథనాల్‌ను రూ. 15కి అమ్మలేరు.

– ఉచ్చోళ్ల రామచంద్రయ్య
చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ

విభిన్న సంస్కృతులు వికసించనీ... ఇదే భారతీయత!

సందర్భం



కూనంనేని సాంబశివరావు

ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని 'కామన్ సివిల్ కోడ్'గా కూడా పిలుస్తారు. సివిల్ కోడ్ (వ్యక్తిగత చట్టం) అనగా ఆ యా మతాల విశ్వాసాలూ, ఆస్తి హక్కులూ, వివాహం, విడాకులూ, దత్తత, వారసత్వం, మనోవర్తి, సంరక్షణ వంటి వన్నీ పొందుపర్చబడిన చట్టం. ఇప్పటి వరకు హిందూ వివాహ చట్టం (1955), ఇండియన్ క్రిస్టియన్ యాక్ట్–1872, పార్శీ వివాహ, విడాకుల చట్టం (1935), షరియత్ యాక్ట్ (ముస్లిం పర్సనల్ లా) –1937, ఇతర అనేక జాతులకు సంబంధించి, స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ లాంటి అనేక విడివిడి చట్టాలు ఉన్నాయి. ఈ వ్యక్తిగత చట్టాలు (పర్సనల్ లాస్) అన్నింటినీ ఒకే చట్టంగా తీసుకురావాలనే ప్రతిపాదనే ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ). ఈ క్రమంలో యూసీసీ బిల్లుకు సంబంధించి ప్రజల అభిప్రాయాలు కోరుతూ 22వ లా కమిషన్ జూన్ 14వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చింది. ఇప్పటివరకు దాదాపు కోటి మంది తమ అభిప్రాయాలను కమిషన్‌కు తెలియపర్చారని కేంద్ర న్యాయశాఖ మంత్రి ప్రకటించారు. కోటి మంది తమ అభిప్రాయాలను వెలిబుచ్చారంటే యూసీసీ పట్ల అనుకూల, విరుద్ధమైన భావాలు ఎన్ని ఉన్నాయో అర్థమవుతున్నది. ఈ దశలో ప్రత్యేకించి లోక్‌సభ ఎన్నికలకు ముందు 22వ లా కమిషన్ ద్వారా యూసీసీపై అభిప్రాయాలు కోరడమంటే ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలకంటే రాజకీయ ప్రయోజనాలు ఆశించడమే అవుతుంది. ప్రతి ఎన్నికల ముందు ఏదో ఒక భావోద్వేగ అంశాన్ని లేవనెత్తి ఓట్ల రాజకీయాలు చేయడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య.

ఆ యా మతాలకు వారివారి వ్యక్తిగత చట్టాలు (పర్సనల్ లాస్) ఉన్నాయని మనకు తెలుసు. యూసీసీని రూపొందించడంలో మెజారిటీ మత వ్యకిగత చట్టాలను తమపై రుద్దుతారనే భావన మైనారిటీ మతాల్లోనూ, వివిధ జాతుల్లోనూ, తెగల్లోనూ ఉంది. ఈ అంశంపైన అంగీకారంతో కూడిన స్పష్టత రాకుండా ఉమ్మడి పౌర స్మృతి రూపొందించడం దేశ భవిష్యత్తుకు ప్రమాదకరం.

రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లోని 44వ అధికరణ ఉమ్మడి పౌర స్మృతి కోసం ప్రయత్నించాలని సూచించింది. ఇది సూచన మాత్రమే, మరోవైపు ఎవరి మతాచారాన్ని వారు ఆచరించే హక్కు కలిగి ఉండవచ్చునని ప్రాథమిక హక్కులలో అదే రాజ్యాంగంలో పొందుపర్చబడింది. రాజ్యాంగంలోని 25 నుండి 28 వరకు ఉన్న ఆర్టికల్స్ ప్రతి వ్యక్తికీ తమ తమ మతవిశ్వాసాలను కొనసాగించే ప్రాథమిక హక్కు కల్పించాయి.

రాజ్యాంగంలోని 4వ భాగంలో అధికరణ 36 నుండి 51 వరకు ఆదేశ సూత్రాలను పొందుపర్చారు. అవన్నీ భారతదేశం నవీన నాగరిక దేశంగా, ఆదర్శ రాజ్యాంగా అవతరించేందుకు మార్గదర్శకాలు. వాటిలో కేవలం



యూసీసీ మాత్రమే గాకుండా అనేక ఇతర అంశాలు కూడా ఉన్నాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో సహా ఇతర కార్మికులందరికి గౌరవంగా జీవించే అవకాశం (అధికరణ 43), రాజ్యాంగం అమలులోకి వచ్చిన పదేళ్లల్లోనే 14 ఏండ్ల లోపు పిల్లలందరికీ ఉచిత, తప్పనిసరి విద్యను కల్పించడం (అధికరణ 45), ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీనవర్గాల విద్యా, ఆర్థిక ప్రయోజనాలను ప్రోత్స హించడం (అధికరణ 46), ప్రజారోగ్యాన్నీ, జీవన ప్రమాణాలనూ మెరుగుపర్చడం (అధికరణ 47), స్త్రీ–పురుషులకు సమాన పని, సమాన వేతనం, ఆదాయ అసమానతలు తగ్గించడం తదితర అంశాలు పొందుపర్చబడ్డాయి. వాటిని అమలు చేయాల్సిన బాధ్యతను విస్మరించి ప్రజల మధ్య చిచ్చు పెట్టే యూసీసీని మాత్రమే బీజేపీ ఎందుకు ఎంచుకుంటోంది?

ఒకే కుటుంబంలో రెండు చట్టాలు ఉండకూడదనీ భారతదేశం మొత్తానికీ ఒకే యూసీసీ అమలు చేయాలనీ ప్రధాని రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారు. ఒకే కుటుంబంలో అన్న హిందూ మతం, తమ్ముడు క్రైస్తవ మత విశ్వాసకులుగా ఎన్ని కుటుంబాలను మనం చూడటం లేదు. వివాహ పద్ధతులలో సాంప్రదాయక వివాహాలతోపాటు వివిధ రీతులలో రిజిస్ట్రేషన్, స్టేజీ వివాహాలు జరగడం లేదా? ఒక ప్రాంతంలోనే ఒకే భాష మాట్లాడే వారిలోనే వివాహ పద్ధతులు, మరణించిన మనిషి అంత్యక్రియలు వివిధ పద్ధతులలో జరగడం మనం చూస్తున్నదే కదా. ఇటువంటి అనేక అంశాలను దృష్టిలో పెట్టుకొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పౌర స్మృతి ఐచ్ఛికం మాత్రమేనని, రాజ్యం తక్షణమే దానిని అమలు లోకి తీసుకురావాల్సిన అవసరం లేదన్నారు. వివిధ సమూహాల అంగీకారం ద్వారానే ఉమ్మడి పౌర స్మృతికి సంబంధించిన చట్టాలను చేసేందుకు అవకాశం కల్పించబడిందని వివరించారు.

యూసీసీని ముస్లింలు వ్యతిరేకిస్తున్నట్లుగా ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. ముస్లిం మతంలో పురుషులు బహు భార్యలను కలిగి ఉండే దురాచారాన్ని రూపు మాపడం కొరకే ఉమ్మడి పౌర స్మృతి అనే విధంగా ప్రజలను మభ్య పెడుతున్నారు. అందు కొరకే యూసీసీని ముస్లింలు వ్యతిరేకిస్తున్నట్లుగా దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నారు. నిజానికి అత్యధిక గిరిజన జనాభా ఉండే ఈశాన్య రాష్ట్రాలలో బహు భార్యత్వం ఎక్కువ అని ఓ సర్వేలో తేలింది. యూసీసీని ముస్లింలు మాత్రమే వ్యతిరేకించడంలేదు. హిందూ మతంలోని విభిన్న కులాలు, తెగలు, వివిధ రకాల ఆచార వ్యవహారాలు కలిగినటువంటి వారు, దేశంలోని అసంఖ్యాక ఎస్సీ, ఎస్టీ వర్గాలు కూడా ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షా 'యూసీసీని క్రిస్టియన్లకు, ఆదివాసీలకు వర్తింజేయబోవటం లేదని' తమకు హామీ ఇచ్చినట్లుగా నాగాలాండ్ ముఖ్యమంత్రితో కూడిన ప్రతినిధి బృందం ప్రకటించింది. అలాగే ఆదివాసీల ఆచార వ్యవహారాలు భిన్నమైనవైనందున వారిని యూసీసీ పరిధిలోకి తీసుకురావద్దని బీజేపీ ఎంపీ సుశీల్ మోదీ నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ సూచించింది. అంద రికీ ఒకే చట్టం అని ఒకవైపు చెబుతూ క్రిష్టియన్లకు, ఆదివాసీలకు వర్తింపచేయడం లేదంటే కేవలం ముస్లింలనే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొస్తున్నట్లుగా అర్థమవు తున్నది. ప్రస్తుతం దేశంలో ఉన్న హిందూ వివాహ చట్టం కూడా ఏక రీతిలో లేదు. హిందూ వివాహ చట్టం గోవాలోని హిందువులకు వర్తించదు. గోవాలో హిందూ పురుషుని భార్య 30 ఏండ్ల లోపు, మగబిడ్డకు జన్మ ఇవ్వకపోతే పురుషుడు మరో వివాహం చేసుకోవచ్చును. ఉత్తరాదిన మేనరిక వివాహాలు నిషిద్ధం, దక్షిణాదిన మేనరిక వివాహాలకు ఆమోదం ఉన్నది. హిందు వివాహ చట్టం ప్రకారం సపిండ (రక్త సంబంధీకుల) వివాహాలు నిషిద్ధం. అదే సమయంలో ఆయా ప్రాంతాలలో ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా సడలింపులను కూడా ఈ చట్టం ఇచ్చింది. కాలానుగుణంగా వచ్చే మార్పులకు అనుగుణంగా బాల్య వివాహాల రద్దు చట్టం, సతీ ఆచార చట్టం, ట్రిపుల్ తలాక్ లాంటి చట్టాలను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఒక్క ముస్లిం మతానికి సంబంధించిన వారే కాకుండా అన్ని మతాల్లోని వారు కూడా ఉమ్మడి పౌర స్మృతి బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తున్నారు.

వేదకాలం నాటి నుండి బ్రిటిష్ కాలం వరకు భిన్నత్వంతో కూడిన వ్యక్తిగత చట్టాలు కొనసాగుతున్నాయి. ప్రతి మతానికీ, ఆ మతంలో అనేక తెగలకూ, జాతులకూ వేర్వేరు వివాహ సంస్కృతులు, ఆచారాలు, భిన్నమైన కుటుంబ పద్ధతులు కొనసాగుతున్నాయి. ఈ విధంగా వైవిధ్యంతో కూడిన భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వంగా వెలుగొందుతున్న భారత్‌లో కేవలం 'ఏకత్వం' పేరుతో 'ఒకే దేశం ఒకే జాతి' లాంటి ఆకర్షణీయమైన నినాదాల ముసుగులో ఉమ్మడి పౌర స్మృతి చట్టాన్ని బలవంతాన అమలు చేయడం బీజేపీకి మాత్రం లబ్ధి చేకూర్చుతుంది. దేశానికి అది ఆత్మహత్యా సదృశ్యమే. కావున ఏకత్వానికి బదులు ఏకాభిప్రాయాన్ని సాధించాలి.

వ్యాసకర్త సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** బ.విదియ రా.7.56 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ధనిష్ఠ ప.1.55 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** రా.8.34 నుండి 10.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.47 వరకు తదుపరి ప.3.05 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** తె.5.32 నుండి 7.02 వరకు (తెల్లవారితే శుక్రవారం); **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.30.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

ఈస్ట్ కోస్ట్ రైల్వే

టెండర్ నం. SNTGSUWATOTAUTOKBMPSA0623

పని పేరు : వాల్తేర్ విభాగం యొక్క మెయిన్ లైన్‌లో సౌపాడా, పుండి, పలాస వద్ద ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ (EI) మార్పులు మరియు తీపులుపల్లి (CPP) నుండి పలాస (PSA) వరకు MSDAC యొక్క స్థాపన కలుపుకొని కోటబొమ్మాళి (KBM)-పలాస (PSA) మధ్యన ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టం ఏర్పాటు.

ప్రకటిత విలువ రూపాయలు: 33,93,17,099.00, బయానా (రూ.) 18,46,600.00, పూర్తి చేయు కాలం : 12 నెలలు.

బిడ్డింగ్ ప్రారంభ తేది : 31.07.2023

టెండర్ ముగింపు తేది మరియు సమయము.

14.08.2023న 12.00 గం.లకు

పై టెండర్‌కు ఎటువంటి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించబడవు మరియు అట్టి మాన్యువల్ ఆఫర్ పరిశీలన లేకుండా తిరస్కరించబడును.

పై ఇ-టెండరు యొక్క ఇ-టెండరు డాక్యుమెంట్లు కలుపుకుని పూర్తి సమాచారం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లో లభిస్తుంది.

PR-48/CG/23-24 — డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికం ఇంజనీర్, వాల్తేరు

'రైతులకు పరిహారం ఇవ్వాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) తెలంగాణ అధికార ప్రతినిధి జగన్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరదల వల్ల నష్టపోయిన వారికి తక్షణమే నష్టపరిహారం అందించాలని కోరారు. ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు సరైన పునరావాసం కల్పించాలని, దెబ్బతిన్న ఇళ్లను ప్రభుత్వం తిరిగి నిర్మించాలన్నారు. వరదల కారణంగా రైతులు అపారమైన నష్టాన్ని చవిచూశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఎడ్లబండిపై వాగు దాటించి...

- మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చిన బంధువులు

ఉట్నూర్‌రూరల్: వాగులపై వంతెనలు లేకపోవడం ఆదివాసీలకు ప్రాణ సంకటంగా మారింది. ఉట్నూర్ మండలం నర్సాపూర్ పంచాయతీ పరిధిలోని ఆడగూడ గ్రామానికి చెందిన ఆడ మారుతి (35)కి పచ్చకామెర్లు సోకాయి. ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అక్కడి నుంచి ప్రైవేటు వాహనంలో దంతన్‌పల్లి సమీప వాగు వరకు శవాన్ని తీసుకొచ్చారు. వరద ప్రవాహంతో వాగు దాటే పరిస్థితి లేదు. దీంతో ఎడ్ల బండి సహాయంతో శవాన్ని ఆడగూడ గ్రామానికి తరలించారు.



రైతుల బతుకులపై నీళ్లు!

▶ మొదటి పేజీ తరువాయి

కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో పలుచోట్ల పొలాలు కోతకు గురై, ఇసుక మేటలు వేసి, ఇప్పట్లో పంట వేయలేని స్థితికి చేరాయి. మరో నెల రోజుల్లో పంటలు వేయకపోతే ఈ వానాకాలం సీజన్‌లో ఇక సాగు చేయడం కుదరదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రెండు నెలలుగా దుక్కులు, విత్తనాలు, నార్లు పోయడానికి ఎకరానికి సగటున రూ.18 వేల వరకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కొండాయి, మోరంచపల్లి తదితర పల్లెలు ఘొల్లుమంటున్నాయి. వరదలతో పాడి పశువుల తోపాటు ఇళ్లు, ఆస్తులను కోల్పోయి రైతులు బిక్కుబిక్కుమంటున్నారు.

ఎన్‌పీడీసీఎల్ పరిధిలో రూ.60 కోట్ల నష్టం

ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌డీపీసీఎల్) పరిధిలోని 16 జిల్లాల్లో వర్షాల వల్ల రూ.60 కోట్ల నష్టం వాటిల్లింది. సుమారు 20 వేల విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా.. 3,200 ట్రాన్స్‌ఫార్మర్లు, 140 సబ్‌స్టేషన్లు నీటమునిగాయి. 742 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఇందులో 3 గ్రామాలకు తప్ప అన్నింటికీ విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు.



సర్వస్వం కోల్పోయి..

ములుగు జిల్లా కొండాయిలో ప్రజలు వరదలతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కొత్తూరుకు పరుగులు పెట్టారు. వరద తగ్గాక నేల కూలిన ఇళ్లు, మొండిగోడలు, తడిసిన బియ్యం, కొట్టుకుపోయిన సామగ్రిని చూసి గుండెలవిసేలా ఏడ్చారు. గ్రామానికి చెందిన గిరిజన రైతు దంపతులు బొల్లికుంట లక్ష్మి, ధనుంజయలకు చెందిన రెండెకరాల వరి నారు పూర్తిగా కొట్టుకుపోయింది. రెండు దుక్కిటెద్దులు గల్లంతయ్యాయి. ఇల్లు దెబ్బతిన్నది. చేతిలో చిల్లిగవ్వలేదు. ప్రభుత్వం ఆదుకుంటుందన్న ఆశతో బతుకుతున్నామని వారు చెప్తున్నారు.

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని అవుతాపురం, రాజ్ మాన్‌సింగ్ తండా, పోచంపల్లి, గంట్లకుంట, రంగాపురం వరకు రూ.8.70 కోట్లతో సుమారు 11 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టారు. 2023 జనవరిలో ఇది పూర్తి కావాల్సి ఉన్నా జాప్యమైంది. ఇటీవలి భారీ వర్షాలతో పోచంపల్లి గ్రామ పరిధిలో ఇలా రోడ్డు కొట్టుకుపోయింది.





ఈ చిత్రంలో కనిపిస్తున్నది మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అర్జునగుట్టకు చెందిన రైతు కుమ్మరి సంతోష్. ప్రాణహిత బ్యాక్ వాటర్ కారణంగా మూడేళ్లుగా ఏటా తన పంట నీట మునుగుతూనే ఉంది. ఈసారి కూడా మూడెకరాల్లో పత్తి నీట మునిగింది. రూ.2 లక్షలు అప్పు తెచ్చి సాగు చేస్తే.. పంట దెబ్బతిన్నదని సంతోష్ ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

మూడెకరాల్లో ఇసుక మేటలు వేసింది



నా వ్యవసాయ భూమి పెద్దవాగు సమీపంలో ఉంది. భారీ వర్షాలకు చెక్‌డ్యాం తెగి వరద పొలాన్ని ముంచేసింది. రూ.50వేలకుపైగా నష్టపోయా. 2021లోనూ నాతో పాటు అనేక మంది రైతులు ఇలాగే చెక్‌డ్యాం తెగి నష్టపోయారు. ఇప్పుడు అదే పునరావృతమైంది.

– నవీన్ యాదవ్, రైతు, సుంకేటు, నిజామాబాద్ జిల్లా

నారుపోయి.. ఇసుక చేరి..



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు దేవేందర్‌గౌడ్. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి గ్రామం. వ్యవసాయమే జీవనాధారం. ఇటీవలే మూడెకరాల్లో వరి నాట్లు వేశారు. కానీ మోరంచవాగు వరదతో వరి నారు పూర్తిగా కొట్టుకుపోయింది. పొలంలో ఇసుక మేటలు వేసింది. దీంతో ఈసారి పంట వేయలేని పరిస్థితి నెలకొందని దేవేందర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈయన ఒక్కడే కాదు.. మోరంచపల్లిలో మరికొందరు రైతులదీ ఇదే గోస.

చిరువ్యాపారం.. చిన్నాభిన్నం



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు దొడ్డ ప్రేమలీల. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లిలో కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవిస్తోంది. గత నెల 28న రాత్రి పోటెత్తిన వరదలో సుమారు రూ.3 లక్షల విలువైన కిరాణా సామగ్రి, వస్తువులు కొట్టుకుపోయాయి. ఇప్పుడేం చేయాలో తెలియడం లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె వాపోతున్నారు.

పంట మునిగిందని యువ రైతు ఆత్మహత్య



రాక్రే అపుల్

బేల: పంట మునిగిందని దిగాలుతో యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలో చోటు చేసుకుంది. భారీ వర్షాల కారణంగా పంట నష్టం వాటిల్లడంతో గ్రామానికి చెందిన యువ రైతు రాక్రే అపుల్ (26) మంగళవారం రాత్రి ఇంటి సమీపంలోని పశువుల పాకలో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో రాక్రే అపుల్, తన తండ్రి గుణవంత్‌రావుతో కలిసి ఐదెకరాల పొలంలో సాగు చేస్తున్నాడు. ఎకరాకు రూ.30 వేల పెట్టుబడి పెట్టి పత్తి, కంది పంటలు వేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద ముంపునకు గురై, పంట పూర్తిగా దెబ్బతింది. ఈ క్రమంలో దిగాలు చెందిన అపుల్ పశువుల పాకలో మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి సోదరుడు రాక్రే సచిన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు.

జాలువారిన పత్తి.. 4 ఎకరాల్లో తొలగించిన రైతు



పత్తి పంటను తొలగిస్తున్న రైతు

నర్సంపేట: వర్షాలతో పత్తి పంటకు తీరని నష్టం వాటిల్లింది. కలుపు మొక్కలు భారీగా పెరిగి పత్తి పంటను ఎదగకుండా చేశాయి. కలుపు తీసినా ఖర్చు తప్ప లాభం లేదనుకుంటున్న రైతులు ఏకంగా పంటను కలుపు మొక్కలతో కలిపి దున్నుతున్నారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని అర్వయ్యపల్లి గ్రామానికి చెందిన వర్షం శ్రీనివాస్‌రెడ్డి నాలుగు ఎకరాల్లో పత్తి వేశాడు. భారీ వర్షాలతో పత్తి మొక్కల కంటే కలుపు మొక్కలే ఏపుగా పెరిగాయి. గుంటుక తోలేందుకు, కూలీలతో కలుపు తీసేందుకు సాధ్యం కాలేదు. దీంతో బుధవారం కలుపు మొక్కలతో పత్తి పంటను తొలగించాడు. తొలగించిన వ్యవసాయ భూమిలో మొక్కజొన్న సాగు చేస్తానని, భారీగా కురిసిన వర్షాలకు ఆర్థికంగా నష్టపోయానని వాపోయాడు.

ఎంత కష్టం.. ఎంత నష్టం

- వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన
- మోరంచపల్లి, ములుగు, కొండాయి, మల్యాలలో పరిశీలన

భూపాలపల్లి అర్బన్/ములుగు, ఏటూరునాగారం: ఇటీవల భారీ వరద తాకిడికి గురైన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి గ్రామాన్ని బుధవారం కేంద్ర బృందం పరిశీలించింది. భారీ వర్షాలు, వరద ఉధృతికి మోరంచపల్లి గ్రామంలో జరిగిన ప్రాణ, ఆస్తినష్టం గురించి కలెక్టర్ భవేష్‌మిశ్రా వివరించారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తూ కేంద్ర బృందం సభ్యులు బాధితులతో మాట్లాడారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ తర్వాత ములుగు జిల్లాకు చేరుకున్న బృందానికి కలెక్టర్ ఇలా త్రిపాఠి వర్షం, వరదల నష్టాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పస్రా సమీపంలో గుండ్లవాగు వద్ద కొట్టుకుపోయిన జాతీయ రహదారిని, ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని జలగలంచ దారిని పరిశీలించారు. సాయంత్రం ఏటూరునాగారం మండలంలోని కొండాయి, మల్యాల వరద ముంపు గ్రామాలను కేంద్ర బృందం పరిశీలించింది. వరద ఉధృతి ఏ మేరకు వచ్చింది.. ఎనిమిది మంది ఎలా కొట్టుకుపోయారు.. వంటి వివరాలను సర్పంచ్ కాక వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బృందంలో ఎన్‌డీఎంఏ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి తదితరులు ఉన్నారు.



భూపాలపల్లి జిల్లాలో కొట్టుకుపోయిన జాతీయ రహదారిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

'తెలంగాణకు వరద సాయం అందించాలి'

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని 10 జిల్లాల్లో భారీ వర్షాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాలు ముమ్మరం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కోరింది. 10 లక్షలకు పైగా ఎకరాల్లో భారీగా పంట నష్టం జరిగిందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడు హన్నన్ మొల్ల, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ లేఖ రాశారు.

పురపాలక సంఘం నార్సింగి, రంగారెడ్డి జిల్లా

నోటీసు నెం.ఇ1/74/2023 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు** తేది:02.08.2023

కమిషనర్, పురపాలక సంఘం నార్సింగి, రంగారెడ్డి జిల్లా ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా రూ.325.00 లక్షల (12) పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతుంది. టెండరుదారులు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in నుండి టెండర్ షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చును మరియు తదుపరి వివరాలను పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 11.08.2023 ఉ.11.00 గం. వరకు. సం/- కమిషనర్, నార్సింగి మున్సిపాలిటీ

DIPR RO No.4905-PP/CL/Advt/1/2023-24, Dt: 02.08.2023

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

E-in-C(R&B), SR&CRN, e-NIT No. 21/E-in-C(SR&CRN)/SE(D&P)-HIEE(SR)/DEE/AEE/2023-24 తేది : 31.07.2023 ప్రకారం దిగువ తెలిపిన జిల్లాలలోని 18 బ్రిడ్జి పనుల కోసం టెండర్లు కోరబడుచున్నవి. క్ర.సం., జిల్లా పేరు, పనుల సంఖ్య వరుసగా : (1) నాగర్ కర్నూలు-2, (2) మహబూబ్‌నగర్-5, (3) యాదాద్రి భువనగిరి-3, (4) ఖమ్మం-3, (5) భద్రాద్రి కొత్తగూడెం-1, (6) వికారాబాద్-2, (7) రంగారెడ్డి-1, (8) నిజామాబాద్-1, మొత్తం : 18. టెండరుదార్లు టెండరు షెడ్యూలు మరియు తదుపరి వివరాలను https://tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. ఆఖరి తేది : 11.08.2023. సం/- ఇంజనీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN

DIPR RO No.1175-DP/CL/Advt/1/2023-24, Dt: 02.08.2023

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్

HMDA చట్టం 2008లోని సెక్షన్ 15(3) క్రింద బహిరంగ ప్రకటన

(ప్రభుత్వ మెమో నం.12555/Plg.I(1)/2022, తేది: 10.07.2023) 339/PR/HMDA/2023

HMDA చట్టం 2008 (యాక్ట్ నం.8 ఆఫ్ 2008)లోని సెక్షన్ 15 యొక్క ఉపసెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ, G.O.Ms.No.288 MA తేది:03.04.2008 ప్రకారం ఆమోదించబడిన హయత్‌నగర్ జోన్ సెగ్మెంట్‌లోని ప్రకటిత ఇంతకు ముందరి HUDA ఏరియా మాస్టర్ ప్లాన్‌లో ఉద్దేశించిన భూమి ఉపయోగానికి దిగువ తెలిపిన మార్పు చేయుటకు ప్రతిపాదించడమైనది. రంగారెడ్డి జిల్లా, సరూర్‌నగర్ మండలం, కర్మన్‌ఘాట్ గ్రామంలో గల 5434.65 చ.మీటర్ల (నికర విస్తీర్ణం 4725 చ.మీటర్లు) విస్తీర్ణం గల సైట్ 59 (59P) అది ప్రస్తుతం G.O.Ms.No.288 MA తేది:03.04.2008 ప్రకారం ఆమోదించబడిన హయత్‌నగర్ జోన్ సెగ్మెంట్‌లోని ప్రకటిత ఇంతకు ముందరి HUDA ఏరియా మాస్టర్ ప్లాన్‌లో నివాస ఉపయోగ జోన్ కోసం కేటాయించబడినది, అది ఇప్పుడు వాణిజ్య ఉపయోగ జోన్ కోసం నిర్దేశించబడినది. పైన తెలిపిన వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్లలో లభిస్తాయి. సదరు ప్రతిపాదనలకు ఎవరేని వ్యక్తి లేదా సంస్థ నుండి అభ్యంతరాలు/ సూచనలు పరిశీలించబడతాయి. వారు లిఖితపూర్వక అభ్యంతరాలు/ సూచనలను M.C, HMDA వారికి లేదా స్పెషల్ చీఫ్ సెక్రటరీ,MA & UD శాఖ, తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ వారికి ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి పదిహేను(15) రోజులలోగా దాఖలు చేయగలరు.

సం/- మెట్రోపాలిటన్ కమిషనర్, HMDA తరఫున

DIPR RO No.4929-PP/CL/Advt/1/2023-24, Dt: 02.08.2023

CSIR - INDIAN INSTITUTE OF CHEMICAL TECHNOLOGY
(Council of Scientific & Industrial Research)
HYDERABAD - 500007.

WALK-IN-INTERVIEW NOTIFICATION NO. 11/2023

CSIR-IICT, Hyderabad conducting Walk-in-Interviews on 09th Aug, 2023 for the positions of Project Staff having qualifications of Ph.D. (Chemistry) / MSc (Chemistry / Organic Chemistry / Life Sciences / Biotechnology) / MS in Pharmacy / B.Tech (Chem / Env. Engg / EEE / IT / Safety Engg) / M.Pharmacy / BSc Chemistry / Diploma (Mechanical / Electrical / R&AC Engineering) etc.

For full details visit our website www.iictindia.org

Sd/-
Controller of Administration

AP State Civil Supplies Corporation Ltd.
(A STATE GOVERNMENT UNDERTAKING)
HEAD OFFICE: Sri Sai Towers, Door No.10-152/1, 4th & 5th Floor, Ashok Nagar, Beside Siris Company, Bandaru Road, Kanuru, Vijayawada-520007.

TENDER NOTICE

L.No.Mktg/Bio Metric Devices/2023-24 Dated: 02/08/2023

Empanelment and Appointment of Supplier for supply of 3600 Bio-Metric Devices supporting (Windows, Linux & android) through NCDEX e Markets Limited (NeML) auction platform for utilization at PPCs at RBKs in Andhra Pradesh

APSCSCL invites tenders for appointment of Supplier for supply of 3600 Bio-Metric Devises to PPCs at RBKs for utilization in paddy procurement operations across the districts of Andhra Pradesh through NeML Platform

Interested Tenderers may visit website www.apscscl.in and also www.neml.in to view and download tender documents, free of cost

Those who are interested to participate in tender should be registered with NCDEX e-Markets Ltd. on their website www.neml.in and can contact the Customer Service Group or phone numbers (+91-22)–48810500/9962059599/8032429420 or Email: askus@neml.in

Last date for online registration and completion of formalities for submitting the online tenders shall be up to 17.08.2023 by 5.00 pm and the tentative date of online e-reverse auction through NeML platform would be on 19.08.2023.

Sd/- Sri. G.VEERAPANDIAN, I.A.S., VC & Managing Director

भारत सरकार GOVERNMENT OF INDIA
परमाणु ऊर्जा विभाग DEPARTMENT OF ATOMIC ENERGY
भारी पानी संयंत्र (मणुगूरु) HEAVY WATER PLANT (MANUGURU)
निविदा सूचना TENDER NOTICE

भारत के राष्ट्रपति की ओर से एवं के लिए, महाप्रबंधक, भारी पानी संयंत्र (मणुगूरु), निम्नलिखित कार्य के लिए मुहरबंद निविदाएं मंगित की जाती है । For and on behalf of President of India, General Manager, HWPM invites online item rate bids on two bid system for following works:

निविदा सूचना संख्या : भापासंम/जिएऐन/103(1)/2023-24. कार्य का नाम : भापसं विभागीय कैंटीन एवं ... सात दिनों के लिए चौबीसों घंटे और सामान्य शिफ्ट में लगभग 1000 व्यक्तियों को खान पान भोजन । अनुमानित : ₹ 50,84,500/-, अनुबंध की अवधि: 12 महीने, बयाना : ₹ 1,01,690/-, निविदा दस्तावेजों को देखने और डाउनलोड करने की निर्धारित दिनांक : 02.08.2023 (09:30 बजे) से 11.08.2023 (23:59 बजे) तक, ऑन लाइन निविदाओं को जमा करने की अंतिम तिथि एवं समय दिनांक 12.08.2023 के 23:59 बजे या उससे पहले । ईएमडी हेतु मूल डीडी/बीजी/पीओ आदी जमा कराने की और तकनीकी बोली ऑन लाइन खोलने की अंतिम तिथि दिनांक 16.08.2023 को प्रशासनिक अधिकारी, भापासंम के कार्यालय में 14:00 बजे तक प्रस्तुत करें और खोलना उसी तारीख को उसी कार्यालय में 14:30 बजे को । निविदा अधिसूचना एवं दस्तावेज वेबसाइट http://eprocure.gov.in पर उपलब्ध है ।

NIT. No.: HWPM/GEN/103(1)/2023-24, Name of the work: Catering food to approx 1000 persons in round-the-clock and general shifts for 7 days a week in HWP(M) Departmental Canteen I & II, Estimated Cost: ₹ 50,84,500/-, EMD: ₹ 1,01,690/-, Period of completion: 12 Months, Date of online availability of E-tender for view and download: From 02/08/2023 (09:30 hrs) to 11/08/2023 (23:59 hrs), Last date & time for online submission of bid: 23:59 Hrs of 12/08/2023; Date and time of EMD submission and technical bid Opening: Upto to 14:00 Hrs On 16/08/2023 and opening after 14:30 Hrs on the same day in the O/o AO-III(IR), HWPM. The bid forms and other details can be obtained from the website http://eprocure.gov.in Detailed NIT can be viewed at http://www.hwb.gov.in

Sd/-
(निविदा आमंत्रित अधिकारी के हस्ताक्षर)
(Signature of Tender inviting authority)

HWPM/Admn(C)/NIT/13/2023/2526 Dt. 02/08/2023

భారత ప్రభుత్వం
సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ
వికలాంగుల (దివ్యాంగుల) సాధికారత శాఖ
రూమ్ నం.517, 5వ అంతస్తు, అంత్యోదయ భవన్, CGO కాంప్లెక్స్, న్యూ ఢిల్లీ – 110003

2023 సంవత్సరం కోసం
వికలాంగుల (దివ్యాంగుల) సాధికారత కొరకు జాతీయ అవార్డులు

2023 సంవత్సరం కోసం దివ్యాంగుల సాధికారత రంగంలో జాతీయ అవార్డుల కోసం దరఖాస్తులు గతంలో 15 జూన్, 2023న ఈ శాఖచే కోరబడినవి. దరఖాస్తు/ నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆఖరి తేది 31 జూలై, 2023 వరకు ఉండేది.

2. 2023 సంవత్సరం కోసం దివ్యాంగుల సాధికారత కోసం జాతీయ అవార్డుల కొరకు కామన్ అవార్డ్ పోర్టల్ (www.awards.gov.in) లో దరఖాస్తులు/ నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆఖరి తేది 01.08.2023 నుండి 15.08.2023 వరకు పొడిగించబడిందని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైనది.

3. 2023 సంవత్సరం కోసం పైన తెలిపిన అవార్డు కొరకు దరఖాస్తు/ నామినేషన్లను 15 ఆగస్ట్, 2023లోగా పాస్‌వర్డ్ ప్రొటెక్టెడ్ సెంట్రలైజ్డ్ పోర్టల్ (www.awards.gov.in) పై ఆన్‌లైన్ విధానంలో మాత్రమే దాఖలు చేయవలెనని మరొకసారి సంబంధితులందరికీ తెలియజేయడమైనది. భౌతిక రూపంలో/ ఇ-మెయిల్ ద్వారా దరఖాస్తులు పరిశీలించబడవు.

4. అర్హత ప్రమాణాలు మరియు ఇతర వివరాలు దిగువ తెలిపిన లింక్ https://disabilityaffairs.gov.in వద్ద డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లో లభిస్తాయి.

CBC 38117/11/0027/2324

ఫారం-VII
(సెక్షన్-సబ్-రూల్ (1) రూల్-25)
మరియు (సెక్షన్-19(1) చట్టము-30/2013)
తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
లేదా
కలెక్టర్/సంయుక్త కలెక్టర్/స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)/
ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ
రూఢీ ప్రకటన (డిక్లరేషన్)

ఫైల్ నెం. : ఙ1/3744/2022 తేది : 26-07-2023

తెలంగాణ ప్రభుత్వం / కలెక్టర్, సంగారెడ్డి గారు ఈ దిగువ చూపబడిన సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం మండలం యెల్గోయి గ్రామములో దాదాపు ఎ. 16.20 గుంటల భూమి మరియు చీలపల్లి గ్రామము ఝరాసంగం మండలం సంగారెడ్డి జిల్లా ఎకరాలు 1.31 గుంటలు విస్తీర్ణం గల భూమి ప్రజల ఉపయోగార్థము నిమ్జ్ ప్రాజెక్ట్ ఏర్పాటు నిమిత్తం అవసరం ఉన్నదని భావించడం జరిగింది.

తదనుగుణంగా పై ప్రాజెక్టు కోసం కొద్ది హెచ్చు తగ్గులతో సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం మండలం యెల్గోయి గ్రామములో దాదాపు ఎ. 16.20 గుం. గల భూమి మరియు చీలపల్లి గ్రామము ఝరాసంగం మండలం సంగారెడ్డి జిల్లా ఎకరాలు. 1.31 గుంటలు విస్తీర్ణం గల భూమి ఈ దిగువ చూపిన ప్రకారం సేకరించుటకు గాను డిక్లరేషన్ (రూఢీ ప్రకటన)ను జారీ చేయనైనది.

జిల్లా : సంగారెడ్డి మండలం : ఝరాసంఘం గ్రామము : ఎల్గోయ్

క్ర. సం.	సర్వే నంబరు	ప్రైవేట్ రకము	భూమి రకము	సేకరించబడిన విస్తీర్ణం ఎ.గుం.	ప్రమేయమున్న వ్యక్తి పేరు మరియు చిరునామా	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు: రకము	మొత్తం	నిర్మాణాలు: విధము	నిర్మించిన స్థలం
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1.	57/అ/5	పట్టా	ఖుష్కి	0.20	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
2.	57/అ/4	పట్టా	ఖుష్కి	0.21	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
3.	57/అ	పట్టా	ఖుష్కి	0.28	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
4.	57/ఇ	పట్టా	ఖుష్కి	0.28	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
5.	57/అ	పట్టా	ఖుష్కి	0.28	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
6.	57/ఇ1	పట్టా	ఖుష్కి	1.02	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
7.	57/ఇ2	పట్టా	ఖుష్కి	1.02	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
8.	57/అ/2	పట్టా	ఖుష్కి	1.02	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
			మొత్తం	6.11									
9.	58/అ	పట్టా	ఖుష్కి	1.16	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
10.	58/ఇ	పట్టా	ఖుష్కి	1.16	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
			మొత్తం	2.32									
11.	59/అ1/అ	పట్టా	ఖుష్కి	0.10	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
12.	59/ఇ	పట్టా	ఖుష్కి	1.26	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
13.	59/అ2	పట్టా	ఖుష్కి	1.23	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
14.	59/అ4	పట్టా	ఖుష్కి	0.33	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
15	59/అ5	పట్టా	ఖుష్కి	0.32	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (ఐదాల రామ్ బాబు సన్ ఆఫ్ వి.వి.సత్యనారాయణ)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
				5.04									
16	75/అ1/1	పట్టా	ఖుష్కి	0.01	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (బి.ఎన్. శ్రీనివాస్ సన్ ఆఫ్ వర్షప్ప)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
17	75/అ1/2	పట్టా	ఖుష్కి	1.00	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (బి.ఎన్. శ్రీనివాస్ సన్ ఆఫ్ వర్షప్ప)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
18	75/అ2	పట్టా	ఖుష్కి	1.00	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (బి.ఎన్. శ్రీనివాస్ సన్ ఆఫ్ వర్షప్ప)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
			మొత్తం	2.01									
19	75/అ2	పట్టా	ఖుష్కి	1.00	ఎం ఎస్ క్లీన్ విండ్ పవర్ ప్రై.లి. అనంతపూర్ (బి.ఎన్. శ్రీనివాస్ సన్ ఆఫ్ వర్షప్ప)	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
			మొత్తం	0.12									
			మొత్తం	16.20									

జిల్లా : సంగారెడ్డి మండలం : ఝరాసంఘం గ్రామము : చీలపల్లి

క్ర. సం.	సర్వే నంబరు	ప్రైవేట్ రకము	భూమి రకము	సేకరించబడిన విస్తీర్ణం ఎ.గుం.	ప్రమేయమున్న వ్యక్తి పేరు మరియు చిరునామా	సరిహద్దులు: ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు: రకము	మొత్తం	నిర్మాణాలు: విధము	నిర్మించిన స్థలం
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	142/అ/2	పట్టా	ఖుష్కి	0.10	ఎం.డి. ఖలీల్ అహ్మద్ తండ్రి ఎం.డి. షకీల్ అహ్మద్	స.నెం. 26	స.నెం. 142	రోడ్డు	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
			మొత్తం	0.10									
2	143/ఆ1	పట్టా	ఖుష్కి	1.21	లీలా దేవి సదా భర్త ఆజయ్ కుమార్ సదా	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	టీ.యస్.ఐ.ఐ.సి.	0	0	0	0
			మొత్తం	1.21									
			మొత్తం	1.31									

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) ప్రకారం భూ సేకరణ సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయడమైనది.

భూ సేకరణలో తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, రాతి పలక మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షంలో వాటిని సేకరించడం జరుగుతుంది. లేనిచో సేకరించబడవు.

భూసేకరణ చేయుచున్న పై భూముల యొక్క ప్లాను భూ సేకరణ అధికారి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ నిమ్జ్ ప్రాజెక్ట్ జహీరాబాద్ వారి కార్యాలయములో ఏదైనా పని దినము నాడు పని వేళలలో చూసుకోవచ్చును.

సం/- తహసీల్దార్, ఝరాసంఘం | సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ నిమ్జ్ ప్రాజెక్ట్, జహీరాబాద్ | సం/- అదనపు కలెక్టర్ సంగారెడ్డి జిల్లా | సం/- కలెక్టర్ సంగారెడ్డి జిల్లా

DIPR RO No. 504/LA/PP/ADVT/AGENCY/2023-24

క్లుప్తంగా...

నిందితులను యాంత్రికంగా అరెస్టు చేయొద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: గరిష్టంగా ఏడేళ్ల జైలు శిక్ష పడే కేసులో నిందితులను యాంత్రికంగా, అనవసరంగా అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని అన్ని హైకోర్టులకు, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డీజీపీలకు సూచించింది. వైవాహిక వివాదానికి సంబంధించిన కేసులో జార్ఖండ్ హైకోర్టు తనకు ముందస్తు బెయిల్ ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ మహ్మద్ అష్ఫాక్ అలామ్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. జార్ఖండ్ హైకోర్టు ఉత్తర్వును తోసిపుచ్చుతూ నిందితుడికి ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది.

కేంద్ర పోలీస్ విభాగాల్లో 1.14 లక్షల ఖాళీలు

న్యూఢిల్లీ: సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, ఢిల్లీ పోలీసు వంటి కేంద్ర పోలీస్ విభాగాల్లో 1,14,245 ఉద్యోగాలు ఇంకా భర్తీ చేయాల్సి ఉందని కేంద్రప్రభుత్వం బుధవారం వెల్లడించింది. రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా బుధవారం ఈ వివరాలు తెలిపారు. ఈ ఏడాది 31,879 పోస్టులకు ప్రకటనలు జారీచేయగా ఇప్పటిదాకా 1,126 పోస్టులే భర్తీ అయ్యాయి. కేంద్ర హోం శాఖ, దాని విభాగాలైన బీఎస్‌ఎఫ్, సశస్త్ర సీమా బల్, సీఆర్‌పీఎఫ్, ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్, అస్సాం రైఫిల్స్, సీఐఎస్‌ఎఫ్, కేంద్ర పోలీసు సంస్థలు, ఢిల్లీ పోలీస్ ఇలా అన్ని విభాగాల్లో మొత్తంగా 1,14,245 ఖాళీలు ఉన్నట్లు మంత్రి తెలిపారు. వీటిలో షెడ్యూల్ కులాల పోస్టులు 16,356 ఉన్నాయి. షెడ్యూల్ తెగలకు 8,759, ఇతర వెనుకబడిన వర్గాలకు 21,974, ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 7,394 పోస్టులు, మిగతా 59వేలకుపైగా జనరల్ కేటగిరీ పోస్టులు ఉన్నాయి.

ఆ 20 వర్సిటీలు నకిలీవి

న్యూఢిల్లీ: దేశంలో మరో 20 సంస్థలు విశ్వవిద్యాలయాలుగా చెలామణి అవుతున్నాయని, అవన్నీ నకిలీవని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) బుధవారం ప్రకటించింది. ఈ 20 సంస్థల్లో ఎనిమిది ఢిల్లీలోనే ఉన్నట్లు పేర్కొంది. ''ఉత్తరప్రదేశ్‌లో గాంధీ హిందీ విద్యాపీఠ్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎలక్ట్రో కాంప్లెక్స్ హోమియోపతి, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ (ఓపెన్) యూనివర్సిటీ, భారతీయ శిక్షా పరిషత్ అనే నాలుగు నకిలీ యూనివర్సిటీలు ఉన్నాయి. పశ్చిమబెంగాల్, ఏపీల్లో రెండేసి నకిలీ వర్సిటీలున్నాయి. కర్ణాటకలో బదగాన్వీ సర్కార్ వరల్డ్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్, కేరళలో సెయింట్ జాన్స్ వర్సిటీ, మహారాష్ట్రలో రాజా అరబిక్ యూనివర్సిటీ, పుదుచ్చేరిలో శ్రీ బోధి అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నకిలీవే'' అని యూజీసీ కార్యదర్శి మనీశ్ జోషి స్పష్టంచేశారు.


ఢిల్లీలోని 8 నకిలీ వర్సిటీలు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అండ్ ఫిజికల్ హెల్త్ సైన్సెస్; కమర్షియల్ యూనివర్సిటీ లిమిటెడ్, దరియాగంజ్; యునైటెడ్ నేషన్స్ యూనివర్సిటీ ఒకేషనల్ యూనివర్సిటీ; ఏడీఆర్–సెంట్రిక్ జ్యుడీషియల్ యూనివర్సిటీ; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్; విశ్వకర్మ ఓపెన్ యూనివర్సిటీ ఫర్ సెల్ఫ్–ఎంప్లాయిమెంట్; ఆధ్యాత్మిక్ విశ్వవిద్యాలయ

వెలుగులు అణువంతే!

అణు బాంబు సృష్టికర్త ఒప్పెన్హీమర్ జీవిత గాథ హాలీవుడ్ తెరపైకెక్కడంతో ప్రపంచవ్యాప్తంగా మరోసారి అణు శక్తిపై చర్చ మొదలైంది. అణు పరిజ్ఞానం ఇప్పటిదాకా ఎన్నోసార్లు చర్చల్లో నానుతూనే ఉంది. ఇటీవలి కాలంలో పర్యావరణాన్ని పరిరక్షించే పునరుద్పాతక ఇంధన శక్తుల వినియోగంపై అవగాహన పెరగడంతో అణుశక్తి ప్రభ క్రమంగా తగ్గుతూ వస్తోంది. దాని స్థానాన్ని సౌర విద్యుత్ ఆక్రమిస్తోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్



అణు ఇంధనం స్థానాన్ని ఆక్రమిస్తున్న సౌర విద్యుత్	ప్రపంచ వ్యాప్తంగా అణు శక్తికి తగ్గుతున్న ఆదరణ

అణు శాస్త్రవేత్త జె. రాబర్ట్ ఒప్పెన్హీమర్ 1940లో తొలిసారి అణు బాంబును సృష్టించారు. తర్వాత పదేళ్లకు 1950లో తొలి అణు విద్యుత్కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో దాన్ని ఇంధన రంగంలో గేమ్ చేంజర్‌గా భావించారు. కానీ అణు విద్యుత్కేంద్రాలు ఎంత ప్రమాదకరమో అనుభవపూర్వకంగా తెలిసొచ్చాక వాటికి ఆదరణ క్రమంగా తగ్గుతూ వస్తోంది. జపాన్, అమెరికా, ఫ్రాన్స్ తప్ప మిగతా దేశాల్లో అణు దానికి ప్రాధాన్యమూ తగ్గుతూ వస్తోంది. జర్మనీ ప్రభుత్వం 3 అణు విద్యుత్ కేంద్రాలను మూసివేయడం గమనార్హం.

1970 దశకంలో అణు విద్యుత్ ఒక వెలుగు వెలిగింది. అణు శక్తికి అది స్వర్ణయుగమని చెప్పొచ్చు. చాలా దేశాల్లో భారీగా అణు ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అలా ప్రపంచ విద్యుదుత్పత్తిలో అణు విద్యుత్ వాటా 1985 కల్లా ఏకంగా 15.1% దాకా పెరిగింది. కానీ 2022 నాటికి అది 9.1 శాతానికి పడిపోయింది. సౌరవిద్యుత్ వినియోగంలోకి రావడమే దీనికి ప్రధాన కారణం. ''2021లో ప్రపంచ దేశాల్లో సౌర విద్యుత్ 1.04 టెరావాట్స్ కాగా, ప్రపంచ అణు విద్యుత్ సామర్థ్యం 463 గిగావాట్లు. అంటే అణు విద్యుత్ కంటే సౌర విద్యుత్ రెట్టింపు కంటే ఎక్కువగా ఉంది'' అని ఇస్రోలో సోలార్ ప్యానెల్ డివిజన్ మాజీ శాస్త్రవేత్త మనీశ్ పురోహిత్ చెప్పారు.

అణు వర్సెస్ సౌర విద్యుత్


- అణు విద్యుత్కేంద్రం ఏర్పాటే అత్యంత ఖరీదైన వ్యవహారం. కొత్తగా అణు ప్లాంట్ నిర్మాణానికయ్యే వ్యయం కనీసం 1,000 కోట్ల డాలర్లు.
- అణు విద్యుదుత్పత్తి వల్ల వెలువడే అణు ధార్మిక వ్యర్థాల నిర్మూలన అత్యంత ప్రమాదంతో కూడిన వ్యవహారం.
- ఒక్కో అణు విద్యుత్కేంద్రం నుంచి ఏటా కనీసం 20 మెట్రిక్ టన్నుల అణు ధార్మిక వ్యర్థాలు వెలువడతాయి.


- ప్రస్తుతం అన్ని దేశాల వద్దా కలిపి 90 వేల మెట్రిక్ టన్నుల అణు ధార్మిక వ్యర్థాలున్నాయి. వీటిని అత్యంత సురక్షిత పద్ధతిలో నిర్మూలించకపోతే ఎన్నో రకాలుగా తీవ్ర ముప్పు వాటిల్లుతుంది.
- పైగా అణు విద్యుత్కేంద్రాలతో ప్రమాదాలు కూడా ఎక్కువే. అందుకే కొత్త ప్లాంట్ల ఏర్పాటును అడ్డుకుంటూ ఎన్నో పోరాటాలు జరిగాయి, జరుగుతున్నాయి.
- దాంతో చాలా ఏళ్లుగా కొత్త అణు విద్యుత్కేంద్రాలేవీ రాలేదు.
- అమెరికా, జపాన్, ఫ్రాన్స్ మినహా మరే దేశాలు అణు విద్యుత్‌పై మొగ్గు చూపించకపోవడంతో అంతర్జాతీయంగా ఒప్పందాలు, పరస్పర సాంకేతిక సహకారం తగ్గిపోయాయి. ఫలితంగా అణు విద్యుత్ చుట్టూ చీకట్లు అలుముకున్నాయి.

సౌర విద్యుత్‌తో లాభాలు...

- సౌర విద్యుత్‌కు ముడి సరుకు సూర్యుడే గనుక దానికి కొరత ఉంటుందన్న భయం లేదు.
- సోలార్ ప్యానెల్స్, యూనిట్ల ధర బాగా తగ్గింది. సోలార్ ప్లాంట్ నిర్మాణ వ్యయం మెగావాట్‌కు 10 లక్షల డాలర్లే. సౌర విద్యుత్ వ్యర్థాలను నిర్మూలించే క్రమంలో ఎలాంటి ప్రమాదానికీ ఆస్కారం లేదు.

> అణు విద్యుత్ రియాక్టర్ల సగటు జీవిత కాలం 60 ఏళ్లు. ఇప్పుడున్న వాటిలో చాలావరకు ఇక పనికి రాని స్థితికి వచ్చేశాయి. కొత్తవి ఏర్పాటు కావడం లేదు. దాంతో అణు విద్యుదుత్పత్తి తగ్గుతూ వస్తోంది
> **- డాక్టర్ నితేంద్ర సింగ్, ఇండియన్ యూత్ న్యూక్లియర్ సొసైటీ వ్యవస్థాపకుడు**





అణ్వాయుధాలు తగ్గిపోతున్నాయ్!

- అమెరికా, రష్యా మధ్య ప్రచ్ఛన్న యుద్ధంలో కొన్నేళ్లు పాటు అణ్వాయుధాల పోటీయే ప్రధానంగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల దగ్గర 1986 నాటికి ఏకంగా 64,452 అణ్వాయుధాలు పోగుపడ్డాయి.
- ఇప్పుడు వాటి సంఖ్య 12,510కి తగ్గింది. వీటిలో 89% రష్యా, అమెరికా దగ్గరే ఉన్నాయి.
- అణు వినాశనం ఎంత భయానకంగా ఉంటుందో హిరోషిమా, నాగసాకిపై అమెరికా అణు బాంబు దాడులతో అందరికీ తెలిసొచ్చింది.
- ఏళ్లు గడిచే కొద్దీ అణ్వాయుధాల తయారీని తగ్గించడంపై దేశాలన్నీ దృష్టి సారించాయి.

1968లో అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం కుదిరిన తర్వాత అణు శక్తిని ప్రజాప్రయోజనాలకే తప్ప, వినాశనానికి వాడొద్దని దేశాలన్నీ నెమ్మదిగా గ్రహించాయి.



హరియాణాలోని నూహ్ జిల్లాలో బుధవారం ఆందోళనకారుల దాడిలో తగలబడుతున్న దుకాణాలు

బలగాల్ని దింపండి

విద్వేష ప్రసంగాలను కట్టడి చేయండి

- ఢిల్లీలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ర్యాలీలను ఆపబోం
- సున్నితమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసి పర్యవేక్షించండి
- ఢిల్లీ పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: దేశ రాజధాని సమీపంలోని హరియాణాలో మత ఘర్షణలు నెలకొన్న నేపథ్యంలో ఢిల్లీలో శాంతిభద్రతలకు విఘాతం కల్గకుండా చూడాలని పోలీసులకు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. హరియాణాలో మత ఘర్షణలకు నిరసనగా వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఢిల్లీలో తలపెట్టిన ర్యాలీలను అడ్డుకోవాలంటూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీ భట్టీల సుప్రీంకోర్టు ధర్మాసనం పైవిధంగా ఆదేశాలిచ్చింది. నూహ్ జిల్లాలో జులై 31వ తేదీన వీహెచ్‌పీ ర్యాలీని అడ్డుకునేందుకు వేరే వర్గం వారు రాళ్లు రువ్వడంతో రాష్ట్రంలో చెలరేగిన మత ఘర్షణల్లో ఇప్పటిదాకా ఆరుగురు చనిపోయారు. ఢిల్లీ, సమీప ప్రాంతాల్లో వీహెచ్‌పీ ర్యాలీల్లో విద్వేష ప్రసంగాలు జరక్కుండా కట్టడిచేయాలని పాలనా యంత్రాంగానికి సుప్రీంకోర్టు సూచించింది. సున్నితమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటుచేసి పర్యవేక్షించాలని, సంబంధిత సీసీటీవీ ఫుటేజీ, వీడియో రికార్డింగ్‌లను భద్రపరచాలని ఆదేశించింది. 'ఢిల్లీని ఆనుకుని ఉన్న హరియాణా, యూపీ ప్రాంతాల్లోనూ ర్యాలీలు జరగొచ్చు. అవసరమైతే అదనపు పోలీసు, పారామిలటరీ బలగాలను రంగంలోకి దింపండి. ఎలాంటి ఆస్తి నష్టం, హింస జరగకుండా చూడండి. ఏ మతానికి వ్యతిరేకంగానైనా విద్వేష ప్రసంగాలు జరక్కుండా అడ్డుకట్టవేయండి' అని కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్, హరియాణా, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలకు ధర్మాసనం ఆదేశించింది. ఈ ఉత్తర్వులు పాలనాయంత్రాగాలకు త్వరగా అందేలా చూడాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి సూచించింది. 'విద్వేష ప్రసంగాలు చేసినపుడు ఫిర్యాదు కోసం వేచిచూడకుండా వెంటనే క్రిమినల్ కేసు నమోదుచేయాలని గత ఏడాది అక్టోబర్ 21న ఢిల్లీ, యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలకు ఇచ్చిన ఆదేశాలు ఇప్పుడూ యథాతథంగా అమలుచేయండి' అని కోర్టు గుర్తుచేసింది. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిరంతరం యంత్రాంగాలతో సంప్రదించాలని కేంద్రానికి సూచించింది.

పలుచోట్ల ర్యాలీలు

ఢిల్లీ, సమీప ప్రాంతాల్లో 23 భారీ ర్యాలీలు చేపడతామన్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ పిలుపుమేరకు బుధవారం ఢిల్లీలో పలుచోట్ల ర్యాలీలు జరిగాయి. ట్రాఫిక్ స్తంభించింది. సున్నిత ప్రాంతాల్లో పోలీసులు భద్రతను పెంచారు. నిర్మాణ్ విహార్ మెట్రో స్టేషన్ వద్ద బజరంగ్‌దళ్ శ్రేణులు హనుమాన్ చాలీసా పఠించారు. వికాస్‌మార్గ్ ప్రాంతం ముట్టడికి ప్రయత్నించిన వారిని పోలీసులు చెదరగొట్టారు.

116 అరెస్టులు: ఖట్టర్

రాష్ట్రంలో మత ఘర్షణలకు సంబంధించి ఇప్పటిదాకా 41 ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసి 116 మందిని అరెస్ట్‌చేశామని హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ చెప్పారు. ప్రస్తుతం పరిస్థితి సాధారణస్థితికి చేరుకుందన్నారు. లోతైన దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని హరియణా సర్కార్ ఏర్పాటుచేసేపనిలో ఉంది.

కునోలో మరో చీతా మృతి

భోపాల్: మధ్యప్రదేశ్ కునో నేషనల్ పార్కులో చీతాల మరణాలు ఆగడం లేదు. బుధవారం ఉదయం ధాత్రి అనే ఆడ చీతా మరణించింది. దీంతో ఇటీవల కాలంలో మరణించిన చీతాల సంఖ్య తొమ్మిదికి చేరింది. ప్రస్తుతం కునో పార్కులో పద్నాలుగు చీతాలున్నాయి. ఏడు మగ చీతాలు, ఆరు ఆడ చీతాలు, ఒక పిల్ల చీతాను ఎన్‌క్లోజర్‌లో ఉంచి సంరక్షిస్తున్నారు. ఆ చీతాలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటే ఈ నెలాఖరుకు అడవిలోకి విడిచిపెట్టాలని అనుకున్నారు. కేంద్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చీతాల ప్రాజెక్టుని చేపట్టింది. నమీబియా, దక్షిణాఫ్రికా నుంచి 20 చీతాలను తీసుకువచ్చి సంరక్షిస్తోంది. ఈ ఏడాది మార్చి నుంచి వరసగా చీతాలు మరణించడం కలకలం రేపుతోంది. వాటి కదలికలు తెలుసుకోవడం కోసం ఏర్పాటు చేసిన రేడియో కాలర్ వల్ల గాయాలై కొన్ని చీతాలు మరణించినట్టు నిపుణులు అభిప్రాయపడ్డారు. మిగతా చీతాలకు రేడియో కాలర్లను తీసేసినా మరో చీతా మరణించడంతో ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నట్టయింది.

మోదీ నోరు విప్పాలి

మణిపూర్‌పై పార్లమెంట్‌లో విపక్షాల డిమాండ్

ఉభయ సభలు వాయిదా.. ● కలత చెంది లోక్‌సభకు స్పీకర్ ఓం బిర్లా గైర్హాజరు

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో విపక్షాలు తమ డిమాండ్‌పై మెట్టు దిగడం లేదు. ఫలితంగా లోక్‌సభ, రాజ్యసభలో ఆందోళనలు, నినాదాలు, నిరసనలు, వాయిదాలు నిత్యకృత్యంగా మారాయి. మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో చర్చించాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు తొమ్మిదో రోజు బుధవారం సైతం ఉభయ సభలను స్తంభింపజేశారు. సభా కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలుగుతుండడంతోపాటు విపక్ష, అధికారపక్ష సభ్యుల తీరుతో కలత చెందిన స్పీకర్ ఓం బిర్లా బుధవారం లోక్‌సభకు రాలేదు. సభా గౌరవాన్ని కాపాడాలని స్పీకర్ ఆరాటపడుతున్నారని, సభ్యుల నుంచి సహకారం లభించక కలతతో సభకు హాజరు కాలేదని అధికార వర్గాలు వెల్లడించాయి.

సమాధానం చెబుతా: అమిత్ షా

లోక్‌సభ బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. స్పీకర్ ఓం బిర్లా రాకపోవడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు, ప్యానెల్ స్పీకర్ మిథున్‌రెడ్డి సభాపతి స్థానంలో కూర్చొని ప్రశ్నోత్తరాలు చేపట్టారు. వెంటనే విపక్ష ఎంపీలు మణిపూర్ అంశాన్ని లేవనెత్తారు. నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. సభలో గందరగోళం నెలకొనడంతో ప్యానెల్ స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. సభ పునః ప్రారంభమైన తర్వాత ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు ప్రారంభించారు. మణిపూర్ అంశంపై చర్చ ప్రారంభిద్దామని, తాము సమాధానం చెబుతానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రతిపాదించగా, విపక్ష సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రధానమంత్రి రావాల్సిందేనని పట్టుబట్టారు. ఈసారి సభాపతి స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ కిరీట్ సోలంకీ సభకు సహకరించాలంటూ పదేపదే కోరినా వారు వినిపించుకోలేదు. దాంతో సభను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు కిరీట్ సోలంకీ ప్రకటించారు. మరోవైపు కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి, ఎన్సీపీ సభ్యురాలు సుప్రియా సులే స్పీకర్‌తో సమావేశమైనట్లు తెలిసింది.

మోదీని ఆదేశించలేను: ధన్‌ఖడ్

మణిపూర్ హింసపై రూల్ 267 కింద సభలో చర్చ చేపట్టాలంటూ రాజ్యసభలో విపక్షాలు ఆందోళనకు దిగాయి. వాటిని తిరస్కరిస్తున్నట్లు రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చెప్పడంతో అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు ప్రారంభించారు. మణిపూర్‌లో కనీవినీ ఎరుగని హింస జరుగుతోందని, ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని విపక్ష నేత, కాంగ్రెస్ సభ్యుడు మల్లికార్జున ఖర్గేకు మాట్లాడే అవకాశం చెప్పారు. ఈ దీనిపై మోదీ ఎందుకు నోరువిప్పడం లేదని నిలదీశారు. ప్రధాని రావాలనుకుంటే రావొచ్చని, రావాలంటూ ఆదేశించలేనని తేల్చిచెప్పారు. మణిపూర్ వ్యవహారంపై రూల్ 176 కింద చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అయినా ప్రతిపక్ష ఎంపీలు పట్టించుకోలేదు. సభనుంచి వాకౌట్ చేశారు.



ఖర్గే, శరద్ పవార్‌తో ధన్‌ఖడ్ భేటీ

ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ బుధవారం ఏఐసీసీ అధినేత మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్‌తో పార్లమెంట్‌లోని తన చాంబర్‌లో సమావేశమయ్యారు. మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో జరుగుతున్న విపక్షాల రగడపై చర్చించారు. సభా సజావుగా సాగేలా సహకారం అందించాలని కోరారు.

'మణిపూర్'పై ప్రకటన చేసేలా మోదీని ఆదేశించండి

31 మంది ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతలు బుధవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. మణిపూర్ హింసపై పార్లమెంట్‌లో ప్రకటన చేసేలా ప్రధాని మోదీని ఆదేశించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. హింసకు స్వస్తి పలికి, సోదరభావాన్ని పెంచుకోవాలని ప్రధానే స్వయంగా ప్రజలకు పిలుపునివ్వాలని డిమాండ్ చేశారు. హరియాణా ఘర్షణలను కూడా రాష్ట్రపతి దృష్టికి తీసుకొచ్చారు. మణిపూర్‌పై చర్చ విపక్షాలకు ఇష్టం లేదని, అందుకే సభ జరగకుండా రాద్ధాంతం చేస్తున్నాయని మంత్రి ప్రహ్లాద్ జోషీ ఆరోపించారు.

సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌కు మరో ఎదురుదెబ్బ

- నెలవారీ వేతనంలో భారీ కోత
- ఇప్పటికే అవినీతి ఆరోపణలపై అరెస్టయి బెయిల్ పొందిన చంద్రబాబు సన్నిహితుడు

సింగపూర్: చంద్రబాబు నాయుడు సన్నిహితుడు, భారతీయ మూలాలున్న సింగపూర్ రవాణా శాఖ మంత్రి ఎస్.ఈశ్వరన్‌కు వేతన చెల్లింపుల విషయంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనను సాధారణ విధుల నుంచి తప్పించారు. ఆయనకు ప్రతి నెలా ఇప్పటిదాకా ఇస్తున్న 41వేల డాలర్లకు బదులు ఇకపై కేవలం 6,300 డాలర్ల వేతనమే చెల్లించాలని సింగపూర్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని లీ సీన్ లూంగ్ బుధవారం పార్లమెంట్‌లో ఈ మేరకు వెల్లడించారు. అవినీతి ఆరోపణలపై గత నెలలో అరెస్టయిన ఈశ్వరన్ తర్వాత బెయిల్‌పై బయటికొచ్చి విచారణకు హాజరవుతున్నారు. సింగపూర్ ప్రజా సేవల విభాగం 2023 ఏడాది గణాంకాల ప్రకారం ఒక మంత్రికి జీతభత్యంగా నెలకు 41వేల డాలర్లు(సుమారు రూ.34 లక్షలు) చెల్లిస్తారు. అంటే సంవత్సరానికి 8,20,000 డాలర్లు(సుమారు రూ.6.8 కోట్లు) జీతంగా పొందుతారు. అవినీతి కేసులో ప్రధాన పాత్రధారిగా ఉండటం, అరెస్ట్ కావడంతో ఈయనను ప్రభుత్వం మంత్రి విధుల నుంచి పక్కనబెట్టింది. ఇప్పుడు భారీ కోత కారణంగా ఆయనకు నెలకు సుమారు రూ.5.2 లక్షల జీతం ఇస్తారు. రవాణా శాఖకు కోట్ల రూపాయల నష్టం చేకూర్చారనే ఆరోపణలపై అవినీతి వ్యవహారాల విచారణ సంస్థ(సీపీఐబీ) గత నెలలో ఈశ్వరన్‌ను అరెస్ట్ చేయగా ఆయన వెంటనే బెయిల్‌పై బయటికొచ్చారు. ఆ కేసు సమగ్ర వివరాలను ఇప్పుడే బహిర్గతం చేయలేనని పార్లమెంట్‌లో ప్రధాని పేర్కొనడం తెలిసిందే.



రాజస్తాన్‌లోని ఆల్వార్ జిల్లాకు చెందిన ఓ మహిళ సోమవారం రాత్రి అచ్చం గజముఖంతో కూడిన మగ శిశువుకు జన్మనిచ్చింది. 20 నిమిషాల కంటే ఎక్కువ బతకని ఆ పసికందును చూసేందుకు జనం బారులు తీరారు.

ఎన్నికల ఫలితాల తారుమారు కేసులో...

ట్రంప్‌పై అభియోగాల నమోదు



వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ. 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించిన కేసులో ఆయనపై నేరాభియోగాలు నమోదయ్యాయి. అమెరికాను మోసగించే కుట్ర, పౌర హక్కులకు వ్యతిరేకంగా కుట్ర, సాక్ష్యాల తారుమారు, అధికారిక విధులను అడ్డుకునే యత్నం వంటి నాలుగు ఆరోపణలపై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఫెడరల్ గ్రాండ్ జ్యూరీ మంగళవారం ప్రకటించింది. ''అధ్యక్ష ఎన్నికల్లో ఓడినా, ఎలాగోలా అధికారంలో కొనసాగేందుకు ట్రంప్ రెండు నెలలకు పైగా శాయశక్తులా ప్రయత్నించారు. తనే నెగ్గానని, ఎన్నికల ఫలితాలను మార్చేలా కుట్ర జరిగిందని అబద్ధాలు ప్రచారం చేశారు. ఇవన్నీ అబద్ధాలే. అది ఆయనకూ తెలుసు'' అంటూ అభియోగాలను నమోదు చేసిన న్యాయ శాఖ ప్రత్యేక కౌన్సెల్ జాక్ స్మిత్ పేర్కొన్నారు. 2020 ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ గెలుపును గుర్తించేందుకు ట్రంప్ నిరాకరించడం, తన మద్దతుదారులను ఉద్దేశించి రెచ్చగొట్టే ప్రసంగం చేయడం తెలిసిందే. బైడెన్ నెగ్గినట్టు ప్రకటించేందుకు కాంగ్రెస్ సభ్యులు సమావేశమైన అధికారిక కాపిటల్ బిల్డింగ్‌పై వారు దాడికి దిగారు.

ఈ ఏడాది మూడో అభియోగం

77 ఏళ్ల ట్రంప్‌పై 2023లో ఇప్పటికే ఇది ఏకంగా మూడో నేరాభియోగం! ఓ శృంగార తారకు డబ్బు చెల్లింపులు, అధికారిక పత్రాల తరలింపు కేసుల్లో ఆయనపై రెండు అభియోగాలు నమోదయ్యాయి.

మహిళల ఆర్థికాభివృద్ధితో పురోగతి

గాంధీనగర్: మహిళల ఆర్థిక పురోగతితో దేశాభివృద్ధి సాధ్య మని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. మహిళల నేతృత్వంలో అభివృద్ధి కార్య క్రమాలు చేపడితే మహిళా సాధికారత కూడా సాధ్యప డుతుందన్నారు. మహిళలు సంపన్నులైతే ప్రపంచం సుసంపన్నంగా మారుతుందన్నారు. జీ–20 సన్నాహక సదస్సుల్లో భాగంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మహిళా సాధికారత్‌పై మంత్రుల సదస్సునుద్దేశించి ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడారు. మహిళా పారిశ్రామికవేత్తలు మరింతగా రాణించడానికి ప్రభుత్వాలు చేయాల్సినదంతా చేయాలన్నారు. ''మహిళలు వాణిజ్య రంగంలోనూ విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవడమే మనందరి లక్ష్యం కావాలి. మార్కెట్, గ్లోబల్ వాల్యూ చైన్, రుణాలు వంటివి వారికి అందుబాటులోకి తీసుకురావడానికి ఉన్న అడ్డంకుల్ని అధిగమించాలి. అప్పుడే మహిళలు అందరికీ ఆదర్శంగా నిలుస్తారు'' అని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని మోదీ కొనియాడారు. ఒక ఆదివాసీ మహిళ అయి ఉండి కూడా ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రథమ మహిళగా ఎదిగారని, త్రివిధ బలగాలకు నేతృత్వం వహిస్తున్నారని చెప్పారు. స్థానిక ప్రభుత్వాల్లో 46% మంది మహిళలే ఉన్నారని గుర్తు చేశారు.

ట్రూడో దంపతుల విడాకులు



టొరంటో: దాదాపు 18 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలకబోతున్నట్లు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో దంపతులు బుధవారం ప్రకటించారు. సుదీర్ఘ చర్చల అనంతరం ఈ కఠిన నిర్ణయానికి వచ్చినట్టు ట్రూడో, ఆయన భార్య సోఫీ గ్రెగరీ ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేశారు. ఈ జంట ఇప్పటికే తమ విడాకుల సంబంధ చట్టపర అంగీకార పత్రంపై సంతకాలు చేసినట్టు ప్రధాని కార్యాలయం పేర్కొంది. వారు 2005 ఏడాదిలో వివాహం చేసుకున్నారు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అధికారంలో ఉంటూ విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించిన రెండో కెనడా ప్రధాని ట్రూడో. ఆయన తండ్రి, మాజీ ప్రధాని పియరీ ట్రూడో కూడా విడాకులు తీసుకున్నారు. దేశంలో అత్యంత ప్రభావశీల వ్యక్తిగా పేరొందిన తండ్రి నుంచి జస్టిన్ రాజకీయ వారసత్వం పుణికిపుచ్చుకున్నారు. 2015లో ప్రధానిగా పగ్గాలు చేపట్టారు.

సాక్షి
హైదరాబాద్
గురువారం ◆ 3 ◆ ఆగస్టు ◆ 2023



గ్రేటర్‌లో 674 మద్యం షాపులు

మద్యం షాపుల లైసెన్సుల గడువు నవంబర్ 30తో ముగియనుంది. డిసెంబర్ నుంచి కొత్త లైసెన్సుల విధానం అమల్లోకి రావాల్సి ఉంది. -8లో



'కొరియర్' పేర్లతో కాజేస్తున్నారు

పులి చర్మం, డ్రగ్స్ పార్శిల్ పేరుతో నగరంలోని పలువురు అమాయకుల నుంచి సైబర్ నేరగాళ్లు రూ.లక్షలు కాజేస్తున్నారు. -8లో

జీతాల బిల్లులు తక్షణమే పంపించాలి



ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాల బిల్లులు పీఏఓ ఆఫీసుకు తక్షణమే పంపించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. -8లో

న్యూస్‌రీల్

9 నుంచి నీతి కథల పోటీలు

బంజారాహిల్స్: తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'కథ చెబుతారా ఊ కొడతాం' నీతి కథల పోటీలు ఈ నెల 9వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి హిమాయత్‌నగర్ టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. 5- 10 సంవత్సరాలలోపు ఒక గ్రూప్‌గా, 10-15 సంవత్సరాలలోపు పిల్లలు సీనియర్స్ గ్రూప్‌గా పోటీ నిర్వహించడానికి నిర్ణయించారు. ఉపాధ్యాయులు తమ పిల్లలను తీసుకొచ్చి ఈ పోటీల్లో పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ పోటీకి సంబంధించి మరిన్ని వివరాల కోసం 90308 50336లో సంప్రదించాలని సూచించారు.

చారిత్రక కట్టడాలను కూల్చివేయొద్దు

- నిజాం మునిమనవడు హిమాయత్ అలీ మీర్జా



బంజారాహిల్స్: చారిత్రక నేపథ్యం ఉన్న ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని కూల్చాలనే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని లేకపోతే ఊరుకునే ప్రసక్తే లేదని నిజాం మునిమనవడు హిమాయత్ అలీ మీర్జా హెచ్చరించారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో మాషాల్లా మంజిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా జనరల్ ఆస్పత్రి భవనం హెరిటేజ్ స్ట్రక్చర్‌తో ఉందని దీన్ని ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. చారిత్రక కట్టడాలను కూల్చుకుంటూ పోవడం వల్ల నిజాం కట్టడాలు కనుమరుగయ్యే ప్రమాదముందన్నారు. మొజాంజాహీ మునిమనడిగా తాను నిజాం ఆస్తులను, హెరిటేజ్ నిర్మాణాలను రక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చారిత్రక కట్టడాలను కనుమరుగు చేయడ మే లక్ష్యంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు.

హైదరాబాద్‌కు 16 మంది కొత్త తహసీల్దార్లు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాకు సుమారు 16 మంది కొత్త తహసీల్దార్లు బదిలీపై వచ్చారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో వారు రిపోర్ట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా హైదరాబాద్ జిల్లా నుంచి సుమారు 15 మంది తహసీల్దార్లు బదిలీపై రంగారెడ్డి జిల్లా, సంగారెడ్డి జిల్లా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు వెళ్లగా, రంగారెడ్డి జిల్లా నుంచి ఆరుగురు, వికారాబాద్ నుంచి నలుగురు, యాదాద్రి నుంచి ఇద్దరు, నల్లగొండ నుంచి ఇద్దరు, సంగారెడ్డి, మహబుబ్‌నగర్‌ల నుంచి ఒక్కొక్కరి చొప్పున హైదరాబాద్‌కు కేటాయించడంతో కలెక్టరేట్‌కు రిపోర్టు చేశారు.

మరణం తర్వాతా జీవించడమే అవయవ దానం గొప్పతనం

- డీజీపీ అంజనీకుమార్



అవయవ దాతల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న డీజీపీ అంజనీకుమార్

వెంకటేశ్వరకాలనీ: అవయవదానంతో పలువురి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని కేర్ ఆస్పత్రిలో జరిగిన అవయవ దాతల కుటుంబ సభ్యుల సత్కారం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మరణం తర్వాత జీవించడమే అవయవదానంలో ఉన్న గొప్పతనమన్నారు. మనం చనిపోతున్నా చావు బతుకుల మధ్య జీవం కోసం పోరాడుతున్న మరికొందరిని బతికించే అవకాశం ఒక్క అవయవదానంతోనే సాధ్యమవుతుందన్నారు. ఓ ఆస్పత్రిలో రోగికి అమర్చేందుకు గుండెను తీసుకొని రాగా బంధువుల ముఖాల్లో చెప్పలేని ఆనందాన్ని చూసిన అనుభవాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. చావు తప్పనప్పుడు విలువైన అవయవాలు దానం చేసి ప్రాణదాతలుగా మారాలని ప్రజలను చైతన్యవంతులను చేయాలని కోరారు. తమ కుటుంబ సభ్యుల్లో ఒకరి అవయవాలు ఇంకొకరికి అందించి ప్రాణం పోసిన వారిని ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీవన్‌దాన్ ఇన్‌చార్జి డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ.. ఒక వ్యక్తి అవయవదానంతో 8 నుంచి 9 మంది ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి వైద్యులు టీఈస్ గోపాల్, మహ్మద్ నయీం తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్-నారపల్లి రోడ్డు దుస్థితి

అధికారులూ.. ప్రజాప్రతినిధులూ

గంతలు కట్టుకున్నారా? గుంతలు కానరాట్లేదా?

నరకానికి నకళ్లు.. నగర రహదారులు

- వానొస్తే చెరువులు, గెరువిస్తే గుంతలు
- ప్రమాదాల పాలవుతున్న వాహనదారులు
- ఈ కష్టాలు ఎన్నాళ్లు అంటూ ఆవేదన
- ప్రజల అవస్థలు పట్టించుకోని పాలకులు
- ఇవేనా విశ్వనగరానికి బాటలు?

సాక్షి, సిటీబ్యూరో: వైష్ణవి అనే డిగ్రీ విద్యార్థిని ద్విచక్రవాహనంపై కాలేజీకి వెళ్తుండగా బోయిన్‌పల్లిలో రోడ్డుపై గుంతలతో అదుపు తప్పి తండ్రీకూతుళ్లిద్దరూ కిందపడ్డారు. అదే సమయంలో వారి వాహనం పక్కనుంచి వెళ్తున్న వ్యాన్.. వైష్ణవిని ఢీకొనడంతో తీవ్రగాయాల పాలై ఆస్పత్రిలో చేరింది.

- బాచుపల్లి రోడ్డు ప్రమాదంలో మూడో తరగతి చదువుతున్న దీక్షిత మరణానికి రోడ్డుపై గుంతలు కూడా ఓ కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. బుధవారం జరిగిన తాజా ఘటనలు నగరంలో రహదారుల దుస్థితికి అద్దం పడుతున్నాయి. ప్రజలు ఇలా ప్రతిరోజూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గ్రేటర్ నగరంలో రహదారులు బాగుపడ్డాయని అధికారులు చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. వానొస్తే రోడ్లు చెరువులుగా మారే పరిస్థితి తప్పడంలేదు. వాన వెలిశాక అడుగడుగునా గుంతలతో వాహనాలు అదుపు తప్పుతుండటం, గుంతలో పడకుండా వాహనాన్ని సడన్‌గా పక్కకు తప్పించబోయి కింద పడి తీవ్ర గాయాలు అవుతుండటం, అడపాదడపా ప్రాణాలు పోవడం పరిపాటిగా మారింది.

నగరంలో ఎక్కడ చూసినా..

- గ్రేటర్‌లో 9వేల కిలోమీటర్లకు పైగా రోడ్లున్నాయి. వాటిలో దాదాపు 900 రోడ్ల నిర్మాణం, నిర్వహణను అయిదేళ్ల పాటు సీఆర్ఎంపీ కింద జీహెచ్ఎంసీ ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించింది. ఈ పథకం కింద చేసిన పనులకు కాంట్రాక్టు ఏజెన్సీలకు ఇప్పటి వరకు దాదాపు రూ. 1200 కోట్ల వరకు చెల్లింపులు జరిగాయి. ఒప్పందం మేరకు, రోడ్లకు గుంతలు పడ్డా, ఇరవై నాలుగ్గంటల్లో పూడ్చివేయాలి. కానీ అది జరగడం లేదు. ఇది ప్రధాన రహదారుల్లోని పరిస్థితి కాగా, సీఆర్ఎంపీయేతర రహదారులు, కాలనీలు, బస్తీల్లోని రోడ్ల పరిస్థితులు పరమ అధ్వానంగా ఉన్నాయి. వానొస్తే చాలు బురద గుంతలుగా మారుతుండటంతో ప్రయాణానికి ఆటంకాలుగా మారాయి. అక్కడా ఇక్కడా అని కాదు నగరంలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. ఎల్‌బీనగర్, వనస్థలిపురం, ఉప్పల్, సికింద్రాబాద్, చాంద్రాయణగుట్ట, మలక్‌పేట, రామ్‌నగర్, అంబర్‌పేట, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, కార్వాన్, బేగంబజార్.. ఎటు చూసినా ఇదే దుస్థితి. అధ్వానపు రోడ్లతో ప్రజలు నరకం అనుభవిస్తున్నారు.

అడుగడుగునా గుంతలు

ఇటీవల వర్షాలు కురిసిన పదిరోజుల్లో రోజుకు కనీసం 250 నీరునిలిచిన ఫిర్యాదులందాయి. అందని ఫిర్యాదులు ఇంకా రెట్టింపే ఉంటాయి. నీరు నిలిచిన పలు ప్రాంతాలు గుంతలు పడి,కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. జీహెచ్ఎంసీ రోడ్ల నిర్మాణం,నిర్వహణ పనుల కోసం ఏటా వందల కోట్లు ఖర్చు చేస్తున్నా, మూడు విభాగాల ద్వారా క్వాలిటీ పరీక్షలు జరుగుతున్నా పరిస్థితులు మారడం లేదు.

ఇష్టానుసారంగా తవ్వకాలు

ఇందుకు ప్రధాన కారణం అనుమతులున్నా లేకున్నా అడ్డగోలుగా రోడ్లను తవ్వడం. వివిధ అవసరాల కోసమంటూ రోడ్లను తవ్వుతున్నారు. పనులు ఆపడానికి వీలులేని అత్యవసరమైన తాగునీరు, డ్రైనేజీల పేరిట వర్షాకాలంలోనూ రోడ్లు తవ్వుతున్నారు. ఇక విద్యుత్, టెలికాం సంస్థలు సైతం రోడ్లను తవ్వుతూనే ఉన్నాయి. దొంగచాటుగా రాత్రివేళల్లో సైతం రోడ్లు తవ్వుతున్నారు.వర్షాలకు పడే గుంతలతోపాటు ఈ తవ్వకాల వల్ల మరింత ప్రమాదకర పరిస్థితులేర్పడుతున్నాయి. మరోవైపు జీహెచ్ఎంసీకి ఇతర ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయ లోపంతోనూ సమస్యలు తలెత్తుతున్నాయి.

తిప్పలు తప్పించండి: బీజేపీ కార్పొరేటర్ల వినతి

రోడ్లపై నీరునిలిచే ప్రాంతాల గుర్తింపు, తదితర అంశాల్లో జీహెచ్ఎంసీ విఫలమైందని, దాంతో వర్షాలు వెలిశాక సైతం ప్రజలకు తిప్పలు తప్పడం లేదని బీజేపీ కార్పొరేటర్ల బృందం కమిషనర్ రోనాల్డ్‌రాస్‌కు వినతి పత్రం సమర్పించింది. బీజేపీ ఫ్లోర్‌లీడర్ శంకర్‌యాదవ్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ప్రజల అవస్థల గురించి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వాటర్‌లాగింగ్స్, నాలాల డీసిల్టింగ్, రోడ్ల మరమ్మతులకు సంబంధించి తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. సీఆర్ఎంసీ రోడ్లకు, కాలనీల్లోని అప్రోచ్ రోడ్లతో కనెక్టివిటీ లేకపోవడంతో పరిస్థితులు పరమ దుర్భరంగా మారాయన్నారు. సీఆర్ఎంపీ పనుల్లో నిధుల చెల్లింపులపై విచారణ జరపాలని కోరారు.



నిధులు ఖర్చు చేస్తున్నా..

గత సంవత్సరం దాదాపు రూ.1273 కోట్ల అంచనా వ్యయంతో 4790 రోడ్ల పనుల్ని చేపట్టారు. వాటిలో 2500 పూర్తయ్యాయి. అందుకు రూ.700 కోట్లు ఖర్చయింది. ఈ సంవత్సరం సైతం సీఆర్ఎంపీ మార్గాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో దాదాపు రూ. రూ.600 కోట్ల అంచనా వ్యయంతో 2500 పనులు చేపట్టినప్పటికీ, సకాలంలో బిల్లులు చెల్లించడం లేదనే కారణంతో పనులు కుంటుతున్నాయి. వర్షాలొస్తే గుంతల పూడ్చివేతల పేరిట దాదాపు రూ.20 కోట్లు, ప్యాచ్‌వర్క్స్ పేరిట దాదాపు రూ. 150 కోట్లు ఖర్చు చేస్తున్నారు. గడచిన నాలుగైదేళ్లలో రోడ్ల నిర్మాణం, నిర్వహణల పేరిట దాదాపు రూ.2500 కోట్లు ఖర్చు చేశారు.

అమ్మకు బై చెప్పిన 5 నిమిషాల్లోనే..

బాలికను బలి తీసుకున్న స్కూల్ బస్సు

- కన్నతండ్రి కళ్లెదుటే చిన్నారి మృత్యువాత
- స్కూటీని ఢీకొనడంతో రోడ్డుపై ఎగిరిపడి..
- అక్కడికక్కడే చనిపోయిన 8 ఏళ్ల దీక్షిత



కూతురు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి పద్మ, తండ్రి కిశోర్



నిజాంపేట్: టిఫిన్ బాక్స్‌ను బ్యాగులో పెట్టుకుని.. తల్లికి బై బై చెప్పి.. ఇంటి నుంచి నాన్న బండిపై స్కూల్‌కు బయలుదేరిన ఆ చిన్నారి 5 నిమిషాల్లోనే అనంత లోకాలకు చేరుకుంది. ప్రమాదవశాత్తు స్కూల్ బస్సు చక్రాల కింద పడి 8 ఏళ్ల బాలిక దీక్షిత అక్కడికక్కడే మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తమ గారాలపట్టి ఇక లేదన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోయారు. కూతురు కోసం గుండెలవిసేలా రోదిస్తున్న తల్లిదండ్రులను చూసి రోడ్డుపై వెళ్లేవారు, వాహనదారులను కన్నీరు పెట్టారు. బాచుపల్లి ఎస్‌హెచ్ఓ సుమన్ కుమార్ కథనం ప్రకారం వివరాలు.. బాచుపల్లిలోని ప్రణీత్ అంటిల్యా సమీపంలోని ఇంద్రప్రస్థా అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కిశోర్, పద్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కూతురు దీక్షిత (8) భౌరంపేట్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతోంది. బుధవారం ఉదయం 7.40 గంటలకు రెడ్డి ల్యాబ్స్ సమీపంలో కిశోర్ తన స్కూటీ వెనక భాగంలో కూతురు దీక్షతను కూర్చోబెట్టుకుని భౌరంపేట్‌లోని స్కూల్‌లో దింపేందుకు వెళుతున్నాడు. ఇదే క్రమంలో బాచుపల్లి నుంచి ప్రగతినగర్ వైపు వెళుతున్న నిజాంపేట్ భాష్యం స్కూల్‌కు చెందిన బస్సు స్కూటీని ఢీకొట్టడంతో కిశోర్ ఎడమ, దీక్షిత కుడి వైపు రోడ్డుపై పడిపోయారు. వేగంగా వచ్చిన స్కూల్ బస్సు దీక్షితపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కిశోర్ కుడి భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 100కు కాల్ చేసి ప్రమాద సమాచారం ఇవ్వగానే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ కిశోర్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. దీక్షిత మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. బస్సు డ్రైవర్ రహీంను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంపై భిన్న వాదనలు..

ప్రమాదం ఎలా జరిగిందనే విషయంలో అనేక భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. పోలీసుల విచారణ ప్రకారం.. ముందు చిన్న గుంత ఉండటంతో స్కూటీ మెల్లగా వెళుతోంది. వెనకనే వచ్చిన స్కూల్ బస్సు స్కూటీని ఢీకొనడంతో దీక్షిత కుడి వైపు రోడ్డుపై పడింది. దీంతో బస్సు వెనక చక్రల కింద పడి బాలిక మృతి చెందిందని పేర్కొంటున్నారు. ప్రతిపక్ష పార్టీలు మాత్రం రోడ్డుపై ఉన్న గుంత మూలంగా స్కూటీ అదుపు తప్పి పాప కుడివైపు, తండ్రి కిశోర్ స్కూటీ ఎడమ వైపు పడ్డారని ఆరోపిస్తున్నారు. ఏదైమైనా ఈ ప్రమాదానికి రోడ్డుపై ఉన్న గుంతలు, అదే విధంగా డ్రైవర్ నిర్లక్ష్యం కూడా కారణమని తెలుస్తోంది.

స్కూటీ అదుపుతప్పి.. రోడ్డుపై పడిపోయి..

- యువతిపై నుంచి వెళ్లిన డీసీఎం
- బాధితురాలి పరిస్థితి విషమం

కంటోన్మెంట్: తండ్రితో కలిసి స్కూటీపై వెళ్తున్న కుమార్తె అదుపు తప్పి రోడ్డుపై పడి తీవ్రగాయాల పాలైన ఘటన బోయిన్‌పల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. ఆర్మీ విశ్రాంత ఉద్యోగి విజయ్ కుమార్ బుధవారం తన కుమార్తె వైష్ణవితో కలిసి స్కూటీపై కానాజీగూడ నుంచి బోయిన్‌పల్లికి బయలుదేరారు. మార్గమధ్యలో ప్రియదర్శిని హోటల్ వద్ద స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయారు. ఇంతలోనే ఆ మార్గంలో వేగంగా వస్తున్న డీసీఎం వాహనం వైష్ణవి మీదుగా వెళ్లిపోయింది. దీంతో తీవ్ర గాయాల పాలైన వైష్ణవిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

రూ. 3.75 కోట్లతో చెరువులపై నిఘా

- 179 చెరువుల వద్ద 1170 సీసీ కెమెరాలు
- జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం





సాక్షి, సిటీబ్యూరో: వర్షాల సీజన్‌లో చెరువుల్లో నీటి మట్టం పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగిన చర్యలు చేపట్టేందుకు, చెరువుల్లో చెత్తా చెదారాలు, నిర్మాణ కూల్చివేతల వ్యర్థాలు వేయకుండా నిరోధించేందుకు, చెరువు ప్రాంతాలు కబ్జా పాలు కాకుండా చూసేందుకు గ్రేటర్‌లోని చెరువుల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని భావించిన జీహెచ్ఎంసీ అందుకు సిద్ధమైంది. నగర వ్యాప్తంగా ఉన్న 185 చెరువులకుగాను 179 చెరువుల వద్ద 1170 సీసీ కెమెరాల ఏర్పాటుకు బుధవారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం ఆమోదం తెలిపింది.త్వరలో టెండర్లు పిలిచి ఏర్పాటు చేయనున్నారు. దీంతోపాటు మరో ఆరు అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశానికి మేయర్ విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. కమిషనర్ రోనాల్డ్‌రాస్, ఆయా విభాగాల ఉన్నతాధికారులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అగ్గితో బుగ్గి

దుస్తుల దుకాణాలు, రెస్టారెంట్‌లో చెలరేగిన మంటలు

- హబ్సిగూడ, మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో అగ్ని ప్రమాదాలు
- షార్ట్ సర్క్యూటే కారణమన్న ఫైర్ సిబ్బంది
- దాదాపు రూ.3 కోట్ల వరకు ఆస్తి నష్టం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి





మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

లాలాపేట/హబ్సిగూడ/మైలార్‌దేవ్‌పల్లి: నగరంలో బుధవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు చేసుకున్నాయి. హబ్సిగూడలోని దుస్తుల దుకాణం, రెస్టారెంట్‌లో, అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత దుస్తుల గోదాంలో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసి ప్రమాదాన్ని నివారించారు. పోలీసుల కథనం ప్రకారం.. హబ్సిగూడ ప్రధాన రహదారిలోని 4 అంతస్తుల భవనంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. రెండతస్తుల్లో అన్ లిమిటెడ్ దుస్తుల దుకాణం కాగా ఆపైన అంతస్తుల్లో టేస్ట్ ఆఫ్ ఇండియా రెస్టారెంట్ ఉన్నాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో భవనం పైనుంచి భారీగా మంటలు వ్యాపించి రెండు అంతస్తులు పూర్తిగా కాలిపోయాయి. పక్కనే పెట్రోల్ బంక్ ఉండటంతో మరింత ప్రమాదం జరగవచ్చని స్థానికులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ సిబ్బంది సహకారంతో మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. మౌలాలీ ఫైర్ స్టేషన్‌తో పాటు మల్కాజిగిరి, చర్లపల్లి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లోని ఫైర్ సిబ్బంది 60 మంది నాలుగు ఫైర్ ఇంజిన్లతో దాదాపు 5 గంటల పాటు శ్రమించి మంటలను అదుపుచేశారు. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు రూ.3 కోట్ల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.అగ్ని ప్రమాదం కారణంగా ఉప్పల్ నుంచి సికింద్రాబాద్ ప్రధాన రహదారి రెండు వైపులా వాహనాలు సుమారు 3 కి.మీ మేర నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ చేతన

పాత దుస్తుల గోదాంలో..

మైలార్‌దేవ్‌పల్లి అత్తాపూర్ పరిధిలోని పాత దుస్తులు విక్రయ గోదాంలో అగ్ని ప్రమాదం జరిగింది. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, రాజేంద్రనగర్ అగ్నిమాపక ఆఫీసర్ చంద్ర, కానిస్టేబుల్ కుమార్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... కొంత కాలంగా మమ్మద్ ఇస్మాయిల్, మహ్మద్ ఇబ్రహీం హసన్‌నగర్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకొని పెద్ద ఎత్తున పాత దుస్తులను సేకరించి గోదాముగా ఏర్పాటు చేసుకున్నారు. అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న ఇస్మాయిల్, ఇబ్రహీంలు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించారు. అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకోని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



మలక్‌పేట పీఎస్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మలక్‌పేట: హత్యాయత్నం కేసులో నిందితుడైన ఓ వ్యక్తి మలక్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం రాత్రి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు, బాధితుని భార్య వివరాల ప్రకారం.. సోలంకి విజయ్(26), అతని భార్య సోలంకి విజయభవాని, వారి కుమారుడు లక్కీ(6) సోదరుడు రాజుతో కలిసి మూసారంబాగ్ డివిజన్ తీగలగూడ పోచమ్మ టెంపుల్ వద్ద ఫుట్‌పాత్‌పై నివాసం ఉంటున్నారు. విజయ్ గంజాయి, మద్యానికి అలవాటు పడి దొంగతనాలు చేశాడు. మొత్తం 7 కేసులు ఉన్నాయి. 2018లో చైతన్యపురిలో అతనిపై డెకాయిట్ కేసు నమోదైంది. మూసారంబాగ్ మహ్మదీయ మసీద్ వెనుక భాగంలో నివాసం ఉంటున్న ఫరూఖ్, విజయ్ ఇద్దరు స్నేహితులు. ఇద్దరు కలిసి మద్యం తాగి తిరిగేవారు. కాగా 2022 నవంబర్‌లో అస్మాన్‌ఘడ్‌లో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకోగా.. విజయ్ కత్తితో ఫరూఖ్‌ను పొడిచాడు. ఫరూఖ్ ఫిర్యాదుతో విజయ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మూడు నెలలు జైలుశిక్ష అనుభవించిన విజయ్..ఇటీవల జైలు నుంచి బయటి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న ఫరూఖ్..విజయ్‌కు ఫోన్ చేసి చంపేస్తానని బెదిరించాడు. అంతేగాక తన అన్న రాజును కొట్టాడని, తనను చంపుతానని బెదిరిస్తున్నాడని విజయ్ మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పీటీ కేసు నమోదు చేశారు. దీంతో నా మీదే కేసు పెడతావా అంటూ ఫరూఖ్ గర్భవతి అయిన విజయ్ భార్య విజయభవానికి ఫోన్ చేసి చంపేస్తానని బెదిరించాడు. ఫరూఖ్ వల్ల ప్రాణ భయం ఉందని, పోలీసులు అతనిని అరెస్ట్ చేయడం లేదని విజయ్ తన భార్య, పిల్లలతో కలిసి మంగళవారం రాత్రి 11 గంటలకు పోలీస్‌స్టేషన్ ఎదుట తనతో పాటు తెచ్చుకున్న పెట్రోల్ ఒంటి మీద పోసుకుని నిప్పు అంటించుకున్నాడు. మంటలు తట్టుకోలేక పీఎస్ మెట్లపై పడిపోయాడు. పోలీసులు మంటలు ఆర్పేశారు. పోలీసులు, అతని భార్య విజయభవాని ఆటోలో విజయ్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. 60 శాతం శరీరం కాలిపోగా చికిత్స పొందుతున్నాడు. విజయ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. బాధిత కుటుంబానికి మద్దతుగా మలక్‌పేట బీజేపీ నాయకులు పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలియజేశారు. ఫరూఖ్‌ను అరెస్ట్ చేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.
డిస్కౌంట్
Ph: 040-23256000 Ext: 6344, 9912220352

గ్రేటర్‌లో 674 మద్యం షాపులు

- గడువుకు ముందే మద్యం షాపులకు నోటిఫికేషన్
- డిసెంబర్ ఒకటి నుంచి అమల్లోకి రానున్న కొత్త లైసెన్సులు

సాక్షి, సిటీబ్యూరో: మద్యం షాపుల లైసెన్సుల గడువు నవంబర్ 30తో ముగియనుంది. డిసెంబర్ నుంచి కొత్త లైసెన్సుల విధానం అమల్లోకి రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తాజా కొత్త మద్యం షాపుల కోసం నోటిఫికేషన్ విడుదలైంది. గతంలో మాదిరే ఈసారి కూడా గౌడ, ఎస్సీ, ఎస్టీ కులాలకు రిజర్వేషన్లు వర్తింపజేస్తుంది. ఆ మేరకు బుధవారమే లాటరీ ద్వారా ఆయా కులాలకు కేటాయించే షాపుల సంఖ్యను నిర్ధారించింది. వీటికి ఈ నెల నాలుగో(శుక్రవారం) తేదీన నోటిఫికేషన్ జారీ చేయనుంది. అదే రోజు నుంచి ఆయా వర్గాల నుంచి దరఖాస్తులను కూడా స్వీకరించనుంది. ఒక్కో దరఖాస్తుకు ఫీజు రూ.2 లక్షలుగా నిర్ణయించింది. దరఖాస్తుల తుది గడువు ఆగస్టు 18గా పేర్కొంది. ఈ నెల 21న డ్రా ద్వారా దరఖాస్తు దారులకు షాపులను కేటాయించి, 30న కొత్త సరుకును ఆయా షాపులకు తరలించనుంది.



గ్రేటర్ జిల్లాల్లో వైన్‌షాపులు ఇలా..

ఎక్సైజ్ జిల్లా	2019–21	2023–25
హైదరాబాద్	79	80
సికింద్రాబాద్	94	99
మల్కాజ్‌గిరి	82	88
మేడ్చల్	99	114
సరూర్‌నగర్	114	134
శంషాబాద్	81	100
వికారాబాద్	46	59
మొత్తం	595	674

రూ.130 కోట్లకుపైగా ఆదాయం సమకూరే అవకాశం

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం ఏడు(హైదరాబాద్, సికింద్రాబాద్, సరూర్‌నగర్, శంషాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్)ఎక్సైజ్ జిల్లాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 674 షాపులు ఉండగా, వీటిలో రిజర్వేషన్ ప్రకారం ఎక్సైజ్ శాఖ గౌడ కులస్తులకు 15 శాతం చొప్పున మొత్తం 74 షాపులు, ఎస్సీలకు 10 శాతం చొప్పున మొత్తం 49 షాపులు, ఎస్టీలకు ఐదు శాతం చొప్పున 8 షాపులు కేటాయించింది. మిగిలిన 543 షాపులను ఓపెన్ కేటగిరి కింద నమోదు చేసింది. 2019–21లో దరఖాస్తుల ద్వారానే రూ.130 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. ప్రస్తుతం కూడా అదే స్థాయిలో దరఖాస్తులు అందే అవకాశం లేకపోలేదు. అంతేకాదు లైసెన్సులు పొందిన వారు ఒక్కో షాపునకు అడ్వాన్స్‌గా ప్రభుత్వానికి రూ.20 లక్షల ఫీజు చెల్లించాల్సి వస్తుంది.

ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా అభ్యంతరాలు

ప్రభుత్వ నిర్ణయంపై మద్యం వ్యాపారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. లైసెన్స్ గడువు ముగియక ముందే మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా లైసెన్స్ తుది గడువుకు వారం పది రోజుల ముందు నోటిఫికేషన్ జారీ చేస్తుంటారు.ఈసారి అలా చేయకపోవడంతో లైసెన్సు కోసం వ్యాపారులు మూడు నెలల ముందే ప్రభుత్వానికి ఫీజుల రూపంలో రూ.లక్షలు చెల్లించాల్సి వస్తుంది. 2023 డిసెంబర్ తర్వాత కొత్తగా ఏర్పాటు కాబోయే ప్రభుత్వానికి దక్కాల్సిన ఆదాయాన్ని ముందే కొల్లగొట్టేందుకు యత్నిస్తుండటాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు.

జీతాల బిల్లులు పీఏఓకు తక్షణమే పంపించాలి

సాక్షి, సిటీబ్యూరో: ఎయిడెడ్ ఉపాధ్యాయుల జీతాల బిల్లులు పీఏఓ ఆఫీసుకు నెలనెలా తక్షణమే పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం ఫెడరేషన్ బృందం జిల్లా విద్యాశాఖ అధికారిణిని కలిసి వినతి పత్రం సమర్పించారు. జీతాల బిల్లులు సకాలంలో పంపించకపోవడం వలన నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఫిలింనగర్ పాఠశాల భవన నిర్మాణం పూర్తి అయ్యేంతవరకు షిఫ్ట్ పద్ధతిలో నిర్వహించాలని, టీఆర్టీ- 2017 ఉపాధ్యాయుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని కోరారు. డీఈఓను కలిసిన బృందంలో టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సింహాచలం, జిల్లా అధ్యక్షుడు రాజారావు, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శులు రఘునాథ్ బాబు, భాషా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జిల్లా విద్యా శాఖాధికారిణికి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

వదిన గొంతు కోసిన మరిది

పోలీసుల అదుపులో నిందితుడు

మియాపూర్: కుటుంబ కలహాల నేపథ్యంలో సొంత మరిది వదినను నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే కత్తితో గొంతు కోసి గాయపరిచిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దశరథ్, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం..కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లా, కంటనా గ్రామానికి చెందిన చంద్రకాంత్, మహానంద (35) దంపతులు నగరానికి వలస వచ్చి మియాపూర్‌లోని ఓల్డ్ హాఫీజ్‌పేట్‌లో నివాసముంటున్నారు. చంద్రకాంత్ కారు డ్రైవర్‌గా పనిచేస్తుండగా భార్య మహానంద మదీనాగూడలోని ఓ పాఠశాలలో ఆయాగా పనిచేస్తోంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పాఠశాల ముగించుకొని మహానంద తోటి ఆయాలతో కలిసి నడుచుకుంటూ ఇంటికి బయలుదేరింది. ఈ క్రమంలో మదీనాగూడలోని మైత్రి కమాన్ ముందు జాతీయ రహదారిపైకి రాగానే మహానంద చెల్లెలు రేష్మా భర్త హన్మంత్ కత్తితో వచ్చి రోడ్డుపై అందరు చూస్తుండగానే ఆమె గొంతుకోసి పారిపోయాడు. తీవ్ర గాయలైన మహానందను తోటి ఆయాలు, స్థానికులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. హన్మంత్‌ను స్థానికులు పట్టుకొని మియాపూర్ పోలీసులకు అప్పగించారు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ ఘటన జరిగిందని పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితురాలి భర్త చంద్రకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘కొరియర్’ పేర్లతో కాజేస్తున్నారు!



- ఫెడెక్స్, బ్లూడార్ట్ తదితర కొరియర్ సంస్థల పేర్లతో ఫోన్ కాల్స్
- డ్రగ్స్, పులిచర్మం తదితర సాకులతో ప్రజల నుంచి డబ్బు లూటీ
- నెల రోజుల వ్యవధిలో దాదాపు 15 కేసుల నమోదు, రూ.2 కోట్లు స్వాహా
- ఇటువంటి ఫేక్ కాల్స్ నమ్మొద్దంటున్న సైబర్ కాప్స్

హిమాయత్‌నగర్: ‘హాలో సార్, మీ పేరుపై ఇతర దేశాలకు పులిచర్మం రవాణా అవుతుంది. మీ వివరాలన్నీ సీబీఐకి అప్పగించాం. సార్, మీరు నిషేధితమైన డ్రగ్స్‌ని సరఫరా చేస్తున్నారు. మీరు ఇతర ప్రాంతానికి పంపే డ్రగ్ పార్శిల్ ఇప్పుడు మా వద్దనే ఉంది. దీనిని ఇప్పుడే నార్కోటిక్ బ్యూరోకు అప్పగిస్తున్నాం. వారు మిమ్మల్ని అతి త్వరలో అరెస్టు చేస్తారు’...ఇలా గత నెల రోజులుగా సైబర్ క్రైంకు వస్తున్న ఫిర్యాదుల వివరాలు ఇవీ. ఇలా ఫేక్ ఫోన్ కాల్స్ చేస్తూ అమాయకుల్ని బెదిరిస్తూ వారినుంచి సైబర్ నేరగాళ్లు లక్షల రూపాయలు కాజేస్తున్నారు.

దాదాపు 15 కేసులు..రూ.2 కోట్ల మేర లూటీ

ప్రముఖ కొరియర్ సంస్థలైన ‘ఫెడెక్స్, బ్లూడార్ట్, డీహెచ్‌ఎల్, సేఫ్‌ఎక్స్‌ప్రెస్,’ తదితర పేర్లతో సైబర్ నేరగాళ్లు నగర ప్రజలకు ఫోన్ కాల్స్ చేస్తున్నారు. కాల్స్ చేస్తూ పైవిధంగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. అప్పటికీ నమ్మకపోవడంతో బాధితుడి వాట్సప్ నెంబర్‌కు ఆధార్‌కార్డును పంపుతున్నారు. అంతే..అమ్మో..మా వివరాలు వారి వద్ద ఉన్నాయి, ఏదైనా జరగొచ్చనే ఆందోళనకు గురై వారు అడిగినంత పంపేస్తున్నారు. ఇలా నెలరోజుల వ్యవధితో దాదాపు 15 కేసులు నమోదు కాగా రూ.2 కోట్ల మేర డబ్బును బాధితులు నష్టపోయినట్లు సైబర్ క్రైం పోలీసులు అంచనా వేస్తున్నారు.

ఆధార్ వివరాలు ఇలా సేకరిస్తున్నారు

సంబంధిత బాధితుడి ఆధార్ కార్డు అనేది ఎలా నేరగాళ్లకు చేరిందనే అనుమానం ప్రతి ఒక్కరినీ పీడిస్తుంది. డార్క్‌నెట్ ద్వారా సైబర్ నేరగాళ్లు డేటా సంపాదిస్తున్నారు. ఎవరికైతే ఫోన్ చేస్తున్నారో వారి ఆధార్ కార్డును సేకరిస్తున్నారు. డార్క్ నెట్ వారికి క్రిప్టోలో డబ్బును పంపుతున్నారు. క్రిప్టో ద్వారా డబ్బు పొందిన డార్క్ నెట్ అరగంటలో కనుమరుగయ్యే మెయిల్ ద్వారా ఆధార్, ఇతర వివరాలను పంపుతున్నారు. ఇలా వివరాలు పంపేముందే తాము పంపిన మెయిల్ అరగంటలో డిలీట్ అవుతుందనే విషయాన్ని కూడా ముందే చెప్పేస్తున్నారు. ఈ రకంగా వ్యక్తిగత డేటాను చోరీ చేస్తూ బాధితులకు వల వేస్తున్నారు.

అస్సలు నమ్మొద్దు.. మోసపోవద్దు



ఎవరో గుర్తు తెలియని వారు కాల్స్ చేసి ఏవేవో రవాణా చేస్తున్నారంటే ఎందుకు నమ్ముతున్నారు? మీరు నిజంగా రవాణా చేస్తే పోలీసులు ఎవరూ కాల్ చేసి మీరు చేస్తున్నారంట కదా అని అడగరు. కాబట్టి, ఎవరు నిజమైన కాల్ చేసే వారు..ఎవరు ఫేక్ కాల్స్ చేసే వారు అనేది ప్రజలు గుర్తించాలి. సైబర్ నేరాలు రోజుకో రకంగా కొత్త కొత్తవి వస్తున్నాయి. ఆ మోసాల్లో పడి కష్టపడి సంపాదించుకున్న సొమ్మును కోల్పోవద్దు.

– స్నేహా మెహ్రా, సైబర్ క్రైం డీసీపీ

ఇక ఇంటి వద్దకే హ్యుందయ్ సర్వీస్



హ్యుందయ్ మొబైల్ సర్వీస్ వెహికల్‌ను ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు

లక్డీకాపూల్: నగరంలోని కారు వినియోగదారులకు మరింత ప్రయోజనం చేకూరేలా కున్ యునైటెడ్ హ్యుందయ్ కొత్తగా మొబైల్ సర్వీస్ వెహికల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. బుధవారం వాహనాన్ని ప్రారంభించారు. ఇంటి వద్దకే వచ్చి మీ కారు రిపేరు, వెహికిల్ క్లీనింగ్ చేసే వెసులుబాటు ఉందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కంపెనీ ఆర్‌పీఎస్ హెచ్ స్వప్నిల్ చౌదరి, టీపీఎస్ఎం శివానంద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఐఎల్ టీపీఎస్ఎం జునైద్, కున్ సీఈఓ ఆర్.అశోక్, వీపీ శ్రీనివాస్, డీజీఎం బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.


వైద్య దంపతులకు గోల్డ్ మెడల్స్




సౌమ్యరెడ్డి, యశ్వంత్‌రెడ్డి

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌రెడ్డి కుమార్తె సౌమ్యరెడ్డి, అల్లుడు యశ్వంత్ రెడ్డి లు వైద్యశాస్త్రంలో తమ ప్రావీణ్యతను చాటారు. మణిపాల్ కస్తూర్బా మెడికల్ కళాశాలలో డాక్టర్ సౌమ్యరెడ్డి ఎం.డి పీడియాట్రిక్ విభాగంలో బంగారు పతకం సాధించగా, ఉస్మానియా మెడికల్ కళాశాల ఆర్థోపెడిక్ విభాగంలో యశ్వంత్ రెడ్డి ఎండీ ఉస్మానియా మెడికల్ ఫలితాలలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా సౌమ్య తండ్రి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తమ కూతురు చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలనే తపన ఉండేదని, తమ కుటుంబంలో ఎక్కువగా వైద్య రంగంలో రాణించిన వారే ఉన్నారన్నారు. తన కూతురు బంగారు పతకం సాధించినందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు.

అనారోగ్యంతో ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యుడు మృతి



రాజేందర్ (ఫైల్)

అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ సీనియర్ సభ్యుడు రాజేందర్ కొరడే అనారోగ్యంతో మృతిచెందారు. గత 30 సంవత్సరాలకు పైగా ఎగ్జిబిషన్ సొసైటీలోని పలు విభాగాల్లో సేవలందించారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఉన్న రాజేందర్ కొరడే బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతిపట్ల ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు అశ్విని మార్గం, సొసైటీ సీనియర్ ప్రతినిధులు వనం వీరేందర్, వినయ్‌కుమార్ ముదిరాజ్, హరినాథ్‌రెడ్డి, ప్రభాశంకర్ మిశ్రా, ఆదిత్య మార్గం, సుఖేష్ రెడ్డితో పాటు పలువురు సభ్యులు, పలువురు నాయకులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

పార్కుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



పార్కు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కమిషనర్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని కాలనీలు, వెంచర్లలో ప్రజా ప్రయోజనార్థం వదిలిన ఖాళీ స్థలాలు, పార్కుల సంరక్షణకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం కమ్మగూడ 22వ వార్డులో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్యతో కలిసి నవభారత్ కాలనీలో అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఇదే కాలనీలో రూ. 18లక్షల వ్యయంతో చేపట్టనున్న పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీనివాస్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పది రోజులు గుట్టల్లోనే!

- ఎస్కేప్ తర్వాత ఒంటరిగా గడిపిన ఉగ్రవాది సల్మాన్
- స్నేహితుడితో పాటు బావ వద్ద లభించిన ఆశ్రయం
- బంధువు సహకారంతోనే రాజేంద్రనగర్‌లో ఇల్లు అద్దెకు
- సోదరుల కదలికలపై నిఘా ఉంచడంతో చిక్కిన వైనం

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు మంగళవారం నగరంలో అరెస్టు చేసిన హిజ్బ్ ఉత్ తెహ్రీర్ (హెచ్‌యూటీ) ఉగ్రవాది మహ్మద్ సల్మాన్‌ను బుధవారం భోపాల్ తరలించారు. ఇతడిని లోతుగా విచారించిన అధికారులు అనేక కీలకాంశాలు గుర్తించారు. ఈ టెర్రర్ మాడ్యూల్‌కు సూత్రధారిగా ఉన్న ఓ కళాశాలలో హెచ్ఓడీగా పని చేసిన ఫార్మాస్యూటికల్ బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ మహ్మద్ సలీం ‘నిఖా’ పేరుతో వాట్సాప్ గ్రూపు నిర్వహించాడు. దీని ద్వారా మత మార్పిడి చేసుకున్న యువతులకు వివాహాలు చేశాడు. ఈ గ్రూపులో సల్మాన్ కూడా సభ్యుడిగా ఉన్నాడు. కొన్నాళ్ల క్రితం ఈ గ్రూపులో ఉంచిన ఓ యువతి ఫొటో నచ్చడంతో ఆమెను వివాహం చేసుకోవాలని సల్మాన్ భావించాడు. ఆ ఫొటో కింద ఉన్న నెంబర్‌కు కాల్ చేయగా... సలీం ఎత్తాడు. అలా వీరి మధ్య ఏర్పడిన పరిచయంతో సల్మాన్ కూడా సలీంతో కలిసి హెచ్‌యూటీలో పని చేయడానికి అంగీకరించాడు.

గతంలో పీఎఫ్ఐలోనూ పని చేశాడు...

జవహర్‌నగర్‌లోని శివాజీనగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్ దినసరి కూలీ. ఇతగాడు గతంలో పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాలో (పీఎఫ్ఐ) పని చేశాడు. 2021లో ఏపీలోని నంద్యాలలో జరిగిన ఈ సంస్థ ప్రాథమిక శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఆ సంస్థ నుంచి బయటకు వచ్చాకే సలీంతో కలిసి హెచ్‌యూటీలో చేరాడు. ఈ ఏడాది మేలో పోలీసుల నుంచి తృటిలో తప్పించుకున్న సల్మాన్ పది రోజుల పాటు కీసర చుట్టుపక్కల ఉన్న గుట్టల్లోనే గడిపాడు. ప్రతి రోజూ చీకటి పడ్డాక ఆ గుట్టల్లోంచి బయటకు వచ్చి ఆహారం పార్శిల్ చేయించుకుని తీసుకుని వెళ్లేవాడు. ఆపై బాలాజీనగర్‌కు చెందిన స్నేహితుడిని, శామీర్‌పేటకు చెందిన తన బావనీ ఆశ్రయం కోరాడు. అప్పటికే ఇతడి పేరు మీడియాలో రావడంతో భయపడిన వాళ్లిద్దరూ నిరాకరించారు. చివరకు సమీప బంధువు సహకారంతోనే రాజేంద్రనగర్ ప్రాంతంలో చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నాడు.

సోదరులు కలవడానికి వస్తుండటంతో...

దాదాపు మే ఆఖరి వారం నుంచి ఈ ఇంట్లోనే ఉంటున్న సల్మాన్ కనీసం ఒక్కసారి కూడా బయటకు రాలేదు. సమీప బంధువుతో పాటు సోదరులే ఇతడికి కావాల్సిన నిత్యావసరాలు తదితరాలు తీసుకువచ్చి అందించే వాళ్లు. అప్పటి నుంచి సల్మాన్ కోసం ముమ్మరంగా గాలిస్తున్న ఎన్ఐఏ అధికారులు అతడి సోదరులు, బంధువు కదలికల పైనా నిఘా ఉంచారు. వాళ్లు తరచు రాజేంద్రనగర్ రావడం, ఓ ఇంట్లోకి వెళ్లి వస్తుండటాన్ని గమనించారు. అక్కడే సల్మాన్ ఉండి ఉంటాడని అనుమానించి మంగళవారం ఉదయం దాడి చేసి పట్టుకున్నారు. ఇతడికి గురువారం భోపాల్‌లోని కోర్టులో హాజరుపరుస్తామని, ఆపై న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారిస్తామని ఎన్ఐఏ అధికారులు చెప్తున్నారు. ‘సలీం బ్రెయిన్ వాష్ చేయడంతోనే హెచ్‌యూటీలో చేరారని, తన ద్వారానే హమీద్ ఈ మాడ్యుల్‌లోకి వచ్చాడని ప్రాథమిక విచారణలో సల్మాన్ చెప్తున్నాడు. పోలీసు కస్టడీ ముగిసిన తర్వాతే దీనిపై పూర్తి స్పష్టత వస్తుంది’ అని ఓ అధికారి ‘సాక్షి’కి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ 2,50,000/-కే యాదాద్రి-జనగాం దగ్గర న్యూ వెంచర్‌లో 125 గ॥ ప్లాటు అమ్మబడును. క్లియర్ టైటిల్ స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్ : 8309376230 [H-788515]

PLOT FOR SALE

■ L.B.నగర్‌కి 20km దూరంలో రామోజీ ఫిల్మ్‌సిటీ దగ్గర దేశ్‌ముఖ్ నందు HMDA వెంచర్‌లో వెంటనే ఇల్లు కట్టుకోవడానికి అనువైన ప్లాట్స్ కలవు. డైరెక్ట్ ఓనర్ ప్లాట్స్. సంప్ర: 9346 36 34 36 [G-3096]

■ బెంగుళూరు హైవే షాద్‌నగర్ దగ్గర HMDA ప్లాట్స్ & రాజాపూర్ దగ్గర ఫ్రూట్స్ ఫామ్ ల్యాండ్, రిసార్ట్ కలిగిన వెంచర్‌లో 2 మరియు 5గుంటల ప్లాట్స్ కలవు. సంప్ర॥ 9666695886 [G-3094]

■ 9Lakhs Farm Plot with mango Plants, 2km from NH44, Rangareddy guda, Shadnagar, Beside FilmStudio. Resi / Developments, Gated Community. Ph : 9177385251 [HA-11722]

VILLAS FOR SALE

■ New-age design premium villas for sale in Raviryala for just Rs. 1.80 Crores. Contact: + 91 7353585358 Sark Projects [HA-94447]

Services

■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788602]

ASTROLOGY

■ శ్రీదత్తసాయి జ్యోతిష్యపీఠం, ఇండియన్ ఫేమస్ ఆస్ట్రాలజర్ మీ రెండు హస్తరేఖలు ముఖలక్షణం, జన్మ తేది, ఫోటో చూసి, మీజీవితసంపూర్ణ భవిష్యత్తు వెంటనే చెప్పబడును, ప్రేమ వివాహం, ఉద్యోగం, వ్యాపార లాభ నష్టాలు, హబ్సిగూడ St.No.-8 G శాస్త్రి ఫోన్: 8977279272 [H-788514]

■ ఓం శ్రీ చక్ర సిద్ధి వినాయక జ్యోతిష్యాలయం: జ్యోతిష్య రత్నం పండిత్ శ్రీ M.R.శాస్త్రి. జన్మ పత్రిక, హస్త రేఖలు, ఫోటో చూసి మీ జీవిత సంపూర్ణ భవిష్యత్తు తెలుపగలరు. స్త్రీ/పు॥లు ప్రేమ, వివాహం, విద్య, ఉద్యోగం, భార్య, భర్తల గొడవలు, సంతానం లేనివారు, ఆర్థిక ఇబ్బంది, గృహవాస్తు, శత్రు బాధలు ఎటువంటి సమస్యలకైనా బాలాపూర్ X రోడ్స్. సంప్ర: 7680818850 [HA-1341]

BUSINESS SERVICE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర॥ © 99127 66888 [B-1193212]

Urgently Required
Delivery Boys/ Bikers in Hyderabad
Full / Part Time
Salary : Upto 25,000/- to 35,000/-
040-45206109

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788740]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మరియు ఏ ఇతర ఫైనాన్స్ లో ఉన్నా మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ఫోన్ : 8886456484. [H-189273]

BUSINESS OFFER

■ Running Supermarket Sale: (West Venkatapuram) Alwal & 2 Others Places Sale with fully furnished, counters, systems, billings, Ac's Fridges. Ph : 9063106789 [H-189271]

■ RUTHUPARA PRAWNS. 50 Franchises in Telangana -2.5L. 50Kg's vacuum packed prawns/ day. Rs.600/kg pack (peeled, cleaned, ready-to-cook). Rs.60 Margin/ pack. Contact: 8328099433 [WB-19219]

HEALTH CARE

AYURVEDAM

■ లైంగిక సమస్యలతో బాధపడుతున్నారా? అంగస్తంభన లేకపోవడం, ఎక్కువ సేపు చేయలేకపోవడం, టైమింగ్, లావుగా, దృఢంగా, బలంగా ఉండుటకు మూలికా ఔషధం, వయసు పైబడినవారు వాడవచ్చు Ph: 8790531446 [HA-985]

FOR SALE

■ Forbes Cafe & Restaurent Chaitanya puri Metro Pillar 1564 for Sale. Valid Licence, Swiggy, Zomato, Magic pin facility. Contact : 8499994201, 8019250096 [HA-1231]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Ponugubaty Rama Murty S/o. Late Ponugupali Somaiah R/o.: H.No.11-20-45/403, Abhyudaya Apartments, HUDA Complex, Saroornagar, R.R Dist T.S 500035. Henceforth I shall be know as RAMA MURTHY PONUGUPATI [HA-1046]

■ SANDEESH RAJU KODALI S/o. Lazarus Kodali, H.No. 1-18-79/3, 2nd Floor, M.E.S. Colony, Venkatapuram Alwal, Dist: Medchal-Malkajgiri, T.S.-500015. I submit that my Son's name is mentioned in the Passport as JARON JOEL and in Adhar Card & Birth Certificate as JARON JOEL KODALI, I am Changing my Son's name in the Passport as JARON JOEL KODALI. [H-189511]

■ I, SADALA DIVYA W/o. SAMA VENU GOPAL REDDY, H.No: 4-13-12/17, Huda Sai Nagar Vanasthalipuram, Hyd Changed my name as SAMA DIVYA REDDY. [H-189375]

■ I, GUNAKALA BABU S/o. GUNAKALA LUKAIAH R/o. Flat No.316, Santhi vihar Apartments, CZECH Colony, Street No.2, Sanathnagar, Hyd. Changed my name as GUNAKALA LAZAR BABU. [H-788556]

■ I, POSANPALLY HARINI R/o. P.No.28, Sri Sai Enclave, Old Bowenpally, Secunderabad After my marriage Changed my name as SITHAGARI HARINI REDDY W/o. SITHAGARI ARJUN REDDY [HA-389]

■ I, SRIKANTH G R/o. H.No.5-5-8/4, SBH-401, Sangeetha nagar, Kukatpally, Hyd, T.S. have Changed my name as SRIKANTH GANTA S/o. GANTA CHALAPATHI. Due to all Future purposes. [HA-29908]

OLD AGE HOME

■ త్రివేణి హోంకేర్ వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకోవడానికి వంట, ఇంటి పనికి వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్ : 9160900023, 9160900024 [H-189312]

Wanted

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్ 9640258899, 9640468899 [H-189314]

■ సికింద్రాబాద్ గవర్నమెంట్ ఆఫీసులో అనుభవం మరియు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన డ్రైవర్స్ కావలెను. 8 గంటలు జీతం: 24000/– Ph: 9701238229 [H-781254]

■ నాగోల్ బండ్లగూడ దగ్గర MMK అసోసియేట్ నందు పనిచేయుటకు ఇంటర్ / డిగ్రీ కంప్లీట్ చేసిన యువతీ, యువకులు కావలెను. సంప్ర॥ సెల్. 90525 26697, 98857 08262 [Y-784268]

■ ప్రముఖ హోంకేర్ సర్వీసెస్ హైదరాబాద్ లో వృద్ధులకు,పేషెంట్లకు సేవచేయుటకు, బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీ/పు కా॥. జీ: 16,000-25000/-రూం+భో॥ఫ్రీ. ఫోన్: 9390343765 [H-189461]

■ టిఫిన్ సెంటర్‌లో స్టాల్ బాయ్స్ క్యాషియర్, హా॥కీ॥ స్టాఫ్, సూ॥వైజర్ కావలెను. ఇక్కడే వుండి చేసుకునే వారికి జీతం + భోజన వసతి కలదు. ఫోన్ : 9652134626, 9666934949 [H-781252]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము, హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు డ్రైవర్స్ కావలెను. ఫోన్ : 9391036931, 9246585901 [HA-11711]

■ నూతనంగా ప్రారంభించిన South India కంపెనీలో వర్క్ చేయుటకు యువతీ, యువకులు కావలెను. Q: ఇంటర్/ఆపైన, పార్ట్‌టైం - 9K, ఫుల్‌టైం–18K. © 93915 56054, 91218 24034, 90591 84169. [B-781955]

■ శ్రీ సాయి హోం కేర్ 24/7 మా వద్ద వుండి మంచంమీద ఉన్న వృద్ధులకు సేవ చేయటానికి, పిల్లలను చూడటానికి పని వారు కావలెను. ఫోన్ : 9533909627, 9494071023 [H-780941]

■ జాబ్ గ్యారెంటీ మా కంపెనీ కొరకు మహిళలు వెంటనే కావలెను. ఫ్రీ రూమ్+ భోజనం +జీతం: 15–30వేల వరకు, (ఏజెంట్స్‌కి 5000 కమీషన్) ఫోన్ : 8886733008 [H-788931]

■ Wanted Security Guard (M/F) and Security Supervisor Field officer for Ameenpur (BHEL). Ph: 9100051844, 9100051847 / 48 [H-788610]

■ Work From Home Opportunity only for Retired Employees Male/Female Free Training & support Ph: 7013794440 [HA-94452]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-1249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శాలివాహననగర్ 11కేవీ ఫీడర్ ఎల్లారెడ్డిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు సారథి స్టూడియో ఏరియా, ఇమాంగూడ, అంబేద్కర్ నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీసు ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

- జేపీ నగర్ 11కేవీ ఫీడర్ ఎల్లారెడ్డిగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని జేపీ నగర్ ఏరియా, అలీనగర్, రాజా హాస్పిటల్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు.
- హైలాంకాలనీ 11కేవీ ఫీడర్ యూసుఫ్‌గూడ సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు హైలాం కాలనీ, గాయత్రీ హిల్స్, మసీదు ఏరియా, స్రవంతినగర్ ప్రాతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏడీఈ పేర్కొన్నారు.
- కమాండెంట్ 11కేవీ ఫీడర్ శ్రీకృష్ణానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పోలీసులైన్స్, ట్రాఫిక్ పీఎస్ ఏరియా, ఇక్రిశాట్ కాలనీల్లో సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని వివరించారు.
- బేగంపేట ప్లేగ్రౌండ్, ప్రేమ్‌నగర్, శంకర్‌లాల్‌నగర్ 11కేవీ ఫీడర్లు బేగంపేట, జనప్రియ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు శేషమహల్, ప్లేగ్రౌండ్, దివ్యశక్తి లైన్, ఎర్రగడ్డ, ప్రేమ్‌నగర్, ఛత్రపతి శివాజీనగర్, బ్రహ్మశంకర్‌నగర్, బి.శంకర్‌లాల్‌నగర్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, వెంకటేశ్వర కాలనీ, నేతాజీనగర్, సౌత్ శంకర్‌లాల్‌నగర్, నాబార్డ్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలివివేస్తున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు.
- సోమాజిగూడ, చికోటి గార్డెన్, పి.ఆర్.నగర్ 11కేవీ ఫీడర్లు గ్రీన్‌లాండ్స్, ఎయిర్‌పోర్ట్, జనప్రియ సబ్‌స్టేషన్ల పరిధిలోని మా టీవీ బిల్డింగ్, మా టీవీ లైన్, హిందూ ప్రెస్, పుల్లారెడ్డి, స్నేహలత బిల్డింగ్, ప్రకాశ్‌నగర్, రాహుల్ బజాజ్ వెనుకవైపు, చికోటి గార్డెన్స్, ఎర్రగడ్డ, ప్రేమ్‌నగర్, ఛత్రపతి శివాజీనగర్, బ్రహ్మశంకర్‌లాల్ నగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ వివరించారు.

జూబ్లీహిల్స్ డీఐగా చంద్రశేఖర్



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ 2012 బ్యాచ్‌కు చెందిన కె.చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆయన వనస్థలిపురం ట్రాఫిక్ ఎస్ఐగా పని చేశారు. అదే సమయంలో పదోన్నతి రావడంతో డీఐగా జూబ్లీహిల్స్‌కు బదిలీ అయ్యారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న మాజీ కార్పొరేటర్ షరీఫ్

శ్రీనగర్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని మాజీ కార్పొరేటర్ షరీఫ్ అన్నారు. బుధవారం ఎర్రగడ్డ డివిజన్ ఒవైసీ గ్రౌండ్స్‌లో చేపట్టిన ఓపెన్ నాలా స్లాబ్ పనులను పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

బంజారాహిల్స్: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా నిర్వహించిన శ్రీ వారి కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ప్రతి నెలా నిర్వహించే ఈ కల్యాణ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి 108 స్వర్ణ పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది.



స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తేనే...

మెరుగైన ఫలితాలు



వివిధ విభాగాల అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే

- రోజూ తనిఖీలు చేస్తా
- ట్రీ ప్లాంటేషన్ పెంచాలి
- జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీలో అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే సూచించారు. బుధవారం ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో మెహిదీపట్నం సర్కిల్-12, కార్వాన్ సర్కిల్-13, గోషామహల్ సర్కిల్-14, ఖైరతాబాద్ సర్కిల్-17, జూబ్లీహిల్స్ సర్కిల్-18 డీసీలు, ఏఎంహెచ్‌వోలు, ఇంజినీర్లు, ఎంటమాలజీ, వెటర్నరీ, పార్కుల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని విభాగాలు సమన్వయంతో పని చేసినప్పుడే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చునని అన్నారు. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు రాంకీ వెహికిల్స్ రావాల్సిందేనన్నారు. ఇందుకోసం తాను రోజూ తనిఖీలు చేస్తానని స్పష్టం చేశారు. గార్బేజ్ వర్నబుల్ పాయింట్(జీవీపీ)ను తగ్గించాలని ఎవరైతే నిత్యం రోడ్లపక్కన చెత్త వేస్తున్నారో వారిని గుర్తించి ఆ ఇళ్లకు స్వచ్ఛ ఆటోలు, పారిశుద్ధ్య కార్మికులు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఏఎంహెచ్‌వోలను ఆదేశించారు.

- ఇంటింటికీ వెళ్లి చెత్త తీసుకెళ్లేవారు నిత్యం వెళ్తున్నారో లేదో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు.
- డెంగీ కేసులు నమోదయ్యే అవకాశాలు ఉండటంతో పారిశుద్ధ్యంపై మరింత దృష్టి సారించాలన్నారు. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు.
- ట్రీ ప్లాంటేషన్ మరింత పెరగాలని హరితహారం కార్యక్రమంలో భాగంగా థీమ్ పార్కులను అభివృద్ధి చేయాలన్నారు.
- వీధి దీపాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంబంధిత సిబ్బంది హాజరుకావాలని ఆ సమస్యను అక్కడికక్కడే పరిష్కరించే దిశలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వీధి దీపాల సమస్య ఎక్కువగా ఉన్నట్లుగా తెలుస్తున్నదని వీధి దీపాల మరమ్మతులపై దృష్టి పెట్టాలన్నారు.
- ఇటీవలి భారీ వర్షాలకు చాలా చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయని పలుచోట్ల గుంతలు పడి వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆ గుంతలను వెంటనే పూడ్చడమే కాకుండా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. వాహనం సజావుగా ముందుకు సాగే విధంగా గుంతలు పూడ్చి మరమ్మతులుచేయాలని సూచించారు.
- సమావేశంలో సర్కిల్-12 డీసీ ఆంజనేయులు, ఏఎంహెచ్‌వో డాక్టర్ విజయ్ కుమార్, సర్కిల్-13 డీసీ యూసుఫ్, ఏఎంహెచ్‌వో, సర్కిల్-14 డీసీ బాలయ్య, ఏఎంహెచ్‌వో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, సర్కిల్-17 డీసీ జగన్, ఏఎంహెచ్‌వో డాక్టర్ భార్గవ్ నారాయణ, సర్కిల్-18 డీసీ ప్రశాంతి, ఏఎంహెచ్‌వో రజినీకాంత్, సీనియర్ ఎంటమాలజిస్ట్ రజిని, యూబీడీ డీడీ శ్రీనివాస్, వెటర్నరీ డీడీ చక్రపాణి రెడ్డి, ఎస్ఈ రత్నాకర్, సిటీ ప్లానర్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

> ప్రతి విభాగంలోనూ అధికారులు, సిబ్బంది ప్రజల సమస్యలపై, అవసరాలపై దృష్టిసారించాలని ఆ మేరకు ప్రతి వారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ వారం తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి పనులపై వచ్చే వారం ఏ మేరకు పురోగతి ఉందో సమీక్ష నిర్వహిస్తామని జోనల్ కమిషనర్ పేర్కొన్నారు.

మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: మహిళలు తమ కాళ్ల మీద తాము నిలబడటానికి ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని వాటిని సక్రమంగా చెల్లిస్తూ మహిళా గ్రూపులను మరింత బలోపేతం చేసుకోవాలని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని 22 మహిళా సమాఖ్యల గ్రూపులతో ఆమె బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గౌరీ శంకర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మహిళలకు అందుతున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. రుణాలు తీసుకున్న ప్రతి ఒక్కరు సక్రమంగా చెల్లిస్తే మళ్లీ రుణాలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. మహిళల సంక్షేమం, అభ్యున్నతి, అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో సర్కిల్-18 డీపీవో బాల చంద్ర సుజన్, సీవో ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అధిక శ్రావణ యాగాలతో రెట్టింపు పుణ్యఫలం



అనుగ్రహ భాషణం చేస్తున్న పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీస్వామి

వెంకటేశ్వరకాలనీ: లోక కల్యాణార్థం, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, అధిక శ్రావణ మాసంలో చేసే యాగాల ద్వారా రెట్టింపు పుణ్యఫలం లభిస్తుందని శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీ పంచాయతన పూర్వక శతచండీ సహిత అతిరుద్రయాగం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. శ్రీ పరమహంస పరివ్రాజాకాచార్యులు శ్రీ పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ విద్యాశంకర భారతీస్వామి చేతుల మీదుగా ఈ అతిరుద్ర యాగం ప్రారంభమైంది. ఉదయం విఘ్నేశ్వర పూజ, యాగసంకల్పం, ప్రధాన వేదిక మంటపారాధన, అగ్నిమథనం, దీక్షాధరణ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో యాగంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో ఎన్.లావణ్య, ప్రధాన అర్చకులు వెల్లికంటి మురళీధరశర్మ, చింతలపల్లి శ్రీనివాసశర్మ, ఈ అతిరుద్రయాగం కార్యక్రమాలను నిర్వహించారు.

గుండె వైఫల్యం బాధితురాలికి అరుదైన వైద్యం



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైద్య బృందం

బంజారాహిల్స్: పునరావృత గుండె వైఫల్య సమస్యతో బాధపడుతున్న 87 ఏళ్ల వృద్ధురాలు లీలానాయర్‌కు మిట్రాక్లిప్ చికిత్సా విధానం ద్వారా వ్యాధిని నయం చేసిన జూబ్లీహిల్స్ కార్డియాలజిస్టుల వైద్య బృందం విజయం సాధించింది. బుధవారం జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ కార్డియాలజిస్టులు డాక్టర్ మనోజ్ అగర్వాల్, డాక్టర్ బీవీఏ రంగారెడ్డి, డాక్టర్ ఆదర్శ్ దేబ్ మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాల్లోనే మొదటిసారిగా ఈ చికిత్సను నిర్వహించామన్నారు. తీవ్రమైన మిట్రల్ వాల్వ్ రెగర్జిటేషన్ ద్వారా రక్తం తిరిగి వెనకకు వస్తున్న లీలానాయర్‌కు ప్రత్యేకమైన డబుల్ మిట్రా క్లిప్ ప్రక్రియతో కూడిన సంక్లిష్టమైన, సరికొత్త చికిత్సా ప్రక్రియను చేపట్టడం జరిగిందన్నారు.

పర్మనెంట్ చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న దృశ్యం

హిమాయత్‌నగర్: జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్ని తక్షణం పర్మనెంట్ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఉదరి గోపాల్ డిమాండ్ చేశారు. పర్మనెంట్ ఉద్యోగులకు ఇళ్లస్థలాలు మంజూరు చేసి అండగా నిలవాలన్నారు. ఈ రెండు డిమాండ్లతో బుధవారం జీహెచ్ఎంసీ కార్యాలయం ముఖ ద్వారం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. గ్రేటర్ పరిధిలోని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ... తమ డిమాండ్లు గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలే అని గుర్తు చేశారు. సీఎం ఇచ్చిన ఈ రెండు హామీలను పదేళ్లు గడుస్తున్నా నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో నేతలు డి.నర్సింగ్‌రావు, రవీందర్, అర్జున్, శ్రీను, శేఖర్, జి.నర్సింగ్ రావు, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

వెంగళరావునగర్: ప్రాణాపాయంలో ఉన్న వారిని రక్షించాలని అందరికీ ఉంటుందని, అయితే ఎలా రక్షించాలో తెలియకపోతే ఎలాంటి ఉపయోగం ఉండదని ఉస్మానియా మెడికల్ కళాశాల వైద్యులు పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో కమాండెంట్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం సీపీఆర్ ట్రైనింగ్, ఫస్ట్ ఎయిడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ... తరులను రక్షించాలంటే ముందుగా సీపీఆర్ అంటే ఏమిటి, ఫస్ట్ ఎయిడ్ ఎలా చేయాలనే విషయాలపై అవగాహన ఉండాన్నారు. వివిధ కారణాలతో స్పృహ కోల్పోయిన వారిని రక్షించే పద్ధతులను చెప్పడమే కాకుండా పోలీసులు, వారి కుటుంబ సభ్యులతో నమూనా ప్రాక్టికల్స్ చేయించి చూపించారు. ఉస్మానియా మెడికల్ కళాశాల వైద్యుడు డాక్టర్ మనీష్, అసిస్టెంట్ కమాండెంట్ రంగారెడ్డి, ఆర్ఐలు ధర్మారావు, సాంబయ్య, శంకర్, జాఫర్, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

- ఊరికే ఎవరూ డబ్బు ఇవ్వరు
- సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ప్రమోద్



సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరిస్తున్న సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్

హిమాయత్‌నగర్: డబ్బులు అనేవి ఎవరికీ ఊరికే రావని, అలా ఊరికే ఇస్తామనే వారి మాటలను నమ్మొద్దంటూ విద్యార్థులకు సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ కుమార్ సూచించారు. ×సైబర్ జాగృతి దివస్×లో భాగంగా బుధవారం శ్రీ చైతన్య విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు జరుగుతున్న తీరు, అమాయకులను దోచుకుంటున్న వైనాన్ని ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్యాంకు నుంచి, లాటరీ వచ్చిందని, కోటీశ్వరులు అయ్యారని, ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే లాభాలు వస్తాయని, ఇంట్లో కూర్చుని డబ్బు సంపాదించొచ్చని, యూట్యూబ్ లైక్స్, మీ పేరుపై అక్రమంగా డ్రగ్స్ సరఫరా అవుతున్నాయి ఇలా ఎవరూ మాట్లాడినా నమ్మొద్దన్నారు. అలా ఎవరైనా కాల్స్ చేస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. దేశం మార్పు సాధించాలంటే అది విద్యార్థులతోనే సాధ్యమన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థుల్లో అవగాహన వస్తేనే ఆ నేరాల నుంచి బయటపడగలిగే అవకాశం ఉంటుందన్నారు.

భైరవగుట్ట ఆలయ పునఃనిర్మాణానికి సహకరించాలి

పంజగుట్ట: కాకతీయుల కాలం నాటి పురాతన, ఎంతో మహిమగల స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఘన్‌పూర్ ప్రాజెక్టు పక్కనే ఉన్న భైరవగుట్ట వైద్యనాథ ఆలయాన్ని పునఃనిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలని ఆలయ నిర్వాహకులు, శివభక్తులు బి.కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఓరుగల్లుకు చెందిన కాకతీయ రాజులు ఈ దేవాలయాన్ని నిర్మించారని ఎంతో మహిమగల శివుని లింగం, నందీశ్వరుడు కొలువై ఉన్నారని తెలిపారు. కాలక్రమేనా దేవాలయం పూర్తిగా ధ్వంసమయ్యిందని ఆవేదనవ్యక్తం చేశారు. ఇటీవల కడెం ప్రాజెక్టు పూర్తిగా మునిగిపోయి ప్రాజెక్టు పైనుంచి ప్రవాహం వెళ్తుంటే తాము, గ్రామస్థులు ఈ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామని వరుణదేవుడు శాంతించారన్నారు. అంతటి మహిమగల ఆలయాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. సమావేశంలో యోగాచార్య ఫణీంద్ర, వెంకటేశ్వర్‌రెడ్డి, సిద్ధ, నారాయణ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా నరేందర్‌సింగ్



వెంగళరావునగర్: టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా టి.నరేందర్ సింగ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. యూసుఫ్‌గూడలోని టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్‌కు ఆయన బదిలీపై వచ్చారు. ఆయనను కమాండెంట్ మురళీకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా నరేందర్ సింగ్ మాట్లాడుతూ... ఉద్యోగ నిర్వహణలో ఎలాంటి ఆటంకాలు ఎదురైనా సమర్థవంతంగా వాటిని ఎదుర్కొంటూ సమాజ భద్రతకు తనవంతు కృషి చేస్తానన్నారు. పలువురు అసిస్టెంట్ కమాండెంట్స్, ఇతర అధికారులు, సిబ్బంది ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలి

లిబర్టీ: ఉస్మానియా యూనివర్సిటీలో పెంచిన పీజీ, పీహెచ్‌డీ కోర్సుల ఫీజులను తక్షణమే తగ్గించాలని దళిత బహుజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇటిక్యాల గణేష్ డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులపై ఆర్థిక భారం మోపుతూ ఉస్మానియా వైస్ చాన్సిలర్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో వివిధ రూపాల్లో ఆందోళన సాగిస్తామని హెచ్చరించారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులు

బంజారాహిల్స్: కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన హైదరాబాద్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్-2023లో అమీర్‌పేట్ ధరంకరం రోడ్డుకు చెందిన నాయక్ బుడోఖాన్ కరాటే అకాడమీ విద్యాంజలి విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో తమ అకాడమీ విద్యార్థులు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు మాస్టర్ వాసుదేవ్ తెలిపారు. వ్యక్తిగత కటా ఈవెంట్స్‌లో ఎం.సాహితీ బంగారు పతకం, ఎం.అరవింద్ బంగారు పతకం, శ్రీజన్ హంస కాంస్య పతకం, వ్యక్తిగత కుమ్మి విభాగంలో విశేష్ అగర్వాల్ కాంస్య పతకం, సాక్యెత్ శర్మ రెండు రజత పతకాలు సాధించినట్లు మాస్టర్ వాసుదేవ్ తెలిపారు.

‘ట్రేడింగ్‌పై సలహా’లంటూ దోచేస్తారు!

సైబర్ క్రైం డీసీపీ స్నేహా మెహ్రా



హిమాయత్‌నగర్: కాల్ సెంటర్ ఏర్పాటు చేసి ట్రేడింగ్‌పై సలహాలు అంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు కేంద్రంగా డబ్బు దండుకుంటున్న ఫేక్‌కాల్ సెంటర్ ముఠా గుట్టును సైబర్ క్రైం పోలీసులు రట్టు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 31 ల్యాప్‌టాప్‌లు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాల్ సెంటర్‌కాల్స్ మాట్లాడుతూ... అమాయకుల్ని ట్రాప్ చేస్తున్న టెలీకాలర్స్ 31 మందికి 41 నోటీసులు జారీ చేసినట్లు సైబర్ క్రైం డీసీపీ స్నేహా మెహ్రా తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ సీపీ కార్యాలయంలో ఏసీపీ ఆర్.జి.శివమారుతి, ఇన్‌స్పెక్టర్ హరిభూషణరావు, ఎస్ఐ శైలేందర్‌లతో కలిసి స్నేహా మెహ్రా వివరాలు వెల్లడించారు.

- చిత్తూరు జిల్లాకు చెందిన తిప్పన్నగారి సాయిశ్రావణ్ కుమార్ రెడ్డి కొత్తోళ్ల మహేష్, రెడ్డి వారి హరిబాబు యాదవ్, కొర్రు అజిత్, మాదిగ దివాకర్‌లతో కలసి ‘ఇంటిగేర్ కన్సల్టెన్సీ ప్రైవేటు లిమిటెడ్ ఎట్ పిలేర్’ పేరుతో ట్రేడింగ్ సలహాల కొత్త తరహా మోసానికి శ్రీకారం చుట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన 41 మందిని టెలీకాలర్స్‌గా పెట్టుకుని కాల్స్ చేపిస్తూ సలహాలు ఇస్తున్నారు. ఆపై మీరు మా ద్వారా మీరు ట్రేడింగ్ చేస్తే అతి తక్కువ కాలంలోనే కోటీశ్వరులు కావొచ్చని కొందరిని నమ్మించారు. ఇలా ఓ 140 మంది నుంచి దాదాపు రూ. కోటికి పైగా డబ్బు దోచుకున్నారు.
- తిప్పన్నగారి సాయిశ్రావణ్‌కుమార్‌రెడ్డి ఓ ఐదు బ్యాంకు ఖాతాల వివరాలు ఇచ్చి వాటిలో డబ్బు జమ చేపించుకుంటున్నాడు. డబ్బు జమ అయ్యాక ఫోన్‌లు స్విచాఫ్ చేయడం పరిపాటిగా మారింది. ట్రేడింగ్ సలహాల పేరుతో రూ. 2 లక్షల 60 వేల డబ్బు దోచుకుని మోసం చేశారంటూ ఓ బాధితుడు గత నెలలో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ హరిభూషణరావు టీం.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ చిత్తూరు కేంద్రంగా ఇది జరుగుతున్నట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లిన పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. దీనిలో కాల్స్ మాట్లాడిన టెలీకాలర్స్‌కు నోటీసులు జారీ చేశారు. వీరు దేశవ్యాప్తంగా ఎంతమందిని మోసం చేశారనేది తదుపరి విచారణలో తెలుస్తుందని డీసీపీ స్నేహా మెహ్రా తెలిపారు.



‘నిషా’చరులకు జరిమానా

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం సేవించి పట్టుబడ్డ 15 మంది వాహనదారులను బుధవారం నాంపల్లిలోని 8వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు ఇందులో ఒక వాహనదారుడికి రూ. 3300 జరిమానాతో పాటు ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేస్తూ తీర్పునిచ్చారు. మిగతా 14 మందికి రూ. 2100 చొప్పున జరిమానా విధించారు. జరిమానాల రూపంలో రూ. 32,700 వసూలైనట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ అదృశ్యం



సత్యమ్మ

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ అదృశ్యమైన ఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఖైరతాబాద్ బడా గణేష్ సమీపంలోని శ్రీనివాస్‌నగర్‌లో నివసించే మంగళి సత్యమ్మ(45) మంగళవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. గంట తర్వాత కనిపించకపోయేసరికి కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాలు గాలించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఉపయోగం లేకపోవడంతో కుమారుడు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఖైరతాబాద్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని సత్యమ్మ కోసం గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 98497 47186లో సంప్రదించాలని వారు కోరారు.

ఆలోచనలే విజయానికి సోపానాలు

కాచిగూడ: ఆత్మవిశ్వాసంతో కూడిన మంచి ఆలోచనలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయని ప్లూరల్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ వర్ల భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. బద్రుకా కళాశాల 74 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం కాచిగూడలోని కళాశాల ఆడిటోరియంలో అయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే తమకు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఎదురయ్యే అవరోధాలను అధిగమించి విజయాలు సాధించేందుకు సిద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి వ్యక్తి జీవితంలో రిస్క్ తీసుకుంటేనే విజయాలు సాధించి ఉన్నత స్థానాల్లో నిలుస్తారన్నారు. విద్యార్థులు వేసిన దశావతారం నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. బద్రుక కళాశాల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుక, కోశాధికారి రాజేంద్ర బద్రుక, ప్రొఫెసర్ ఎస్. అభిరామకృష్ణ, డాక్టర్ మోహన్‌కుమార్, డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ ఎం.జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

క్లుప్తంగా...

చెరువుల నుంచి మట్టి తవ్వకం అక్రమమే

ఉద్దండాపూర్‌పై పిటిషన్‌లో ఎన్జీటీ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్‌: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉద్దండాపూర్‌ రిజర్వాయర్‌ కట్ట నిర్మాణం కోసం చెరువుల్లోని మట్టిని పెద్దఎత్తున తవ్వి తరలించడం అక్రమేనని నేషనల్‌ గ్రీన్‌ ట్రిబ్యునల్‌ (ఎన్జీటీ) తేల్చింది. అది పర్యావరణ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. తవ్విన మట్టిని అంచనా వేసి జరిమానాను లెక్కించాలని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఈ జరిమానాను కృష్ణా నదీ మేనేజ్‌మెంట్‌ బోర్డు (కేఆర్‌ఎంబీ)కి చెల్లించాల్సి ఉంటుందని చెప్పింది. దీని కోసం 4 వారాలు గడువిస్తున్నట్లు పేర్కొంది. పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్‌ స్కీమ్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహబూబ్‌నగర్‌ జిల్లాలో ఉద్దండాపూర్‌ రిజర్వాయర్‌ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అయితే అత్యంత పొడవైన ఈ రిజర్వాయర్‌ నిర్మాణానికి పర్యావరణ అనుమతి లేకున్నా చుట్టు పక్కల ఉన్న చెరువుల నుంచి విచక్షణా రహితంగా మట్టిని తవ్వి కట్ట నిర్మాణానికి తరలిస్తున్నారు. ఇది చట్టవిరుద్ధమని పేర్కొంటూ మహబూబ్‌నగర్‌ జిల్లా ముదిరెడ్డిపల్లెకు చెందిన కోస్గీ వెంకటయ్య ఎన్జీటీలో పిటిషన్‌ దాఖలు చేశారు. దీనిపై జ్యుడీషియల్‌ సభ్యులు జస్టిస్‌ పుష్ప సత్యనారాయణ, ఎక్స్‌పర్ట్‌ సభ్యులు సత్యగోపాల్‌ కొర్లపాటి బెంచ్‌ విచారణ చేపట్టింది. పిటిషనర్‌ తరపున సుప్రీంకోర్టు న్యాయవాది శ్రవణ్‌ కుమార్‌ వాదనలు వినిపించారు. 'మట్టిని విచక్షణారహితంగా తవ్వితే చెరువుల నీటి నిల్వ సామర్థ్యం దెబ్బతింటుంది. భూగర్భ జలాలు ప్రతికూలంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. వర్షపు నీరు పూర్తిగా ఖాళీ అయిన తర్వాత భూగర్భ జలాలు మరింత కిందకు పడిపోతాయి. ఆ మట్టిని అనుమతి లేకుండా కట్ట నిర్మాణానికి ఉపయోగించడం చట్టవిరుద్ధం. వెంటనే తవ్వకాలను ఆపేలా ఆదేశాలు ఇవ్వాలి' అని వాదించారు. వాదనలు పూర్తి కావడంతో జస్టిస్‌ పుష్ప తీర్పు వెల్లడించారు.

ఏపీ బీసీ యూత్‌ అసోసియేషన్‌ కార్యదర్శిగా శివకుమార్‌

లక్డీకాపూల్‌ (హైదరాబాద్‌): తిరుపతి జిల్లా రేణిగుంటకు చెందిన పి.శివకుమార్‌ ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర బీసీ యూత్‌ అసోసియేషన్‌ కార్యదర్శిగా నియమితులయ్యారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్‌.కృష్ణయ్య ఆదేశాల మేరకు ఈ నియామకాన్ని చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్‌ యూత్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ (నాని ముదిరాజ్‌) తెలిపారు.

మేం చెప్పిందే చట్టం!

ప్రభుత్వం తమదంటూ అధికారులను బెదిరించిన 'నారాయణ'

- బినామీలు, బంధువుల పేరిట భారీగా అసైన్డ్‌ భూములు కాజేశారు
- బినామీల పేరిట కొన్న 148 ఎకరాల ప్రస్తుత మార్కెట్‌ విలువ రూ.600 కోట్లకుపైనే
- నారాయణ, ఆయన కుమార్తె ఫోన్‌ సంభాషణల్లో ఈ వ్యవహారం బయటపడింది
- చంద్రబాబుకు సైతం భాగస్వామ్యం.. ఆధారాలున్నాయి.. లోతైన దర్యాప్తు అవసరం
- స్టే ఎత్తివేసి దర్యాప్తునకు అనుమతివ్వండి.. హైకోర్టుకు నివేదించిన ఏఏజీ పొన్నవోలు

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని అమరావతిలో నిరుపేద అసైన్డ్‌దారులను బెదిరించి బినామీలు, బంధువుల పేరిట కారుచౌకగా భూములను కొట్టేసిన మాజీ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను సైతం బెదిరించారని సీఐడీ తరపున అదనపు అడ్వొకేట్‌ జనరల్‌ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు బుధవారం నివేదించారు. ప్రభుత్వం తమదని, తాము చెప్పిందే చట్టమని, చెప్పినట్లు చేయాలంటూ అధికారులను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అప్పటి అడ్వొకేట్‌ జనరల్‌ (ఏజీ), న్యాయశాఖ, ముఖ్య కార్యదర్శులు, ఐఏఎస్‌ అధికారులు వారించినా నారాయణ లెక్క చేయలేదని తెలిపారు. అసైన్డ్‌ భూముల కొనుగోళ్ల వ్యవహారంలో నారాయణే కీలక సూత్రధారి అని స్పష్టం చేశారు. ఆయన సమీప బంధువులు, బినామీల పేరిట 148 ఎకరాలను కొనుగోలు చేసేందుకు రూ.18.10 కోట్లు వెచ్చించినట్లు నివేదించారు. ప్రస్తుతం వాటి మార్కెట్‌ విలువ రూ.600 కోట్లకు పైనే ఉంటుందని కోర్టు దృష్టికి తెచ్చారు. అసైన్డ్‌ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందని, అంతిమంగా పేదలకు ఎలాంటి లబ్ధి చేకూరదంటూ గత ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నేతలు భయాందోళనలు రేకెత్తించారన్నారు. అనంతరం అసైన్డ్‌దారుల నుంచి భూములను అన్‌ రిజిస్టర్డ్‌ సేల్‌ అగ్రిమెంట్ల ద్వారా నామమాత్రపు ధరలకు కొట్టేశారని వివరించారు. ఆ తరువాత వాటిని ల్యాండ్‌ పూలింగ్‌ స్కీం కింద సీఆర్‌ఏడీకు ఇచ్చి జీవో 41 (ల్యాండ్‌ పూలింగ్‌ స్కీం రూల్స్‌)ని అడ్డం పెట్టుకుని విలువైన నివాస, వాణిజ్య ప్లాట్లను పొందినట్లు తెలిపారు. కొన్నిటిని అధిక ధరలకు అమ్ముకున్నట్లు కోర్టు దృష్టికి తెచ్చారు.



ఈ మొత్తం నేరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, నాటి పురపాలక శాఖ మంత్రి నారాయణ పాత్రపై స్పష్టమైన ఆధారాలున్నాయని నివేదించారు. దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్న నారాయణ ఫోన్‌లో ఆయన కుమార్తె సింధూరతో జరిపిన కీలక సంభాషణలున్నట్లు తెలిపారు. తాను అసైన్డ్‌ భూములను కొన్నట్లు ఆ సంభాషణల్లో నారాయణ అంగీకరించారని వెల్లడించారు. అసైన్డ్‌ భూములు తమ పేర్లతో ఉంటే ప్రభుత్వం జైల్లో వేస్తుందని నారాయణ తన కుమార్తెతో చెప్పారన్నారు. ఆ సంభాషణల తాలుకూ పెన్‌ డ్రైవ్‌ను సీల్డ్‌ కవర్‌లో కోర్టుకు అందచేశారు. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి ఒరిజినల్‌ రికార్డులను సైతం సీల్డ్‌ కవర్‌లో కోర్టుకు సమర్పించారు. సుధాకర్‌రెడ్డి వాదనలు పూర్తి కాకపోవడంతో తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ డాక్టర్‌ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. అసైన్డ్‌ భూముల బదలాయింపులో అక్రమాలపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రి పొంగూరు నారాయణలపై సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీన్ని కొట్టివేయాలని కోరుతూ వేర్వేరుగా దాఖలైన క్వాష్‌ పిటిషన్లపై స్టే విధించిన న్యాయస్థానం ఇటీవల తుది విచారణ చేపట్టింది.

ఇతర టీడీపీ నేతలు కూడా..

అసైన్డ్‌దారులను బెదిరించి కేవలం నారాయణ మాత్రమే కాకుండా అప్పటి అధికార పార్టీ నేతలైన రావెల కిషోర్‌బాబు, అనగాని సత్యప్రసాద్, పరిటాల శ్రీరామ్, ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు కూడా భూములను సొంతం చేసుకున్నట్లు ఏఏజీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ల్యాండ్‌ పూలింగ్‌ పరిధిలోకి అసైన్డ్‌ భూములను తీసుకురావడం, ఆ భూముల బదలాయింపుపై అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్‌ కాంతీలాల్‌ దండే, జాయింట్‌ కలెక్టర్‌ చెరుకూరి శ్రీధర్‌ అభ్యంతరం తెలిపారన్నారు. ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్‌ సైతం అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. అసైన్డ్‌ భూముల విషయంలో చట్టపరమైన నిబంధనలను నారాయణకు స్పష్టంగా వివరించినట్లు వారు తమ వాంగ్మూలాల్లో స్పష్టంగా చెప్పారన్నారు. ఈ నేపథ్యంలో స్టే ఎత్తివేసి సీఐడీ దర్యాప్తు కొనసాగించేందుకు అనుమతి నివ్వాలని అభ్యర్థించారు.

చట్టపరమైన రక్షణ ఉంది.. ప్రాసిక్యూషన్‌ తగదు

అంతకు ముందు నారాయణ తరఫున సీనియర్‌ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్‌ వాదనలు వినిపిస్తూ సీఆర్‌డీఏ చట్టం కింద తీసుకున్న నిర్ణయాల విషయంలో ప్రభుత్వం, అధికారులు, అథారిటీలకు వ్యతిరేకంగా ఎలాంటి కేసులు దాఖలు చేయడానికి వీల్లేదన్నారు. చట్టం కింద రక్షణ ఉన్నందున నారాయణను ప్రాసిక్యూట్‌ చేయడానికి వీల్లేదన్నారు. తమకున్న అధికారం మేరకే జీవో 41 జారీ చేశారని తెలిపారు. ఈ అధికారాన్ని ప్రశ్నించడానికి వీల్లేదన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకునే వారికి దురుద్దేశాలు అంటగట్టడానికి వీల్లేదన్నారు. అసైన్డ్‌ భూముల విషయంలో ఎస్సీ, ఎస్టీలెవరూ ఫిర్యాదుదారులు కాదన్నారు. అందువల్ల ఆ చట్టం కింద కేసు నమోదు చేయడానికి వీల్లేదన్నారు.

82.92 లక్షల ఎకరాల్లో పంటల సాగు

అందులో 43.25 లక్షల ఎకరాల్లో పత్తి
- 25.52 లక్షల ఎకరాల్లో వరి నాట్లు
- ప్రభుత్వానికి వ్యవసాయశాఖ నివేదిక

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో పంటల సాగు ఊపందుకుంది. భారీ వర్షాలు కురవడంతో ఒకవైపు పంట నష్టం జరిగినా, మరోవైపు రైతులు వరి నాట్లు వేసుకోవడంలో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో 82.92 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన నివేదికలో వెల్లడించింది. ఈ సీజన్‌ సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలు కాగా, 66.72% విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 43.25 లక్షల ఎకరాల్లో సాగైంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 25.52 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 9.43 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.80 లక్షల ఎకరాల్లో, సోయాబీన్‌ సాధారణ సాగు విస్తీర్ణం 4.13 లక్షల ఎకరాలు ఉండగా ఇప్పటివరకు 4.26 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇక మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 7.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.51 లక్షల ఎకరాల్లో సాగైంది.

భారీ స్కామ్‌.. 'బ్రో'

- అమెరికాలో బాబు ముఠా వసూలు చేసిన డబ్బునే పవన్‌కు ప్యాకేజీగా ఇప్పించారు: అంబటి
- చాలా ముఖ్యమైన అంశంపై ఢిల్లీ వెళ్తున్నట్లు అంబటి వెల్లడి

సాక్షి, అమరావతి: బ్రో సినిమా వ్యవహారంలో నూటికి నూరు శాతం అక్రమ ఆర్థిక లావాదేవీలు జరిగాయని, అదో కుంభకోణమని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పునరుద్ఘాటించారు. తన ఆరోపణల్లో వాస్తవాలు లేకపోతే సినిమా నిర్మాతగానీ పవన్‌ కల్యాణ్‌గానీ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. వాస్తవాలు వెల్లడించేందుకు భయపడుతున్నారా? దాస్తున్నారా? అని నిలదీశారు. దాస్తున్నారంటే అందులో స్కామ్‌ దాగి ఉందనే అర్థమని స్పష్టం చేశారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అంబటి బుధవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అమెరికాలో తన ముఠా ద్వారా వసూలు చేసిన డబ్బును నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌ ద్వారా పవన్‌కు ప్యాకేజీగా ఇప్పించారని పునరుద్ఘాటించారు.



డైలాగ్‌లు కొట్టి దాగుడు మూతలెందుకు?

బ్రో సినిమాకు విదేశీ పెట్టుబడులు అక్రమంగా వచ్చాయని, ఇది మనీలాండరింగ్‌ కాదా? అని అంబటి సూటిగా ప్రశ్నించారు. ఈ సినిమాకు పెట్టిన పెట్టుబడి ఎంత? కలెక్షన్లు ఎంత? పవన్‌ పారితోషికం ఎంత? ఆదాయ పన్నుగా కట్టింది ఎంత? అని ప్రశ్నించారు. అత్యంత నిజాయితీపరుడినని, అపర దాన కర్ణుడినని, సమాజ శ్రేయస్సు కోరుకునే వ్యక్తినంటూ డైలాగ్‌లు కొట్టే పవన్‌ వాస్తవాలను ఎందుకు దాస్తున్నారని నిలదీశారు. సినిమాను సినిమాలాగే చూడాలన్న సాయిధరమ్‌ తేజ్‌ వ్యాఖ్యలపై మంత్రి అంబటి స్పందిస్తూ అలాంటప్పుడు సినిమాలను సినిమాగానే తీయండి...మధ్యలో మమ్మల్ని గోకడమెందుకు? అని చురకలంటించారు. బ్రో సినిమా వ్యవహారంలో మనీలాండరింగ్‌ జరిగిందంటూ ఈడీ, సీబీఐకి ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీ వెళ్తున్నారా? అని విలేకరులు ప్రశ్నించగా 'నేను ఇవాళ రాత్రి చాలా ముఖ్యమైన అంశంపై ఢిల్లీ వెళ్తున్నా. మా పార్టీ ఎంపీలను కలుస్తా. ఢిల్లీ నుంచి వచ్చాక అన్ని వివరాలు చెబుతా' అని అంబటి చెప్పారు.

వృద్ధాప్యంలోనూ అనుమానంతో వేధిస్తున్నాడని..

- భర్త హత్యకు భార్య సుపారీ
- రూ. రెండు లక్షలు తీసుకొని హతమార్చిన ఇద్దరు
- ఆలస్యంగా ఘటన వెలుగులోకి...



మృతదేహాన్ని వెలికితీస్తున్న అధికారులు. ఇన్‌సెట్లో కాశయ్య (ఫైల్‌)

సిరిసిల్లక్రైం: వృద్ధాప్యంలోనూ కట్టుకున్న భార్యను అనుమానించాడు. భర్త పదేపదే కొట్టడంతో విసిగిపోయింది. ఎలాగైనా తన భర్తను హతమార్చాలని రూ.రెండు లక్షలకు సుపారీ ఇచ్చింది. గత నెల 13వ తేదీన హత్య జరగ్గా, బుధవారం ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సిద్దిపేట జిల్లా చింతమడక గ్రామానికి చెందిన కనకవ్వ(60), కాశయ్య(65) బతుకుదెరువుకు సిరిసిల్లకు 25 ఏళ్ల క్రితం వచ్చారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. కూతుళ్లకు పెళ్లిళ్లు జరగగా, కొడుకు మానసిక స్థితి సరిగ్గా లేదు. వృద్ధ దంపతులిద్దరూ సిరిసిల్ల మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తారు. ఈ క్రమంలోనే భార్యపై భర్తకు అనుమానం కలిగింది. పలుమార్లు కనకవ్వను కొట్టాడు. ఆమె భర్త వేధింపులు తట్టుకోలేకపోయింది. వరుసకు తమ్ముడిగా పిలిచే ఒకరికి విషయాన్ని చెప్పింది. భర్తను చంపితే రూ.2లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకుంది. గత నెల 13న మద్యం మత్తులో కాశయ్య నిద్రిస్తుండగా, అనుకున్న పథకం ప్రకారం తను సంప్రదించిన వారికి సమాచారం ఇచ్చింది. వారు ఇంటికి చేరుకొని నిద్రలో ఉన్న కాశయ్య గొంతుకు దుప్పటి చుట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేశారు. మృతదేహాన్ని కారులో వేసుకొని సిరిసిల్లలోని మానేరు వాగు చెక్‌డ్యామ్‌ వద్ద బొందలగడ్డలో పూడ్చిపెట్టారు. ఆ తర్వాత రూ.2 లక్షలు తీసుకుని వెళ్లిపోయారు.

డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్‌

చంపడానికి చేసుకున్న ఒప్పందంతోపాటు హత్య చేసిన విధానాన్ని నిందితుల్లో ఒకరు వీడియో తీసినట్టు తెలిసింది. హత్య చేసిన తర్వాత వచ్చిన రూ.2లక్షలతో జల్సాలు చేసే సమయంలో మరో రూ.లక్ష కావాలంటూ కనకవ్వను డిమాండ్‌ చేశారు. డబ్బులు ఇవ్వకుంటే హత్యకు సంబంధించిన వీడియో బయటపెడతామని బెదిరించసాగారు. ఈ తతంగమంతా బయటకు పొక్కింది. దీనిపై సిరిసిల్లటౌన్‌ సీఐ ఉపేందర్‌ విచారణ చేపట్టారు. కూరగాయల మార్కెట్‌ ఏరియాలో నిఘా పెట్టి అనుమానితుల నుంచి సమాచారం సేకరించారు. చివరికి వృద్ధుడి హత్య చేయడానికి సుపారీ తీసుకున్న ఇద్దరు నిందితులతోపాటు మృతుని భార్యను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగుచూసింది. బొందలగడ్డలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని తహసీల్దార్‌ సమక్షంలో బయటకు తీయించారు. ఈ విషయంపై సిరిసిల్లటౌన్‌ సీఐ ఉపేందర్‌ను వివరణ కోరగా కేసు దర్యాప్తులో ఉందని, వివరాలు ఉన్నతాధికారుల సమక్షంలో వెల్లడిస్తామని తెలిపారు.

నగర వార్తలు

వృద్ధురాలికి అపోలో వైద్యుల సరికొత్త చికిత్స



సాక్షి, సిటీబ్యూరో: గుండె సంబంధ వ్యాధితో బాధపడుతున్న 87ఏళ్ల వృద్ధురాలికి అపోలో ఆసుపత్రి వైద్యులు సరికొత్త చికిత్స విధానం ద్వారా కోలుకునేలా చేశారు. ఈ విషయాన్ని ఆసుపత్రి వైద్యులు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరించారు. గుండె వైఫల్యం సమస్యతో బాధపడుతున్న వృద్ధురాలు లీలా నాయర్‌కు చికిత్స చేయడానికి, మొదటిసారిగా మిట్రాక్లిప్‌ చికిత్సా విధానాన్ని పరిచయం చేశామని, ఇది ఒక విప్లవాత్మకమైన అతి తక్కువ ఇన్వేసివ్‌ ప్రక్రియగా పేర్కొన్నారు. ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన రోగులకు ఈ విధానం కోలుకునే అవకాశాలను మెరుగుపరుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా మిట్రాక్లిప్‌ చికిత్సకు సంబంధించిన పలు విశేషాలను వివరించారు. ఆసుపత్రికి చెందిన ఇంటర్వెన్షనల్‌ కార్డియాలజిస్ట్‌ డాక్టర్‌ రంగారెడ్డి నేతృత్వంలో అపోలో హాస్పిటల్స్, కార్డియాలజిస్టుల వైద్య బృందం పాల్గొందన్నారు. సమావేశంలో చికిత్స అందుకున్న మీరానాయర్‌ పాల్గొని మాట్లాడారు.

రాజకీయాలలో సేవాభావం కలిగి ఉండాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

గన్‌ఫౌండ్రీ: రాజకీయాలలో సేవాభావం కలిగి ఉండాలని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో శ్రీ శాంతికృష్ణ సేవా సమితి 38వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు జనబంధు బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌ పిలుపుమేరకు తాను క్రియాశీలక రాజకీయాలలో ప్రవేశించానని అనుకోకుండానే రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. కేసీఆర్‌ దార్శనికత, దూరదృష్టి వల్ల రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో దూసుకెళుతోందన్నారు. అనంతరం శాంతి కృష్ణకు కళావిరాట్‌ బిరుదును ప్రదానం చేయగా కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర శాసనమండలి వైస్‌ చైర్మన్‌ బండా ప్రకాష్‌ ముదిరాజ్, విశ్రాంత ఐపీఎస్‌ అధికారి జేడీ లక్ష్మీనారాయణ, నిర్మాత దిల్‌రాజ్, ఆంధ్రప్రదేశ్‌ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ చైర్మన్‌ టి.శ్రీకాంత్, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్మన్‌ జూలూరు గౌరిశంకర్, వికలాంగుల కార్పొరేషన్‌ చైర్మన్‌ కె.వాసుదేవరెడ్డి, వరంగల్‌ మేయర్‌ గుండు సుధారాణి పాల్గొన్నారు.

ఓటీపీతో కాదు ఐపీతో.. బ్యాంకు లావాదేవీలు!

దీన్ని గుర్తించగలిగితేనే సైబర్‌ మోసాల నియంత్రణ
- ఇండియాలో బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ఏజెంట్లు
- సామాన్యుల పేర్ల మీద బ్యాంకు ఖాతాలు ఓపెన్‌
- ఇందుకోసం రోజుకు రూ.1,000 చెల్లిస్తున్న మధ్యవర్తులు
- చైనా, ఫిలిప్పిన్స్, నేపాల్‌ దేశాల నుంచి ఎక్కువగా ఈ తరహా మోసాలు



సాక్షి, సిటీబ్యూరో: 'రాచకొండ కమిషనరేట్‌ పరిధిలోని ఓ ఐటీ ఉద్యోగి పార్ట్‌ టైం జాబ్‌ వలలో చిక్కి రూ.లక్ష పోగొట్టుకున్నాడు. కేసు దర్యాప్తులో పోలీసులు బాధితుడు లావాదేవీలు జరిపిన బ్యాంకు ఖాతా, సెల్‌ఫోన్‌ లొకేషన్‌ ఆధారంగా ఒక ఖాతాదారుడిని పట్టుకున్నారు. అయితే విచారణలో తానెవరినీ మోసం చేయలేదని, ఒక ఏజెంట్‌ సూచన మేరకు తన పేరు మీద కరెంట్‌ బ్యాంక్‌ అకౌంట్‌ తెరిచి ఇచ్చానని చెప్పాడు. ఇందుకుగాను ఆ ఏజెంట్‌ ప్రతి రోజు రూ.1,000 తన ఖాతాలో జమ చేస్తున్నాడని చెప్పాడు. అంతేతప్ప ఆ ఖాతాతో వారేం చేస్తున్నారో తనకేమీ తెలియదని పోలీసులకు బదులిచ్చాడు.'

... ఇప్పటివరకు పేదలు, అనాథలు, బిచ్చగాళ్ల పేర్ల మీద ఆధార్, పాన్‌ కార్డులు సృష్టించి, వాటితో బ్యాంకు ఖాతాలను తెరుస్తున్న సైబర్‌ నేరస్తులు.. ఈ తరహా ఖాతాల లభ్యత తక్కువయ్యే సరికి నేరస్తులు రూటు మార్చారు. నిరుద్యోగులు, యువకులను ఆకర్షించి, వారి పేర్ల మీద అకౌంట్ల తీసి, వాటిని అద్దెకు తీసుకునేందుకు ప్రత్యేకంగా ఏజెంట్లను నియమించుకున్నారు. ఈ ఏజెంట్లు వివిధ మాధ్యమాల ద్వారా సేకరించిన నిరుద్యోగులను కలిసి వారి పేర్లతో బ్యాంకు ఖాతాలను తెరుస్తున్నారు. ఇందుకోసం వారికి రోజుకు రూ.500–1,000 చెల్లిస్తున్నారు.

ఎలా చేస్తున్నారంటే..

భౌతికంగా మీ బ్యాంకు కిట్, సిమ్‌ కార్డు ఏజెంట్‌ దగ్గర ఉంటుంది. కానీ, మీ ఆన్‌లైన్‌ లావాదేవీలు మాత్రం విదేశాల నుంచి జరుగుతుంటాయి. ఎలాగంటే.. సైబర్‌ కేటుగాళ్లు సూచించినట్లుగా ఏజెంట్‌ మీ సిమ్‌ను కొత్త ఫోన్‌లో వేసి మైటీటెక్స్, టీమ్‌ వ్యూయర్, ఎనీ డెస్క్, క్విక్‌ అసిస్ట్‌ వంటి రిమోట్‌ యాక్సెస్‌ యాప్‌లను డౌన్‌లోడ్‌ చేసుకుంటాడు. తొలుత సైబర్‌ నేరస్తులు మోసం చేసిన సొమ్మును మీ ఖాతాలో వేయించుకుంటారు. సొమ్మును ఇతర అకౌంట్లకు బదిలీ చేసేటప్పుడు అవసరమైన ఓటీపీని రిమోట్‌ యాక్సెస్‌ యాప్‌ల ద్వారా ఒకే సమయంలో ఇటు ఏజెంట్, అటు విదేశాల్లో ఉండే నేరస్తుడు చూడగలరు. దీంతో కొట్టేసిన సొమ్మును విడతల వారీగా పలు బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసి, చివరగా నేరస్తుడి అసలు ఖాతాకు బదిలీ అవుతుంది. కొట్టేసిన మొత్తంలో ఏజెంట్లకు 10–20 శాతం కమీషన్‌ అందిస్తున్నారు.

ఎక్కువగా ఈ దేశాల నుంచే..

ఇన్వెస్ట్‌మెంట్‌ ఫ్రాడ్, పార్ట్‌ టైం జాబ్, లోన్‌ ఫ్రాడ్‌ మోసాలు ఎక్కువగా అద్దె బ్యాంకు ఖాతాల నుంచే జరుగుతున్నాయని రాచకొండ సైబర్‌ క్రైమ్స్‌ పోలీసు అధికారి తెలిపారు. చైనా, ఫిలిప్పిన్స్, నేపాల్‌ దేశాల ఎక్కువ నేరస్తులు ఉంటున్నారని పేర్కొన్నారు.

ఆర్బీఐ ఏం చేయాలంటే..

- ఇండియాలోని బ్యాంకు ఖాతాల నుంచి విదేశీ ఖాతాలకు నిరంతరం లావాదేవీలు జరిపే అకౌంట్లపై నిఘా రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్‌బీఐ) నిఘా పెట్టాలి.
- విదేశీ అకౌంట్లకు నగదు లావాదేవీలు జరిపే సమయంలో వన్‌ టైం పాస్‌వర్డ్‌ (ఓటీపీ) ఆధారంగా కాకుండా ఐపీ ఆధారిత లావాదేవీలను అనుమతించాలి. దీంతో విదేశీ అకౌంట్లు, సైబర్‌ నేరస్తుల అక్రమ లావాదేవీలపై నియంత్రణ ఉంటుంది.
- ఎక్కువ సొమ్ము బదిలీ జరిగే బ్యాంకు ఖాతాలను పరిశీలించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- అనుమానాస్పద విదేశీ బ్యాంకు లావాదేవీలపై సంబంధిత బ్యాంకు అధికారులను వెంటనే అప్రమత్తం చేయాలి. ఆయా లావాదేవీలపై వెంటనే నిలిపివేయాలి.
- విదేశీ లావాదేవీలు జరిపే ఖాతాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షించాలి. ఆయా ఖాతాదారులు, ఫోన్‌ నంబరు, ఇంటి చిరునామా ఇతరత్రా వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించుకోవాలి.

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి



ఆయుర్వేద ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న పీజీ విద్యార్థులు

వెంగళరావునగర్‌: ఆయుర్వేద విద్యార్థుల పట్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ఇప్పటికైనా విడనాడాలని ఆయుర్వేద పీజీ విద్యార్థులు కోరారు. స్టైఫండ్‌ పెంచాలని కోరుతూ గత సోమవారం నుంచి ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మూడో రోజు బుధవారం జరిగిన ఆందోళనలో ఆయా విద్యార్థులు మాట్లాడుతూ.. కోర్టు ఉత్వర్వులను కూడా ప్రభుత్వం ఖాతరు చేయకపోతే ఇక విద్యార్థుల మొర ఎవరు ఆలకిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. స్టైఫండ్‌ పెంచే వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్య విద్యార్థులు డాక్టర్‌ శ్రీనివాస్, డాక్టర్‌ రాంబాబు, డాక్టర్‌ హర్ష, డాక్టర్‌ జగన్‌లాల్, డాక్టర్‌ సంధ్య, డాక్టర్‌ సరిత, డాక్టర్‌ సాహితి, డాక్టర్‌ లక్ష్మి రవళి, డాక్టర్‌ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషపై విద్యార్థుల్లో పట్టుతప్పుతోంది



శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తెలంగాణ రాష్ట్ర పాఠశాలల విద్యా శాఖ కమిషనర్, డైరెక్టర్‌ దేవసేన

రాజేంద్రనగర్‌: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలంగాణ రాష్ట్ర పాఠశాలల విద్యా శాఖ కమిషనర్, డైరెక్టర్‌ ఎ.దేవసేన సూచించారు. బుధవారం రాజేంద్రనగర్‌ మండల విద్యా శాఖ పరిధిలోని గణేష్‌నగర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి తొలిమెట్టు మౌలిక భాషా గణిత సామర్థ్యం శిక్షణ (ఎఫ్‌ఎల్‌ఎ) కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతిలో ఉన్న ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. క్లాస్‌ రూమ్‌ నుంచే విద్యార్థి భవిష్యత్తుకు పునాదులు పడతాయని, అందుకోసం ప్రభుత్వం కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. అందమైన పుస్తకాలను ముద్రించి ఇస్తున్నా, వాటిలోని పాఠ్యాంశ సారాంశాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు ఒంటబట్టించకపోతే ఎలా అని ప్రశ్నించారు. కనీసం అక్షరాలు గుర్తు పట్టలేని స్థితిలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నారన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు తాము నేర్చుకున్న వాటిని ఉపాధ్యాయులకు నేర్పిస్తూ మరింత విజ్ఞానవంతులుగా తీర్చిద్దాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల నోడల్‌ ఆఫీసర్‌ శ్రీకిషన్, ఎంఈవో రాంరెడ్డి, ఏఎం జయసింహారెడ్డి, గణేష్‌నగర్‌ ప్రధానోపాధ్యాయులు రఘుపతి, ఆర్‌పీలు కిరణ్‌ కుమార్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి స్థలాన్ని పరిరక్షించండి

మణికొండ: తమ ఆస్పత్రికి కేటాయించిన స్థలంలో ఓ వర్గానికి కమ్యూనిటీ హాల్‌ నిర్మించటం ఏమిటని, సదరు స్థలాన్ని పరిరక్షించాలని గండిపేట మండల వైద్యాధికారి డాక్టర్‌ పద్మ నార్సింగి పోలీసులు, మున్సిపల్‌ కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థలాన్ని మండల పరిషత్‌ కార్యాలయానికి, ప్రభుత్వ ఆస్పత్రికి కేటాయించిందన్నారు. అలాంటి స్థలంలో ప్రజలందరికీ ఉపయోగపడేలా 24 గంటలు డాక్టర్లు అందుబాటులో ఉండే ఆస్పత్రిని నిర్మించాలని కోరారు. ఇదే విషయంలో నార్సింగి గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు స్పందించాలని ఆమె కోరారు. గతంలో ఉర్దూ మీడియంకు స్థలం ఇవ్వాలని కోరినా తాము అంగీకరించలేదని, అదే స్థలంలో ప్రస్తుతం మండల ప్రజలందరికీ ఉపయోగపడే ఆస్పత్రి నిర్మాణం జరిగిందని ఆమె గుర్తు చేశారు.

టీ-హబ్‌తో బ్రాడ్రిడ్జ్‌ భాగస్వామ్యం



సాక్షి, సిటీబ్యూరో: భారత్‌లో డిజిటల్‌ ట్రాన్స్‌ఫర్మేషన్‌ పురోగమిస్తుందని, ఈ మధ్య కాలంలో దేశవ్యాప్తంగా డిజిటల్‌ మార్కెట్‌ విశేషంగా అభివృద్ధి చెందుతోందని టీ-హబ్‌ సీఈఓ అనీష్‌ ఆంథోని తెలిపారు. ప్రముఖ ఇన్నోవేషన్‌ ఎకోసిస్టమ్‌–గ్లోబల్‌ ఫిన్‌టెక్‌ అగ్రగామి సంస్థ 'బ్రాడ్రిడ్జ్‌' నగరంలోని టీ-హబ్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. కార్పొరేట్లు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలతో పాటు ముఖ్యంగా వెబ్‌ 3 కమ్యూనిటీల మధ్య సహకారాలు–భాగస్వామ్యాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ భాగస్వామ్య వేదికను ప్రారంభించారు. దీనికి సంబంధించిన కార్యక్రమాన్ని బుధవారం టీ-హబ్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీ-హబ్‌ సీఈఓ అనీష్‌ ఆంథోని మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఈ రంగంలో ఎంతో అనుభవంతో అగ్రగామిగా కొనసాగుతున్న 'బ్రాడ్రిడ్జ్‌' తమ సేవలను దేశంలో మొదటిసారిగా ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. దేశంలో వారికి మంచి మార్కెట్‌ వనరులు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. బ్రాడ్రిడ్జ్‌ చీఫ్‌ స్ట్రాటజీ ఆఫీసర్‌ జర్మన్‌ సోటో సాంచెజ్‌ మాట్లాడుతూ.. వెబ్‌ 3 స్టార్టప్‌లకు అద్భుతమైన ప్రోత్సాహమందించడంలో ప్రపంచవ్యాప్తంగా ట్రాక్‌ రికార్డ్‌ సొంతం చేసుకున్న అతిపెద్ద అంతర్జాతీయ ఇంక్యుబేటర్‌ 'టి-హబ్‌'తో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతి అన్నారు. బ్రాడ్రిడ్జ్‌ ఇండియా మేనేజింగ్‌ డైరెక్టర్‌ షీనామ్‌ ఓబ్రీ, సీఐఓ సుజిత్‌ జాగిర్దార్, బ్రాడ్రిడ్జ్‌ ఇన్నోవేషన్‌ వీపీ ఎవియాడ్‌ స్టెయి పాల్గొన్నారు.


మోహనవాణి


పిల్లలకు తాటాకు బొమ్మల తయారీ నేర్పుతున్న మోహనవాణి

మన బాల్యం



తాటాకు బొమ్మలోచ్

తాటాకులు ఇప్పటికీ మన పల్లెల్లో విస్తారం. కాని తాటాకు విసనకర్రలు పోయాయి.
తాటాకు చాపలు, తాటాకు బొమ్మలూ పోయాయి.
'మన కళ ఇది. మన పిల్లలకు బార్బీ కంటే తాటాకు బొమ్మలే నచ్చుతాయి'
అంటుంది కోయంబత్తూరు మోహనవాణి.
తాటాకు కళను పిల్లలకు నేర్పించి వారికై వారు తయారు చేసుకున్న బొమ్మలతో ఆడుకునేందుకు ప్రోత్సహిస్తోంది. స్త్రీలు సరిగా నేర్చుకుంటే ఉపాధి మార్గం అని కూడా చెబుతోంది.





మన దేశంలో పశ్చిమ బెంగాల్‌లో తాటాకుతో చేసే బొమ్మలకు, బుట్టలకు చాలా డిమాండ్ ఉందని చాలా కొద్ది మందికే తెలుసు. విశాఖ జిల్లా నక్కపల్లి, నర్సీపట్నంల నుంచి శ్రేష్ఠమైన తాటాకు గ్రేడింగ్ అయ్యి, రంగులు అద్దుకుని కోల్‌కతాకి ఎగుమతి అవుతుంది. అక్కడ వాటితో బొమ్మలు, బుట్టలు తయారు చేసి అమ్ముతున్నారు. పెద్ద ఆదాయం. విశాఖలో జరుగుతున్నట్టుగా మిగిలిన జిల్లాల్లో జరగడం లేదు. తాటాకులు మన తొలి కాగితాలు. తాటాకుతో ఒకప్పుడు ఇళ్లు కప్పేవారు, పందిళ్లు వేసేవారు, చాపలు, బుట్టలు, బొమ్మలు తయారు చేసేవారు. ఇప్పుడు ఆ కళంతా ఎవరూ సాధన చేయడం లేదు. దానిని అందరికీ నేర్పించాలని కూడా అనుకోవడం లేదు. కాని తమిళనాడులో 34 ఏళ్ల మోహనవాణి అనే మహిళ పట్టుబట్టి తాటాకు బొమ్మల కళను అందరికీ నేర్పుతోంది. దక్షిణాదిలో విస్తారంగా ఉండే తాటి చెట్టు నుంచి ఆకు సేకరించి బొమ్మలు చేసి ఉపాధి పొందవచ్చంటున్నది.

ఎనిమిదేళ్ల వయసులో..

మోహనరాణిది కోయంబత్తూరు. ఆమెకు ఎనిమిదేళ్లు ఉండగా మేనమామ ఆమెకు తాళపత్ర గ్రంథం చూపించాడు. రోజూ చూసే తాటాకుల మీద పుస్తకమే రాయవచ్చా అని మోహనరాణికి ఆశ్చర్యం వేసింది. తాటాకులతో చిన్న చిన్న బొమ్మలు చేసే ప్రయత్నం చేసింది గాని పూర్తిగా రాలేదు. అప్పటినుంచి తాటాకు బొమ్మలు చేయాలనే కోరిక ఉండిపోయింది. ఐదేళ్ల క్రితం మదురైలో తాటాకు బొమ్మలు నేర్పించే వర్క్‌షాప్ జరుగుతున్నదని తెలిసి హాజరయ్యింది. మూడు రోజుల ఆ వర్క్‌షాప్‌లో తాటాకు బొమ్మలు చేయడం నేర్పించారు. పచ్చి ఆకుతో నేరుగా, ఎండిన ఆకైతే నీటితో తడిపి మెత్తగా చేసుకుని అప్పుడు బొమ్మలు చేయాలని తెలిసింది. ఎలా కత్తిరిస్తే ఏ షేప్ వస్తుందో అర్థమయ్యాక తన ఊహ కలిపి బొమ్మలు తయారు చేసింది. వాటికి పూసలు జత చేయడంతో స్పష్టమైన బొమ్మలు తయారయ్యాయి. మోహనవాణి తాటాకులతో చీమలు, చిలుకలు, నెమళ్లు, చేపలు... ఇలా చాలా బొమ్మలు చేస్తుంది. వాటితో గట్టి బుట్టలు కూడా అల్లుతుంది.

పిల్లల లోకం

అయితే ఈ బొమ్మలు తర్వాతి తరాలకు అందాలని నిశ్చయించుకుంది మోహనవాణి. కోయంబత్తూరులోని స్కూళ్లకు వెళ్లి తాటాకు బొమ్మలు నేర్పించింది. పిల్లలు ఎంతో హుషారుతో బొమ్మలు నేర్చుకున్నారు. కొత్త బొమ్మలు చేశారు. 'ఆశ్చర్యం ఏమిటంటే మీరు తయారు చేసిన బొమ్మలతో కథ కల్పించి చెప్పండి అనంటే వాళ్లు చాలా విచిత్రమైన కథలు చెప్పారు. పిల్లలకు ఇదెంతో మానసిక వికాసం అనిపించి తరచూ అనేక స్కూళ్లకు వెళ్లి వర్క్‌షాపులు నిర్వహించి ఈ కళను నేర్పుతున్నాను' అంది మోహనవాణి.

ప్లాస్టిక్‌కు దూరం

తాటాకు బొమ్మలు పర్యావరణ హితమైనవి. పిల్లల్ని, పర్యావరణాన్ని ప్లాస్టిక్ నుంచి దూరంగా ఉంచుతాయి. అంతేకాదు తాటాకు బొమ్మలు దేశీయమైనవి. మనదైన కళ కావడం వల్ల పిల్లలు కృత్రిమ పాశ్చాత్య బొమ్మలతో కాకుండా అమాయకమైన ఈ బొమ్మలతో ఎక్కువ ఆనందం పొందుతారు. 'పర్యావరణ స్పృహ పెరిగింది కాబట్టి తాటాకు బుట్టలను, బాక్సులను, విసనకర్రలను చాలామంది కొంటున్నారు. మహిళలు ఈ కళను నేర్చుకుంటే అతి తక్కువ పెట్టుబడితో మంచి ఉపాధి పొందవచ్చు' అంటోంది మోహనవాణి. ఆమె ఇప్పుడు ముంబైలోని కొన్ని స్కూళ్లకు వెళ్లి ఈ విద్య నేర్పుతోంది. మిగిలిన రాష్ట్రాలలో కూడా చాలా స్కూళ్లు ఆమెను ఆహ్వానిస్తున్నాయి. టీచర్లు ఈ క్రాఫ్ట్ నేర్చుకుంటే పిల్లలకు నేర్పించవచ్చని టీచర్లకు తాటాకు కళ నేర్పుతోంది మోహనవాణి.

'తాటాకు బొమ్మలు చేయడం పెద్ద స్ట్రెస్ బస్టర్. మీ ఒత్తిడి దూరం చేసుకోవడానికైనా తాటాకు అందుకుని బొమ్మలు చేయండి' అంటోంది మోహనవాణి.


వరుణ్ రహేజా

ప్రకృతి చాలా చిత్రమైంది.
ధాన్యాన్ని ఎండించి ఇస్తుంది.
కాయగూరలను పండించి ఇస్తుంది.
ధాన్యం ఏడాదంతా నిల్వ ఉంటుంది.
కాయలు పండ్లకు రోజులే జీవిత కాలం.
ఆ కాయలు పండ్లను కూడా ఎండబెడితే...
అవి కూడా ఏడాదంతా నిల్వ ఉంటాయి.

పంటకు షెల్ఫ్‌లైఫ్

ముందు చూపు ఉంటే ఏదీ వృథా కాదు, దేని ధరా కొండెక్కదు... అని నిరూపించాడు ఇండోర్‌కు చెందిన మెకానికల్ ఇంజనీర్ వరుణ్ రహేజా. రైతుల ఆత్మహత్యలు, టొమాటోలు కోసిన ధరలు కూడా రావని పంటను వదిలేయడం వంటి వార్తలు తనను కలచి వేశాయి. పంటను నిల్వ చేసుకోగలిగితే రైతుల నష్టాలు, మరణాలను నివారించవచ్చనుకున్నాడు. కరెంట్ లేని ప్రదేశాల్లో కూడా ఉపయోగకరంగా ఉండడానికి సూర్యరశ్మితో పనిచేసే సోలార్ డ్రైయర్‌ను రూపొందించాడు. గత వేసవిలో కిలో రెండున్నర రూపాయల చొప్పున సేకరించిన టొమాటోలను డ్రైయర్‌లో ఎండబెట్టి తన ప్రయోగ ఫలితాన్ని నిరూపించాడు వరుణ్. యువతలో సామాజిక స్పృహ మెండుగా ఉన్నప్పుడు, చదువుతో వచ్చిన జ్ఞానం తన ఉన్నతితోపాటు సామాజికాభివృద్ధికి కూడా దోహదం చేయాలనే ఆలోచన ఉన్నప్పుడు మాత్రమే ఇలాంటి ప్రయోగాలు సాధ్యమవుతాయి. వరుణ్ చేసిన ప్రయోగం వ్యవసాయరంగానికి మేలు చేస్తోంది.

ఆలోచన... ఆసక్తి!

''నేలలో నాటిన విత్తనం నుంచి ఒక చెట్టు మొలవడం, అది పెద్దయి... పూత పూసి కాయ కాచి అది పండే వరకు ప్రతిదీ ప్రకృతి చేసే అద్భుతమే. పంటను, పొలాన్ని సంరక్షించడంలో రైతు పడే కష్టాన్ని కొలవడానికి ఏ పరికరమూ ఉండదు. అలాంటిది పండించిన పంటను చేతులారా నేలపాలు చేసేటప్పుడు రైతు అనుభవించే ఆవేదన ఎలాంటిదో నాకు తెలియదు, కానీ ఆ పంట నేలపాలవుతుంటే నా మనసు మౌనంగా రోదించేది. పంటను నిల్వ చేసుకునే అవకాశం ఉంటే ఆ రైతు తన చేతులారా పండించిన పంటను అలా నేలపాలు చేయడు కదా అనిపించేది. ఈ ఆలోచనలు నేను మెకానికల్ ఇంజనీర్‌గా ఇంటర్న్‌షిప్ చేస్తున్న సమయంలో ఒక కొలిక్కి వచ్చాయి. పోషకాలు వృథా కాని విధంగా పండ్లు, కాయల్లోని తేమను సహజంగా తొలగించగలిగితే పంటను నిల్వ చేయవచ్చు. అది సౌరశక్తితో సాధ్యమని తెలిసిన తర్వాత నా ప్రయత్నాలను ముమ్మరం చేశాను. సోలార్ డ్రైయర్‌ను రూపొందించడంతోపాటు అన్ని రకాల రైతులకు అది అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఒక ప్రదేశంలో స్థిరంగా ఉండే పాలీ హౌస్‌తోపాటు ఇరవై కిలోల నుంచి వంద కిలోల కెపాసిటీ గలిగిన పోర్టబుల్ డ్రైయర్‌లను కూడా రూపొందించాను. వీటిని ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లవచ్చు.




సోలార్ డ్రైయర్

మేధ సమాజానికి ఉపయోగపడాలి!

నేను చేసే పని నాకు నచ్చినదై ఉండాలి. ఒకరు చెప్పిన పని చేయడానికి నా మేధను పరిమితం చేయడం నాకిష్టం లేదు. నేను చేసే పని సమాజానికి ఉపయోగపడేదై ఉంటే అందులో లభించే సంతృప్తి అనంతం. టొమాటోల ధరలు వార్తల్లో ఉండడాన్ని చూస్తూనే పెరిగాను. రైతన్నల శ్రమకు ఫలితం కొనుగోలు చేసే వ్యాపారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటోంది. పండించిన రైతులు ఎప్పుడూ అనిశ్చితిలోనే ఉంటున్నారు. సప్లయ్ చైన్ దళారులతో నిండిపోయి, రైతుకు ఉపయుక్తంగా లేకపోవడమే ఇందుకు కారణం. పొలంలో పండిన పంట వంటగదికి చేరేలోపు వివిధ దశల్లో 30 నుంచి 40 శాతం వృథా అవుతోంది. ఆ వృథాని అరికట్టడం, పండించిన రైతుకు తన పంటకు తగిన ధర నిర్ణయించగలిగే స్థితి కల్పించడం నా లక్ష్యం. అందుకే పంటను ఎండబెట్టి నిల్వ చేసే ఇండస్ట్రీని స్థాపించాను'' అన్నాడు తన ప్రయోగాల కోసం రహేజా సోలార్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించిన వరుణ్ రహేజా. వరుణ్ కొత్త పరికరాల రూపకల్పనలో నిమగ్నమై ఉంటే, అతడు నెలకొల్పిన పరిశ్రమను తల్లి బబిత నిర్వహిస్తున్నారు.

కిచెన్ టిప్స్

- కూర అడుగంటినప్పుడు రెండు మూడు ఐస్ క్యూబ్స్‌ను వేసి కరిగేంత వరకు తిప్పాలి. ఇలా చేస్తే పాత్రకు అంటుకున్నది విడిపోయి కూర అడుగంటకుండా ఉంటుంది.



- కిచెన్‌లో నూనె ఒలికిపోతే వెంటనే ఒలికిన నూనె మీద గోధుమ పిండి చల్లాలి. ఐదు నిమిషాల తరువాత పేపర్‌తో తుడిస్తే నూనె పడిన ప్రాంతం జిడ్డులేకుండా శుభ్రం పడుతుంది.
- వర్షాకాలంలో వాతావరణంలోని తేమను పీల్చుకుని... డోర్లు వేసినప్పుడు, తీసినప్పుడు కిర్రుమని శబ్దాలు చేస్తుంటాయి. డోర్లను పట్టి ఉంచే బోల్టుల వద్ద కొద్దిగా టాల్కం పౌడర్ చల్లడం వల్ల లేదా కొవ్వొత్తిని రుద్దడం వల్ల ఆ శబ్దాలు రాకుండా ఉంటాయి.



- ఈ వర్షాకాలంలో ఇలా కడగడం వల్ల పండ్లు, కూరగాయలు త్వరగా పాడవకుండా ఉండాలంటే.. వేడినీళ్లలో రెండు టేబుల్ స్పూన్ల వెనిగర్ వేసి కలపాలి. ఈ నీటిలో పండ్లు, కూరగాయలను పదిహేను నిమిషాలు ఉంచి, తరువాత సాధారణ నీటితో కడిగేయాలి.

రోల్ మోడల్

అనుభవం నేర్పిన పాఠం ఊరకే పోదు.
వివిధ రంగాలలో ఎన్నో సంవత్సరాలు పనిచేసిన రాధిక అగర్వాల్ తడబడుతూనే వ్యాపారప్రపంచంలోకి అడుగుపెట్టింది. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘన విజయం సాధించింది.
యూనికార్న్ క్లబ్‌లోకి అడుగు పెట్టిన మహిళా వ్యాపారవేత్తగా అరుదైన ఘనతను సొంతం చేసుకుంది...

ఆత్మవిశ్వాసమే గెలుపు మంత్రం



రాధిక అగర్వాల్

రాధిక అగర్వాల్ తండ్రి సైన్యంలో పనిచేసేవారు. తండ్రి ఉద్యోగరీత్యా జోధ్‌పూర్ నుంచి అహ్మద్‌నగర్ వరకు ఎన్నో చోట్ల చదువుకుంది రాధిక. వాషింగ్టన్ యూనివర్శిటీలో ఎంబీయే చేసిన రాధిక అగర్వాల్‌కు ఎంటర్‌ప్రెన్యూర్‌గా పెద్ద పేరు తెచ్చుకోవాలనే కల ఉండేది. అడ్వర్‌టైజింగ్, పబ్లిక్ రిలేషన్‌లలో పోస్ట్-గ్రాడ్యుయేషన్ కూడా చేసింది.

'చదువు ద్వారా ఎన్నో విషయాలను నేర్చుకున్నాను. ఇక వ్యాపారంలోకి నిస్సందేహంగా అడుగు పెట్టవచ్చు' అనుకోలేదు ఆమె.

అనుభవ జ్ఞానం విలువ ఏమిటో రాధిక అగర్వాల్‌కు తెలియనిదేమీ కాదు.

చదువు పూర్తయిన తరువాత లైఫ్‌స్టైల్, ఇ-కామర్స్, ఫ్యాషన్, పబ్లిక్ రిలేషన్స్, రిటైల్ రంగాలలో 14 సంవత్సరాల పాటు పనిచేసింది.

ఎన్నో రంగాలలో ఎంతో అనుభవాన్ని సంపాదించిన రాధిక అగర్వాల్ ఛండీగఢ్‌లో ఒక యాడ్ ఏజెన్సీకి శ్రీకారం చుట్టింది. ఆ తరువాత ప్రవాస భారతీయుల కోసం 'ఫ్యాషన్ క్లూస్' పేరుతో ఒక వెబ్‌సైట్ మొదలు పెట్టింది. మొదటి రెండు వ్యాపారాల విషయం ఎలా ఉన్నా...

ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ 'షాప్ క్లూస్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయకేతనం ఎగరేసింది రాధిక అగర్వాల్. రెండు సంవత్సరాల క్రితం బ్యూటీ, న్యూట్రీషన్, హోమ్‌కేర్‌కు సంబంధించి ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్ 'కైండ్ లైఫ్' ప్రారంభించి మరోసారి విజయం సాధించింది.

'ఒకసారి వెనక్కి చూస్తే... విజయాల కంటే వైఫల్యాలే ఎక్కువ కనిపిస్తాయి. అవి ఎప్పుడూ నన్ను హెచ్చరిస్తూనే ఉంటాయి. జాగ్రత్తగా ఉండమని చెబుతాయి. వ్యాపారంలో విజయానికి వినియోగదారులకు మనపై ఉండే విశ్వాసం అనేది ముఖ్యం. అది గెలుచుకుంటే కచ్చితంగా గెలుపు మనదే. దీనికి వ్యూహాల కంటే మన నిజాయితీ అనేది ముఖ్యం. వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొనడం ద్వారానే ఇంత పెద్ద విజయాన్ని సాధించగలిగాం' అంటుంది రాధిక అగర్వాల్.

ప్రతి సంవత్సరం 'ఉమెన్స్ డే' సందర్భంగా ఎక్కడో ఒకచోట మహిళలతో సమావేశం నిర్వహించి తన వ్యాపార ప్రస్థానాన్ని వారితో పంచుకుంటుంది. అగర్వాల్ స్ఫూర్తితో ఎంతోమంది మహిళలు వ్యాపారవేత్తలుగా విజయం సాధించారు.

'వ్యాపారంలో విజయం సాధించాలంటే ఉత్సాహం మాత్రమే సరిపోదు. బరిలోకి దిగే ముందు మన గురించి మనం విశ్లేషించుకోవాలి. ఎంతోమందితో మాట్లాడాలి. అయినా సరే, ఎప్పటికప్పుడు ఒక కొత్త సవాలు ఎదురవుతూనే ఉంటుంది. దానికి జవాబు చెప్పి ముందుకు కదలాలి. దీనికి కావాల్సింది ఆత్మవిశ్వాసం' అంటుంది రాధిక అగర్వాల్.

బ్యూటిప్



పొట్టు ఉన్న పెసర పప్పుని నాలుగు టీస్పూన్లు తీసుకుని రెండు గంటలు నానబెట్టి పేస్టు చేయాలి. ఈ పేస్టులో టీస్పూను ఆరెంజ్ పీల్ పొడి, టీస్పూను గంధం పొడి వేసి చక్కగా కలపాలి. ఈ పేస్టుని ముఖానికి పూతలా వేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత కొద్దిగా నీటితో తడిచేసి మర్దన చేసి కడిగేయాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేసుకుంటే ముఖం కాంతిమంతంగా, అందంగా కనిపిస్తుంది.

ఇన్‌కమ్ టాక్స్ ఫ్రాడ్



పాన్‌కార్డ్ ఉన్న సభ్యులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు సోషల్ ఇంజినీరింగ్ మోసాలకు పాల్పడుతున్నారు. స్కామర్లు అధికారులుగా నటిస్తూ చేసే మోసాల వల్ల బాధితులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.

డిజిటల్ టెక్నాలజీ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. మోసగాళ్లు కూడా దానిని వీలైనంతగా ఉపయోగించుకోవాలని చూస్తున్నారు. పన్ను చెల్లింపుదారులను లక్ష్యంగా చేసుకున్న మోసగాళ్లు అమాయకులను మోసగించడానికి రకరకాల వ్యూహాలను ఉపయోగిస్తున్నారు.

బాధితుల ఆదాయం ప్రకారం తగినంత పన్ను చెల్లించకపోవడం, ఎక్కువ పన్ను చెల్లించడం వల్ల వాపసు వస్తుందని, సమయానికి పన్ను చెల్లించలేదనే కారణంతో .. ఈ మోసాలను ఎంచుకుంటారు.

రెండేళ్లుగా పెరిగిన మోసాలు

మన దేశంలో గతంతో పోల్చితే ఈ రెండేళ్లలో పన్నులకు సంబంధించిన స్కామ్‌లు గణనీయంగా పెరిగినట్టు నివేదికలు ఉన్నాయి. స్కామర్లు పన్ను చెల్లింపుదారుల భయాన్ని వాడుకుంటున్నారు. తక్కువ పన్ను చెల్లించారని, అధిక ఆదాయం ఉందని.. టాక్స్ కట్టకపోతే కటకటాలు లెక్కించాల్సి వస్తుందని అధికారుల వలె నటిస్తున్నారు. అంతేకాదు, భారీ పెనాల్టీ పడకుండా ఉండాలంటే త్వరగా టాక్స్ చెల్లించమనే విషయాలు చెబుతూ నమ్మబలికిస్తారు.

స్కామర్లు ఉపయోగించే సాధారణ పద్ధతులు

- నకిలీ అధికారిక లెటర్ హెడ్‌లు, లోగోలు, నిజమైన ఆదాయపు పన్ను శాఖను పోలి ఉండే ఈమెయిల్ చిరునామాలతో స్పూఫ్ ఈమెయిల్స్‌ను ఉపయోగిస్తారు. వీటిని పాటించడంలో విఫలమైతే చట్టపరమైన చర్యలు, అరెస్టులు, ఇన్‌కమ్‌టాక్స్ దాడులు జరుగుతాయనే స్కామర్ల వాదనలను బాధితులు నమ్ముతారు.
- మోసపూరిత ఆదాయపు పన్ను వెబ్‌సైట్స్ వినియోగదారులను, వారి వ్యక్తిగత సమాచారాన్ని నమోదు చేయడం, చెల్లింపు చేయడం వంటివి చేస్తాయి.
- స్కామర్లు పన్ను అధికారులుగా నటిస్తూ మోసపూరిత ఆదాయపు పన్ను కార్యాలయం ఫోన్ నంబర్ల నుండి కాల్స్ చేస్తున్నట్టు చెబుతారు. పన్ను చెల్లింపుదారులను బెదిరించడం ద్వారా వారి డిమాండ్‌లను పాటించడంలో విఫలమైతే చట్టపరమైన చర్యలు, జరిమానాలు లేదా అరెస్ట్‌లు చేస్తామని బెదిరిస్తారు. ఇది నిజమని భావించి, బాధితులు తమ వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేస్తారు. ఇబ్బందుల్లో పడకుండా ఉండటానికి వెంటనే చెల్లింపు కూడా చేస్తారు.
- స్కామర్లు వాగ్దానం చేసిన విధంగా ఎక్కువ మొత్తం కాకుండా సులభ పద్ధతిలో 'ప్రాసెసింగ్ ఫీజు, పెనాల్టీ' వంటి వాటి కోసం వెంటనే చెల్లించమని అడుగుతారు. సాధారణంగా క్రిప్టో కరెన్సీ లేదా ప్రీపెయిడ్ కార్డ్‌ల వంటి సాంప్రదాయేతర పద్ధతుల ద్వారా చెల్లింపులు అడుగుతారు. లావాదేవీలను గుర్తించడం కష్టమవుతుంది. వెంటనే చెల్లిస్తే పన్ను రిటర్న్ అవుతుందనే వాగ్దానం కూడా చేస్తారు. స్కామర్ల రిక్వెస్టుకు సహకరించేలా వ్యక్తులను ఏమార్చేందుకు ఈ వాగ్దానాలను చేస్తారు.



- టాక్స్ రిఫండ్ మొత్తాన్ని క్లెయిమ్ చేసుకోవడానికి బ్యాంకు ఖాతా, ఇతర వ్యక్తిగత వివరాలు ఇవ్వవలసిందిగా మెసేజులు, మెయిళ్లు వస్తుంటాయి.

ఈ మోసం నుంచి రక్షించుకోవాలంటే..

- వెబ్‌సైట్ (ఏపీకే, డీఎమ్‌జెడ్ ఫైల్స్)ల నుండి ఎటువంటి అప్లికేషన్లను డౌన్‌లోడ్ చేయవద్దు. ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ నుండి మాత్రమే యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- తెలియని ఈమెయిల్స్, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఇన్‌కమ్‌టాక్స్ అధికారుల నుండి అన్ని అధికారిక కమ్యూనికేషన్ పోస్ట్, మెయిల్ ద్వారా అధికారిక ఈమెయిల్ నుండి పంపిస్తారు. జీమెయిల్ నుంచి కాదని గ్రహించాలి.
- ఈ మెయిల్‌కి జోడించిన ఏదైనా లింక్‌ని ఓపెన్ చేయడానికి ముందు పూర్తి ఈమెయిల్ హెడర్‌ని చూసి, నిర్ధారించుకోండి.

(a) https://mxtoolbox.com/EmailHeaders.aspx
(b) https://dnschecker.org/email-header-analyzer.php

ఎసెమ్మెస్‌లలో వచ్చే లింక్స్‌ను https://smsheader.trai.gov.in/లో లాగిన్ చెక్ చేయాలి.

- ఎసెమ్మెస్, వాట్సప్‌లలో వచ్చిన షార్ట్ లింక్‌లపై ఎప్పుడూ క్లిక్ చేయకూడదు. వాటిని ఓపెన్ చేయడానికి ముందుగా (https://www.unshorten.it లేదా https://www.checkshorturl.com) చెక్ చేయండి. ఫిషింగ్ లింక్స్ కావని https://isitphishing.org/ or https://www.urlvoid.com/ నిర్ధారించుకోండి.
- ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ మీ పాన్ నెంబర్, బ్యాంక్‌వివరాలు, ఓటీపీ వంటి ముఖ్యమైన సమాచారాన్ని ఇమెయిల్ లేదా ఫోన్ ద్వారా ఎప్పుడూ అడగదు. మిమ్మల్ని అలాంటి సమాచారం కోసం ఎవరైనా సంప్రదిస్తే వాటికి స్పందించకూడదు.
- ఏదైనా వ్యక్తిగత సమాచారాన్ని ఇచ్చే ముందు వెబ్‌సైట్ యుఆర్‌ఎల్‌ను ధృవీకరించుకోవాలి. మన దేశంలో ఆదాయపు పన్ను శాఖ అధికారక వెబ్‌సైట్ https://www.incometaxindia.gov.in
- అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఫీజులు, పెనాల్టీలు లేదా క్లెయిమ్ రీఫండ్‌లను చెల్లించాలి. వెబ్‌సైట్ https://www.incometax.gov.in
- ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్స్, వార్తా మూలాలను క్రమం తప్పకుండా చెక్ చేయడం ద్వారా తాజా స్కామ్‌లు, మోసాల వ్యూహాలు మీకు తెలుస్తాయి.

మోసాన్ని రిపోర్ట్ చేయాలంటే..

- మీకు అనుమానాస్పద మెసేజ్, ఈమెయిల్ లేదా ఫోన్ కాల్ వస్తే, దాన్ని వెంటనే ఆదాయపు పన్ను శాఖ లేదా స్థానిక పోలీస్ అధికారులకు తెలియజేయండి. ఈమెయిల్ లేదా వెబ్‌సైట్ webmanager@incometax.gov.in కి ఫార్వార్డ్ చేయండి.
- ఏదైనా పేమెంట్ UPI ద్వారా చెల్లించేటప్పుడు డబ్బు పోయినట్లయితే, టోల్-ఫ్రీ నంబర్ 14448కి కాల్ చేయండి లేదా https://cms.rbi.org.inలో రిపోర్ట్ చేయండి. లేదా CRPC@rbi.org.inకి ఇమెయిల్ చేయండి.
- మీరు బాధితులైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి కాల్ చేయండి. లేదా https://www.cybercrime.gov.in ఫిర్యాదు చేయండి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



రెండో రౌండ్‌లో అంకిత

ప్రాగ్ ఓపెన్ డబ్ల్యూటీఏ-250 టెన్నిస్ టోర్నీలో భారత మహిళా స్టార్ అంకిత రైనా శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో అంకిత 3-6, 6-3, 6-4తో డబుల్స్ ప్రపంచ మాజీ నంబర్‌వన్ బార్బరా స్ట్రికోవా (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించింది. 2 గంటల 25 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 71వ ర్యాంక్ లిండా నొస్కోవా (చెక్ రిపబ్లిక్)తో అంకిత ఆడుతుంది.

హంపి, హారిక విజయం





అజర్‌బైజాన్‌లో జరుగుతున్న ప్రపంచకప్ చెస్ టోర్నీ మహిళల విభాగం రెండో రౌండ్ తొలి గేముల్లో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక గెలుపొందారు. భారత్‌కే చెందిన నూతక్కి ప్రియాంకతో జరిగిన గేమ్‌లో హంపి 44 ఎత్తుల్లో... మిచలినా (పోలాండ్)తో జరిగిన గేమ్‌లో హారిక కూడా 44 ఎత్తుల్లో విజయం సాధించారు. ఓపెన్ విభాగంలో ఇరిగేశి అర్జున్, కార్తీక్ వెంకటరామన్, నారాయణన్, విదిత్ తమ ప్రత్యర్థులతో గేమ్‌లను 'డ్రా' చేసుకోగా... గుకేశ్, అభిమన్యు గెలుపొందారు.

భారత్ బల ప్రదర్శన



వెస్టిండీస్‌పై తొలి రెండు వన్డేల్లో ప్రదర్శన భారత జట్టు ఆటతీరుపై సందేహాలు రేకెత్తించినా... తమ స్థాయి ఏమిటో చివరి పోరులో టీమిండియా చూపించింది. ఇద్దరు స్టార్ బ్యాటర్లు ఆడకపోయినా, ప్రత్యర్థిని చిత్తు చేయగల సత్తా తమకుందని నిరూపించింది. ఆఖరి వన్డేలో భారీ విజయంతో సిరీస్‌ను సొంతం చేసుకున్న జట్టు ఇప్పుడు టి20 పోరుకు సిద్ధమైంది. ఇక్కడా సీనియర్లు లేకపోవడంతో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు యువ ఆటగాళ్లకు ఇది సరైన అవకాశం.

- చివరి వన్డేలో భారీ విజయం
- 200 పరుగులతో చిత్తయిన వెస్టిండీస్
- 2-1తో సిరీస్ టీమిండియా సొంతం

తరూబా (ట్రినిడాడ్): వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ గెలుచుకుంది. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మూడో వన్డేలో భారత్ 200 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. 352 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ 35.3 ఓవర్లలో 151 పరుగులకే కుప్పకూలింది. గుడకేశ్ మోతీ (34 బంతుల్లో 39 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా, అలిక్ అతనజ్ (50 బంతుల్లో 32; 3 ఫోర్లు), అల్జారి జోసెఫ్ (39 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కొద్దిగా పోరాడగలిగారు. శార్దుల్ ఠాకూర్ వన్డేల్లో తన అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన (4/37) నమోదు చేయగా, ముకేశ్ 3, కుల్దీప్ 2 వికెట్లు తీశారు. శుబ్‌మన్ గిల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా, ఇషాన్ కిషన్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు. 2007 నుంచి ఇప్పటి వరకు వెస్టిండీస్‌పై భారత్‌కు ఇది వరుసగా 13వ వన్డే సిరీస్ విజయం కావడం విశేషం.

పదునైన బౌలింగ్‌తో చెలరేగిన పేసర్ ముకేశ్ కుమార్ తొలి మూడు వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అతని ధాటికి కింగ్ (0), మేయర్స్ (4), హోప్ (5) అవుట్ కావడంతో స్కోరు 17/3 వద్ద నిలిచింది. ఆ తర్వాత విండీస్ ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. పదేళ్ల తర్వాత తొలి వన్డే ఆడిన ఉనాద్కట్... కార్టీ (6)ని అవుట్ చేయగా... తన వరుస ఓవర్లలో శార్దుల్ రెండు వికెట్లు తీయడంతో స్కోరు 50/6కు చేరింది. అనంతరం తన వరుస ఓవర్లలో కుల్దీప్ తర్వాతి 2 వికెట్లు పడగొట్టాడు. ఈ దశలో మోతీ, జోసెఫ్ కొద్ది సేపు పట్టుదల కనబర్చి తొమ్మిదో వికెట్‌కు 60 బంతుల్లో 55 పరుగులు జోడించారు. అయితే ఈ జోడీని విడదీసిన శార్దుల్ తన తర్వాతి ఓవర్లో ఆఖరి వికెట్ కూడా తీసి విండీస్ ఆట ముగించాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: 351/5; వెస్టిండీస్ ఇన్నింగ్స్: కింగ్ (సి) ఇషాన్ (బి) ముకేశ్ 0; మేయర్స్ (బి) ముకేశ్ 4; అతనజ్ (బి) కుల్దీప్ 32; హోప్ (సి) గిల్ (బి) ముకేశ్ 5; కార్టీ (సి) గిల్ (బి) ఉనాద్కట్ 6; హెట్‌మైర్ (సి) సూర్యకుమార్ (బి) శార్దుల్ 4; షెఫర్డ్ (సి) ఉనాద్కట్ (బి) శార్దుల్ 8; కారియా (ఎల్బీ) (బి) కుల్దీప్ 19; జోసెఫ్ (సి) ఇషాన్ (బి) శార్దుల్ 26; మోతీ (నాటౌట్) 39; సీల్స్ (బి) శార్దుల్ 1; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (35.3 ఓవర్లలో ఆలౌట్) 151.

వికెట్ల పతనం: 1-1, 2-7, 3-17, 4-35, 5-40, 6-50, 7-75, 8-88, 9-143, 10-151. బౌలింగ్: ముకేశ్ 7-1-30-3, హార్దిక్ 4-1-13-0, శార్దుల్ 6.3-0-37-4, ఉనాద్కట్ 5-0-16-1, కుల్దీప్ 8-3-25-2, జడేజా 5-1-29-0.

తిలక్‌వర్మకు అవకాశం దక్కేనా!

- నేడు తొలి టి20 మ్యాచ్
- రాత్రి గం.8.00 నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



టెస్టు, వన్డే సిరీస్ తర్వాత భారత్, వెస్టిండీస్ మధ్య టి20 పోరుకు రంగం సిద్ధమైంది. ఆఖరి వన్డే జరిగిన వేదికపైనే నేడు తొలి పోరు జరగనుంది. రాబోయే రోజుల్లో వరల్డ్ కప్ వరకు పూర్తిగా వన్డేలపైనే భారత్ దృష్టి పెట్టనున్న నేపథ్యంలో టి20 ఫార్మాట్‌లో తమ స్థానం పటిష్టం చేసుకోవాలనుకునే యువ ఆటగాళ్లకు ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్ కీలకం కానుంది. రోహిత్, కోహ్లిలకు ముందే విశ్రాంతినివ్వడంతో ఈ సిరీస్‌లోనూ హార్దిక్ పాండ్యా నాయకత్వంలో భారత్ బరిలోకి దిగుతోంది. తుది జట్టు కూర్పును చూస్తే ప్రధాన బ్యాటర్లుగా ఇషాన్ కిషన్, యశస్వి, గిల్, సామ్సన్, సూర్యకుమార్ బరిలోకి దిగడం ఖాయం. ఇద్దరు ఆల్‌రౌండర్లుగా హార్దిక్, అక్షర్‌లకు కూడా చోటు తప్పనిసరి. అయితే వీరిద్దరు పూర్తి స్థాయి కోటా బౌలింగ్ చేయగలరు కాబట్టి భారత్ నలుగురు రెగ్యులర్ బౌలర్లను ఆడిస్తుందా లేక ముగ్గురు బౌలర్లనే ఆడించి మరో బ్యాటర్‌తో ఆరో స్థానాన్ని భర్తీ చేస్తుందా చూడాలి. అదే జరిగితే హైదరాబాదీ బ్యాటర్ ఠాకూర్ తిలక్ వర్మ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయవచ్చు. బౌలింగ్ దళంలో నలుగురు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్లు జట్టుకు అందుబాటులో ఉన్నారు. మరోవైపు విండీస్ ఈ ఫార్మాట్‌లోనైనా కొంత మెరుగైన ఆటతీరు కనబర్చాలని కోరుకుంటోంది. హెట్‌మైర్, పావెల్, పూరన్, చార్లెస్, మేయర్స్ ఎలాంటి మెరుపు ప్రదర్శన చూపిస్తారనేది ఆసక్తికరం.

భవానికి కాంస్యం



చెంగ్డూ (చైనా): ప్రపంచ విశ్వ విద్యాలయాల క్రీడల్లో బుధవారం భారత్‌కు రెండు పతకాలు లభించాయి. షూటింగ్‌లో ఇలవేనిల్ వలారివన్-దివ్యాంశ్ సింగ్ పన్వర్ జోడీ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో రజతం సాధించగా... అథ్లెటిక్స్‌లో మహిళల లాంగ్‌జంప్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భగవతి భవాని యాదవ్ కాంస్య పతకాన్ని గెల్చుకుంది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఫైనల్లో ఇలవేనిల్-దివ్యాంశ్ ద్వయం 13-17తో యు జాంగ్-బుహాన్ సాంగ్ (చైనా) జోడీ చేతిలో ఓడిపోయింది. లాంగ్‌జంప్ ఫైనల్లో విజయవాడకు చెందిన భవాని యాదవ్ 6.32 మీటర్ల దూరం దూకి మూడో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం భారత్ 11 స్వర్ణాలు, 5 రజతాలు, 7 కాంస్యాలతో కలిపి మొత్తం 23 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది.

ఫైనల్లో జ్యోతి సురేఖ బృందం



బెర్లిన్ (జర్మనీ): ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో వెన్నం జ్యోతి సురేఖ, అదితి, పర్‌నీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన టీమ్ ఈవెంట్‌లో రెండో సీడ్‌గా నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన భారత జట్టు 230-228తో తుర్కియే జట్టుపై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరింది. క్వార్టర్ ఫైనల్లో టీమిండియా 228-226తో చైనీస్ తైపీపై, సెమీఫైనల్లో 220-216తో కొలంబియాపై నెగ్గి ఫైనల్లోకి అడుగు పెట్టింది. శుక్రవారం జరిగే ఫైనల్లో మెక్సికోతో భారత్ ఆడుతుంది. తాజా ప్రదర్శనతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి సురేఖకు ఈ మెగా ఈవెంట్ చరిత్రలో ఆరో పతకం ఖరారైంది. విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ టీమ్ విభాగంలో రెండు రజతాలు (2021, 2017), ఒక కాంస్యం (2019)... వ్యక్తిగత విభాగంలో ఒక రజతం (2021), ఒక కాంస్యం (2019) సాధించింది. పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్, రజత్ చౌహాన్, తుషార్‌లతో కూడిన భారత జట్టు క్వార్టర్ ఫైనల్లో 1-5తో దక్షిణ కొరియా చేతిలో ఓడిపోయింది.

టైటిల్ లక్ష్యంగా...

- ఆసియా చాంపియన్స్ ట్రోఫీ బరిలో భారత్
- నేడు చైనాతో తొలి పోరు



సాక్షి, చెన్నై: స్వదేశంలో తొలిసారి జరుగుతున్న ఆసియా పురుషుల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో టైటిల్ సాధించడమే లక్ష్యంగా భారత జట్టు బరిలోకి దిగనుంది. ఆరు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీకి గురువారం ఎగ్మోర్‌లోని మేయర్ రాధాకృష్ణన్ స్టేడియంలో తెర లేవనుంది. భారత్‌తోపాటు పాకిస్తాన్, చైనా, మలేసియా, జపాన్, దక్షిణ కొరియా జట్లు ఈ టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. తొలి రోజు కొరియాతో జపాన్ (సాయంత్రం గం. 4 నుంచి); మలేసియాతో పాకిస్తాన్ (సాయంత్రం గం. 6:15 నుంచి); చైనాతో భారత్ (రాత్రి గం. 8:30 నుంచి) పోటీపడతాయి. భారత్, పాక్ మ్యాచ్ ఆగస్టు 9న జరుగుతుంది. ఆరు జట్ల మధ్య ముందుగా రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో మ్యాచ్‌లను నిర్వహిస్తారు. టాప్-4లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరుకుంటాయి. సెమీఫైనల్స్‌లో నెగ్గిన జట్లు ఆగస్టు 12న ఫైనల్లో తలపడతాయి. మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్ ఫస్ట్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

శ్రీకాంత్, సింధు ముందంజ

- ప్రణయ్, ప్రియాన్షు కూడా
- ప్రపంచ ఏడో ర్యాంకర్‌పై మిథున్ గెలుపు



సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, ప్రియాన్షు రజావత్, మిథున్ మంజునాథ్, కిరణ్ జార్జ్... మహిళల సింగిల్స్ విభాగంలో పీవీ సింధు, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌లో గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో శ్రీకాంత్ 21-18, 21-7తో ప్రపంచ 14వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్)పై, ప్రణయ్ 21-18, 16-21, 21-15తో లీ చెయుక్ యు (హాంకాంగ్)పై, ప్రియాన్షు 21-12, 21-16తో నాథన్ టాంగ్ (ఆస్ట్రేలియా)పై నెగ్గారు. ప్రపంచ 50వ ర్యాంకర్ మిథున్ 21-19, 2-19తో ప్రపంచ ఏడో ర్యాంకర్, 2021 ప్రపంచ చాంపియన్ కీన్ యె లో (సింగపూర్)పై సంచలన విజయం సాధించగా... కిరణ్ జార్జ్ 5-0తో ఆధిక్యంలో ఉన్న దశలో అతని ప్రత్యర్థి లక్ష్య సేన్ గాయం కారణంగా వైదొలిగాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో సింధు 21-18, 21-13తో భారత్‌కే చెందిన అస్మిత చాలిహాపై నెగ్గగా... ఆకర్షి 21-15, 21-17తో గో జిన్ వె (మలేసియా)ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధుతో పోరుకు సిద్ధమైంది. భారత్‌కే చెందిన మాళవిక 20-22, 11-21తో పాయ్ యు పో (చైనీస్ తైపీ) చేతిలో, తస్నిమ్ 13-21, 7-21తో కొమాంగ్ అయు (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు.

సినిమా

మాటల్లేవ్.. కోతలే!


● రజనీకాంత్

రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'జైలర్'. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను ఏషియన్ మల్టీప్లెక్స్ సంస్థ రిలీజ్ చేస్తోంది. కాగా 'జైలర్' నుంచి 'జైలర్ షోకేస్' వీడియోను బుధవారం రిలీజ్ చేశారు. ఈ సినిమా తెలుగు వెర్షన్‌ను హీరో నాగచైతన్య షేర్ చేశారు. 'నువ్వు ఆయన్ను చూసింది ఓ పోలీసోడి తండ్రిగానే.. కానీ ఆయనలో నువ్వు చూడని ఇంకొకణ్ణి నేను చూశాను' (జాకీ ష్రాఫ్), 'ఒక రేంజ్ తర్వాత మన దగ్గర మాటలుండవ్.. కోతలే', 'ఇక్కడితో ఆపేయిచ్చుగా (రమ్యకృష్ణ)... 'బాగా దూరం పోయాను. ఫుల్లుగా పూర్తి చేస్తే కానీ మళ్ళీ రాను', 'హుకుమ్.. టైగర్ కా హుకుమ్' (రజనీ) అనే డైలాగ్స్ ఈ వీడియోలో ఉన్నాయి. ఈ చిత్రంలో రజనీ భార్యగా రమ్యకృష్ణ నటించారు. తమన్నా, సునీల్, మిర్నా మీనన్, యోగిబాబు, శివరాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటించగా, మోహన్ లాల్ ఓ అతిథి పాత్రలో నటించారు.

గెట్.. సెట్.. గో

షార్ట్ బ్రేక్ తీసుకున్నారు... ఫుల్లుగా రిలాక్స్ అయ్యారు. గెట్ సెట్ గో అంటూ హుషారుగా షూటింగ్‌లో పాల్గొనడానికి రెడీ అయ్యారు. కొంత గ్యాప్ తర్వాత సెట్స్‌లోకి అడుగుపెడుతున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.


● ఎన్టీఆర్


● అల్లు అర్జున్


● ప్రభాస్

బిజీ బిజీ

దాదాపు యాభై రోజులు యూఎస్‌లో గడిపి, ఇటీవలే హైదరాబాద్‌కు వచ్చారు ప్రభాస్. ఇక సినిమా షూటింగ్‌లతో బిజీ కావాలనుకుంటున్నారు. ఇందుకు తగ్గ యాక్షన్ ప్లాన్‌ను రెడీ చేసుకున్నారు. ప్రభాస్ చేతిలో ప్రస్తుతం 'కల్కి 2898 ఏడీ', 'రాజా డీలక్స్' (వర్కింగ్ టైటిల్), 'సలార్' చిత్రాలు ఉన్నాయి. ముందుగా 'కల్కి 2898 ఏడీ' షూటింగ్‌లో పాల్గొననున్నారట. మరో మూడు, నాలుగు రోజుల్లో ఈ చిత్రం కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించాలనుకుంటున్నారట. ఈ షెడ్యూల్‌లో ప్రధానంగా ప్రభాస్, దీపికా పదుకోన్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారని తెలిసింది. గతంలో చిత్ర యూనిట్ ప్రకటించిన ప్రకారం 'కల్కి 2898 ఏడీ' సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదల కావాల్సింది. అయితే వాయిదా పడుతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇక ప్రభాస్ మరో చిత్రం 'రాజా డీలక్స్' విషయానికి వస్తే.. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలనుకుంటున్నారట ప్రభాస్. మరోవైపు ప్రభాస్ డైరీలో ఉన్న 'సలార్' షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చింది. ఈ సినిమా తొలి భాగం 'సలార్: సీజ్ ఫైర్' సెప్టెంబరు 28న రిలీజ్ కానుంది. సో.. మలి భాగం షూటింగ్‌ని ఆరంభించడానికి ప్లాన్ చేస్తున్నారట. మొత్తం మీద ప్రభాస్ బిజీ బిజీ.

టార్గెట్ ఫిక్స్

'దేవర' సినిమా విషయంలో హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ స్పీడ్ మామూలుగా లేదు. ఈ సినిమా వరుస షూటింగ్ షెడ్యూల్స్ చకా చకా పూర్తవుతున్నాయి. అయితే గత నెల మూడో వారంలో ఓ యాక్షన్ షెడ్యూల్‌ను పూర్తి చేశాక ఈ టీమ్ చిన్న గ్యాప్ తీసుకుంది. రెండు వారాల గ్యాప్ తర్వాత ఎన్టీఆర్ మళ్లీ అంటే.. జూలై 31న 'దేవర' కొత్త షూటింగ్ షెడ్యూల్‌లో జాయిన్ అయ్యారు. ఈ కొత్త షెడ్యూల్ రెండు వారాలపాటు సాగుతుందని, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తారని తెలిసింది. పీటర్ హెయిన్స్ అండ్ టీమ్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేసిందట. ఈ షెడ్యూల్‌తో 'దేవర' మేజర్ యాక్షన్ పార్ట్ పూర్తవుతుందని, తదుపరి షెడ్యూల్స్‌లో ఇతర ప్రధాన తారాగణమైన ఈ చిత్రం విలన్ సైఫ్ అలీఖాన్, హీరోయిన్ జాన్వీ కపూర్ వంటివారు పాల్గొనగా, టాకీ పార్ట్‌ను షూట్ చేస్తారని తెలిసింది. నవంబరు కల్లా ఈ సినిమా షూటింగ్‌ని పూర్తి చేసేలా ఎన్టీఆర్ టార్గెట్ ఫిక్స్ చేసుకున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ఈ చిత్రం విడుదల కానుంది. షూటింగ్ కాస్త ముందుగానే ముగిసినా.. గ్రాఫిక్స్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కోసం 'దేవర' టీమ్ ఎక్కువ టైమ్ తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఇక 'దేవర' తర్వాత హిందీ 'వార్ 2', ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని చిత్రాలతో ఎన్టీఆర్ బిజీ అవుతారు.

ఏప్రిల్‌లో రిలీజ్?

హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప'. ఈ సినిమాలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సూపర్ డూపర్ హిట్ సాధించింది. ప్రస్తుతం మలి భాగం 'పుష్ప: ది రూల్' సెట్స్‌లో ఉంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌కు ఇటీవల కాస్త గ్యాప్ వచ్చింది. మళ్లీ ఈ నెల మొదటివారంలో 'పుష్ప: ది రూల్' సినిమాను సెట్స్ పైకి తీసుకుని వెళ్లాలని సుకుమార్ సన్నాహాలు చేశారని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో అల్లు అర్జున్ కూడా జాయిన్ అవుతారట. అలాగే 'పుష్ప: ది రూల్'ను తొలుత ఈ ఏడాది చివర్లో రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ షూటింగ్ షెడ్యూల్స్‌కి గ్యాప్ రావడంతో వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నారట. ఇక ఈ సినిమా కాకుండా... దర్శకుడు త్రివిక్రమ్‌తో ఓ సినిమా, 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్‌రెడ్డి వంగాతో ఓ సినిమాను అల్లు అర్జున్ కమిటైన సంగతి తెలిసిందే.

యాక్షన్.. కామెడీ.. ఎక్కడా తగ్గవు

- రాజ్ తరుణ్


● మాల్వీ, రాజ్ తరుణ్

''తిరగబడర సామీ' చిత్రం మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్. రవికుమార్ గారి గత సినిమాల్లానే ఈ మూవీలోనూ యాక్షన్, కామెడీ, రొమాన్స్ ఎక్కడా తగ్గకుండా ఉంటాయి. మా సినిమాని థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేయాలి'' అని రాజ్ తరుణ్ అన్నారు. ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రాజ్ తరుణ్ హీరోగా, మాల్వీ మల్హోత్రా, మన్నారా చోప్రా హీరోయిన్లుగా తెరకెక్కుతోన్న చిత్రం 'తిరగబడర సామీ'. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్‌పై మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ షూటింగ్ లొకేషన్‌లో చిత్ర యూనిట్ మీడియాతో సమావేశం అయ్యింది. ఏఎస్ రవికుమార్ చౌదరి మాట్లాడుతూ– ''ఎలాగైనా మళ్లీ హిట్టు కొట్టాలని కొంత విరామం తీసుకొని కసితో చేసిన సినిమా 'తిరగబడర సామీ'. ఒక బంధాన్ని నిలుపుకోవడం కోసం ప్రేమికులు, భార్యా భర్తలు ఎంతవరకూ వెళ్తారు? అనేది వినోదాత్మకంగా చూపించాం'' అన్నారు. ''ఈ నెలాఖరులో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ఈ సినిమాని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు మల్కాపురం శివకుమార్.

అది పెద్ద సవాల్

- డడ్లీ



''ఓ భాషలో హిట్ అయిన సినిమాని మరో భాషలో రీమేక్ చేయడం చాలా కష్టం. ఎందుకంటే.. ఒరిజినల్‌ని మ్యాచ్ చేస్తే సరిపోదు.. దానికంటే ప్రతి విషయంలోనూ ఒక అడుగు బెటర్‌గా ఉండాలి.. అది పెద్ద సవాల్. అందుకే 'భోళా శంకర్' విజువల్స్ విషయంలో జాగ్రత్తగా ఉన్నాం. ఒరిజినల్ ఫిల్మ్ 'వేదాలం' కంటే 'భోళా శంకర్' ఇంకా బాగుంటుంది'' అని కెమెరామేన్ డడ్లీ (రాజేంద్ర) అన్నారు. చిరంజీవి, తమన్నా జంటగా మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన చిత్రం 'భోళా శంకర్'. రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర కెమెరామేన్ డడ్లీ మాట్లాడుతూ– ''నా అసలు పేరు రాజేంద్ర. డడ్లీ నా ముద్దు పేరు. తమిళనాడులోని ఊటీ నా స్వస్థలం. తమిళనాడులో ఫిలిం టెక్నాలజీ చదువుకున్న తర్వాత ముంబైకి షిఫ్ట్ అయ్యాను. మెహర్ రమేష్, నేను పదేళ్లుగా స్నేహితులం. తనే 'భోళా శంకర్' అవకాశం ఇచ్చాడు. తెలుగులో ఇది నా మొదటి సినిమా. ఫుల్ ప్యాకేజ్ ఆఫ్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. చిరంజీవి గారు పెర్‌ఫెక్షనిస్ట్, చాలా పంక్చువల్. ఈ రెండు విషయాలు ఆయన్నుంచి నేర్చుకున్నాను. 'భోళా శంకర్'లో ఇంటర్వెల్ సీక్వెన్స్‌లో వచ్చే పెద్ద యాక్షన్ సీన్ తీయడం చాలా కష్టంగా అనిపించింది. నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా అన్నీ సమకూర్చారు'' అన్నారు.

రీల్స్

మత్స్యకారులతో మాటా మంతీ


● నాగచైతన్య

'ప్రేమమ్, సవ్యసాచి' వంటి చిత్రాల తర్వాత హీరో నాగచైతన్య, డైరెక్టర్ చందు మొండేటి కాంబినేషన్‌లో మూడో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ ఈ సినిమాను నిర్మించనున్నారు. శ్రీకాకుళం, గుజరాత్ నేపథ్యంలోని మత్స్యకారుల జీవితాలను ఆవిష్కరించేలా ఈ సినిమా కథ ఉంటుందట. ఇందులో చైతన్య మత్స్యకారుడిగా కనిపించనున్నారని సమాచారం. అందుకే మత్స్యకారులను స్వయంగా కలిసి వారి జీవిత విశేషాలను తెలుసుకునేందుకు వైజాగ్ వెళ్లారు నాగచైతన్య, చందు మొండేటి, 'బన్నీ' వాసు. మూడు రోజుల పాటు అక్కడే ఉండి పూర్తి వివరాలు తెలుసుకుంటారు. అలాగే సముద్ర యానం కూడా చేయాలనుకుంటున్నారు. ఇక ఈ మూవీకి 'తండెల్' అనే టైటిల్‌ని పరిశీలిస్తున్నట్లు టాక్. శ్రీకాకుళంలో మత్స్యకారులను తండెల్ అని పిలుస్తారట.

డేంజర్ పిల్లా...


● శ్రీలీల, నితిన్

'అరె బ్లాక్ అండ్ వైట్ సీతాకోక చిలుకవా.., ఒక ముళ్లు కూడా లేనే లేని రోజా పువ్వా.., డేంజర్ పిల్లా..' అని పాడుతున్నారు నితిన్. వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్, శ్రీలీల జంటగా నటిస్తున్న చిత్రం 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మేన్'. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్య మూవీస్–ఎంటర్‌టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హారిస్ జైరాజ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'డేంజర్ పిల్లా..' పాటను బుధవారం రిలీజ్ చేశారు. ఈ పాటను కృష్ణకాంత్ రాయగా అర్మాన్ మాలిక్ పాడారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు.

కృష్ణగాడు మంచి విజయం సాధించాలి


- ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్


● వినయ్ భాస్కర్, రిష్వి

''కృష్ణగాడు అంటే ఒక రేంజ్' చక్కటి కుటుంబ కథా చిత్రంగా రూపొందింది. మా వరంగల్ వాళ్లకి ఈ మూవీలో చాన్స్ ఇచ్చిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అని ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ జంటగా రాజేష్ దొండపాటి నటించిన చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పీఎన్‌కే శ్రీలత, పెట్లా రఘురామ్ మూర్తి నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి దాస్యం వినయ్ భాస్కర్, నిర్మాతలు కేఎల్ దామోదర్ ప్రసాద్, బెక్కం వేణుగోపాల్, రైటర్ ప్రసన్న కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై, సినిమా హిట్టవ్వాలని ఆకాంక్షించారు.

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

శాంసంగ్ టీవీ @ రూ.1,14,99,000



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం శాంసంగ్ తాజాగా అల్ట్రా లగ్జరీ మైక్రో ఎల్‌ఈడీ టీవీని భారత్‌లో ఆవిష్కరించింది. ధర రూ.1,14,99,000 ఉంది. 110 అంగుళాల సైజులో ఇది తయారైంది. 2.48 కోట్ల మైక్రోమీటర్ అల్ట్రా స్మాల్ ఎల్‌ఈడీలతో రూపుదిద్దుకుందని కంపెనీ తెలిపింది. ఎల్‌ఈడీలు సఫైర్ గ్లాస్‌తో తయారైనట్టు వెల్లడించింది. మైక్రో ఎల్‌ఈడీ సాంకేతికత మానవ కళ్ళు చూడగలిగే అంతిమ, హై-ఎండ్ పిక్చర్ స్వచ్ఛతను అందిస్తుందని తెలిపింది.

ఫార్చ్యూన్ గ్లోబల్ ర్యాంకుల్లో రిలయన్స్ ముందంజ

16 స్థానాలు ఎగసి 88కి చేరిక



న్యూఢిల్లీ: బిలియనీర్ ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ ఫార్చూన్ గ్లోబల్ 500, 2023 జాబితాలో మెరుగైన స్థానాన్ని సంపాదించింది. 16 స్థానాలు మెరుగుపడి 88వ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. 2022 జాబితాలో రిలయన్స్ స్థానం 104గా ఉండడం గమనించొచ్చు. భారత కంపెనీల్లో టాప్ ర్యాంకర్‌గా రిలయన్స్ నిలిచింది. 2021 నుంచి చూస్తే రిలయన్స్ అంతర్జాతీయంగా తన ర్యాంక్‌ని గణనీయంగా పెంచుకుంది. 2021లో రిలయన్స్ స్థానం 155గా ఉంది. ఇక ఈ ఏడాది ఫార్చూన్ 500 జాబితాలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 94వ స్థానాన్ని సంపాదించుకుంది. గతేడాదితో పోలిస్తే 48 మెట్లు పైకెక్కింది. ఎల్‌ఐసీ 9 స్థానాలు దిగజారి 107వ ర్యాంకుతో సరిపెట్టుకుంది. ఓఎన్‌జీసీ 158, బీపీసీఎల్ 233, ఎస్‌బీఐ 235 ర్యాంకులు దక్కించుకున్నాయి. టాటా మోటార్స్ ర్యాంక్ 33 స్థానాలు మెరుగుపడి 337కు చేరింది. రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ 84 స్థానాలు ముందుకు వచ్చి 353 ర్యాంకును సొంతం చేసుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఫార్చూన్ 500 జాబితాలో చోటు సంపాదించుకోవడం 20వ ఏడాది కావడం గమనార్హం.

బ్రాడ్‌బ్యాండ్ కస్టమర్లు పెరిగారు

- 117 కోట్ల టెలికం చందాదార్లు
- మొబైల్ సబ్‌స్క్రైబర్లు 114 కోట్లు: ట్రాయ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా టెలికం చందాదార్ల సంఖ్య 2023 మే నెల చివరినాటికి 117.257 కోట్లకు చేరింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ సంఖ్య 117.252 కోట్లు ఉంది. ఏప్రిల్‌తో పోలిస్తే మే నెల వృద్ధి కేవలం 0.004 శాతం మాత్రమేనని టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తాజా గణాంకాల్లో వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో టెలికం సబ్‌స్క్రైబర్ల సంఖ్య ఏప్రిల్‌తో పోలిస్తే 51.864 కోట్ల నుంచి 51.914 కోట్లకు ఎగసింది. పట్టణ ప్రాంతాల్లో వినియోగదార్ల సంఖ్య 65.388 కోట్ల నుంచి 65.343 కోట్లకు చేరింది. ఇక బ్రాడ్‌బ్యాండ్ మొత్తం చందాదార్ల సంఖ్య 85.094 కోట్ల నుంచి 85.681 కోట్లకు పెరిగింది.



వైర్‌లెస్ చందాదార్లు..: మొబైల్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య ఈ ఏడాది ఏప్రిల్‌లో 114.313 కోట్లు ఉంటే, మే నెలలో ఈ సంఖ్య 114.321 కోట్లకు చేరింది. రిలయన్స్ జియో కొత్తగా 30 లక్షల మందిని చేర్చుకోవడంతో సంస్థ మొత్తం మొబైల్ చందాదార్ల సంఖ్య 43.63 కోట్లను తాకింది. భారతీ ఎయిర్‌టెల్ నూతనంగా 13.2 లక్షల మందిని సొంతం చేసుకుంది. దీంతో ఈ కంపెనీ వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 37.23 కోట్లకు చేరుకుంది. వొడాఫోన్ ఐడియాను మే నెలలో 28 లక్షల మంది కస్టమర్లు వీడారు.

హార్లే ఎక్స్440 ధర పెంపు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హార్లే డేవిడ్సన్ ఎక్స్440 ధరను అన్ని వేరియంట్లలో రూ.10,500 పెంచినట్టు హీరో మోటోకార్ప్ బుధవారం ప్రకటించింది. ఎక్స్‌షోరూంలో పరిచయ ఆఫర్‌లో రూ.2.29-2.69 లక్షల ధరలో కంపెనీ ఈ మోడల్‌ను గత నెలలో ఆవిష్కరించింది. తాజా సవరణతో ప్రస్తుతం ఈ ధర రూ.2.39 లక్షల నుంచి ప్రారంభం. కొత్త ధర ఆగస్ట్ 4 నుంచి అమలులోకి రానుందని కంపెనీ వెల్లడించింది. 2023 నుంచి ఎక్స్440 డెలివరీలు ఉంటాయని వివరించింది.



భారీ లాభాల్లోకి ఇండిగో

- క్యూ1లో రూ. 3,091 కోట్లు
- ఆదాయంలోనూ కొత్త రికార్డ్

న్యూఢిల్లీ: విమానయాన రంగ దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. ఇండిగో బ్రాండు విమాన సర్వీసుల కంపెనీ ఏప్రిల్-జూన్(క్యూ1)లో టర్న్‌అరౌండ్ అయ్యింది. కొత్త రికార్డ్ సృష్టిస్తూ రూ. 3,091 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 1,064 కోట్ల నికర నష్టం ప్రకటించింది. ఈ బాటలో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా రూ. 17,161 కోట్ల టర్నోవర్ అందుకుంది. గత క్యూ1లో రూ. 13,019 కోట్ల ఆదాయం నమోదైంది. కాగా.. ఒక త్రైమాసికంలో రికార్డ్ సంఖ్యలో ప్రయాణికులను చేరవేయడం ద్వారా కంపెనీ చరిత్రలోనే అత్యధిక ఆదాయం, నికర లాభాలు సాధించినట్లు కంపెనీ సీఈవో పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు.జూన్ చివరికల్లా మొత్తం నగదు నిల్వలు రూ. 27,400 కోట్లను తాకినట్లు కంపెనీ వెల్లడించింది. వెంచర్ క్యాపిటల్(వీసీ) పెట్టుబడుల సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ తాజాగా పేర్కొంది. ఇందుకు బోర్డు అనుమతించినట్లు వెల్లడించింది.



ఫలితాల నేపథ్యంలో ఇండిగో షేరు బీఎస్‌ఈలో దాదాపు ఫ్లాట్‌గా రూ. 2,566 వద్ద ముగిసింది.

మార్కెట్లపై 'ఫిచ్' పంచ్

- అమెరికా రుణ రేటింగ్‌ను తగ్గించిన రేటింగ్ ఏజెన్సీ
- 677 పాయింట్లు నష్టపోయి 65 వేల దిగువకు సెన్సెక్స్
- ట్రేడింగ్ ఆద్యంతం అన్ని రంగాల షేర్లలో అమ్మకాలే



ముంబై: ప్రముఖ రేటింగ్ సంస్థ ఫిచ్ అమెరికా రుణ రేటింగ్‌ను తగ్గించడంతో బుధవారం ఈక్విటీ మార్కెట్లు బేర్‌మన్నాయి. దేశీయ బెంచ్ మార్క్ సూచీలు ఒక శాతానికి పైగా కుప్పకూలాయి. ఫలితంగా దలాల్ స్ట్రీట్‌లో రూ.3.46 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. ఉదయం సెన్సెక్స్ 395 పాయింట్ల నష్టంతో 66,064 వద్ద, నిఫ్టీ 79 పాయింట్లు పతనమై 19,655 వద్ద మొదలయ్యాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిణామాల ప్రభావంతో రోజంతా నష్టాల్లో కదలాడాయి. విస్తృత స్థాయిలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఆయా రంగాల సూచీలు గరిష్టంగా రెండున్నర శాతం వరకు క్షీణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 1027 పాయింట్లు నష్టపోయి 65,432 వద్ద, నిఫ్టీ 311 పాయింట్లు క్షీణించి 19,423 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి. చివర్లో కనిష్ట స్థాయిల వద్ద స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్ ముగిసే సరికి సెన్సెక్స్ 677 పాయింట్లు నష్టపోయి 65,783 వద్ద ముగిసింది. నిఫ్టీ 207 పాయింట్లు పతనమై 19,527 వద్ద స్థిరపడింది. ముఖ్యంగా బ్యాంకింగ్, మెటల్, ఆటో షేర్లలో పెద్ద ఎత్తున విక్రయాలు తలెత్తాయి. దీంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలూ ఒకశాతానికి పైగా పతనమయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1878 కోట్లను, సంస్థాగత ఇన్వెస్టర్లు స్వల్పంగా రూ.2 కోట్లను షేర్లను విక్రయించారు.

రూపాయి ఆరునెలల్లో అతిపెద్ద పతనం

రూపాయి విలువ ఆరు నెలల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూసింది. డాలర్ మారకంలో 45 పైసలు కరిగిపోయి 82.67 వద్ద స్థిరపడింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ భారీ పతనం, విదేశీ ఇన్వెస్టర్లు నిధుల ఉపసంహరణలు ఇందుకు కారణమయ్యాయి. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 82.38 వద్ద మొదలైంది. ట్రేడింగ్ ఆద్యంతం అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో ఇంట్రాడే కనిష్ట స్థాయి(82.67) వద్ద ముగిసింది. 'ప్రపంచ మార్కెట్లో రిస్క్ తీసుకునే సామర్థ్యం తగ్గిపోవడంతో పాటు ఆసియా కరెన్సీల బలహీన ట్రేడింగ్‌తో రూపాయి భారీగా నష్టపోయింది. అంతర్జాతీయ కరెన్సీ విలువల్లో డాలర్ బలపడటమూ దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచింది' అని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు.

ఒక్క రోజులో రూ.3.46 లక్షల కోట్ల నష్టం

సెన్సెక్స్ ఒక శాతానికి పైగా క్షీణించడంతో దలాల్ స్ట్రీట్‌లో రూ.3.46 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ(క్యాపిటలైజేషన్) రూ.303 లక్షల కోట్లకు దిగివచ్చింది.

నష్టాలు ఎందుకంటే

- 'గత 20 ఏళ్లలో అమెరికా అప్పుల కుప్పగా మారింది. పాలనా వ్యవస్థలో స్థిరమైన క్షీణత కనిపిస్తుంది. యూఎస్ రుణ రేటింగ్‌ను ఏఏఏ నుంచి ఏఏప్లస్ రేటింగ్‌కు తగ్గిస్తున్నాము' అని రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ తెలిపింది. ఈ ప్రకటన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో ప్రకంపనలు సృష్టించింది.
- ఫిచ్ రేటింగ్ కుదింపుతో పెట్టుబడులు ఈక్విటీ మార్కెట్ల నుంచి బాండ్లలోకి మళ్లాయి. అమెరికా పదేళ్ల కాలపరిమిత బాండ్లపై రాబడి ఏకంగా 4% పెరిగింది.
- యూరో జోన్, చైనా జూలై పారిశ్రామికోత్పత్తి గణాంకాలు నిరాశపరచడంతో అంతర్జాతీయ వృద్ధి భయాలు వెంటాడాయి. ఈ పరిణామాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 2-1% క్షీణించాయి. ఈ ప్రతికూల ప్రభావం దేశీయ మార్కెట్‌పై పడింది.
- దేశీయంగా గడిచిన నాలుగు నెలల్లో సూచీలు 13% ర్యాలీ చేయడంతో గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. జాతీయ, అంతర్జాతీయ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్లో పెట్టుబడుల ఉపసంహరణకు మొగ్గుచూపారు.

హెచ్‌పీసీఎల్ టర్న్‌అరౌండ్

క్యూ1లో రూ. 6,204 కోట్ల లాభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో నష్టాలనువీడి లాభాల్లోకి ప్రవేశించింది. రూ. 6,204 కోట్ల నికర లాభం ఆర్జించింది. విదేశీ మార్కెట్లో చమురు ధరల క్షీణత మార్జిన్ల పెంపునకు సహకరించడం లాభాలకు కారణమైంది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 10,197 కోట్ల నికర నష్టం ప్రకటించింది. గత క్యూ1లో పెట్రోల్, డీజిల్ ధరల సవరణను నిలిపివేయడంతో నష్టాలు నమోదైన సంగతి తెలిసిందే. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం 2 శాతం తగ్గి రూ. 1.18 లక్షల కోట్లకు చేరింది. చమురు శుద్ధిలో ప్రతీ బ్యారల్‌పైనా 7.44 డాలర్ల స్థూల రిఫైనింగ్ మార్జిన్లు అందుకుంది. ఇంధన అమ్మకాలు 10.45 మిలియన్ టన్నుల నుంచి 11.43 ఎంటీకి పెరిగాయి. 5.4 ఎంటీ చమురును ప్రాసెస్ చేసింది. గత క్యూ1లో 4.81 ఎంటీ చమురును మాత్రమే శుద్ధి చేసింది.



ఫలితాల నేపథ్యంలో హెచ్‌పీసీఎల్ షేరు బీఎస్‌ఈలో 3 శాతం క్షీణించి రూ. 376 వద్ద ముగిసింది.

ఆన్‌లైన్ గేమింగ్‌పై 28 శాతం పన్ను కొనసాగుతుంది

- అమలైన ఆరు నెలల తర్వాత సమీక్ష
- కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటన

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోల్లో బెట్టింగ్ ముఖ విలువపై 28 శాతం జీఎస్‌టీ అమలు చేయాలని జీఎస్‌టీ కౌన్సిల్ బుధవారం నిర్ణయించింది. ఢిల్లీ, గోవా, సిక్కిం రాష్ట్రాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైనా, ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ.. జీఎస్‌టీ కౌన్సిల్ ఈ విషయంలో ముందుకే వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ ప్రస్తుత సమావేశాల్లోనే సెంట్రల్ జీఎస్‌టీలో సవరణలకు సంబంధించి కేంద్ర సర్కారు బిల్లును ప్రవేశపెట్టనుంది. అనంతరం రాష్ట్రాల అసెంబ్లీలు సవరణలకు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. వచ్చే అక్టోబర్ 1 నుంచి చట్ట సవరణలు అమల్లోకి రానున్నాయి. ''ఆడేవారి తరపున చెల్లించిన మొత్తం ఆధారంగా విలువ నిర్ణయించడం జరుగుతుంది. ముందు ఆటలో గెలిచిన మొత్తాన్ని మళ్లీ పందెంలో పెడితే దాన్ని జీఎస్‌టీ నుంచి మినహాయిస్తారు. ఆరంభంలో పెట్టే మొత్తంపైనే పడుతుంది''అని కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ వివరించారు. ఇందుకు ఓ ఉదాహరణ కూడా చెప్పారు. ''రూ.1,000 పందెంలో పెడితే, దీనిపై రూ.300 గెలిస్తే.. అనంతరం ఈ రూ.1,300తో మళ్లీ పందెం కాస్తే గెలిచే మొత్తంపై జీఎస్‌టీ విధించరు''అని వివరించారు. ఆన్‌లైన్ గేమింగ్‌పై జీఎస్‌టీని అమలు చేసిన 6 నెలల తర్వాత (2024 ఏప్రిల్‌లో) సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. ఆఫ్‌షోర్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లు జీఎస్‌టీ వద్ద నమోదు చేసుకోవాల్సి ఉంటుందని రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా చెప్పారు. నిబంధనలు పాటించని పోర్టల్స్‌ను బ్లాక్ చేస్తామని హెచ్చరించారు.



పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఐటీలో మేటిగా నిలవాలంటే!

ప్రస్తుత అనిశ్చిత వ్యాపార ప్రపంచంలో నియామకాల తీరు మారుతోంది. అవసరాలమేరకే సంస్థలు ఉద్యోగుల సేవలను వినియోగించుకుంటున్నాయి. పదింటిలో ఆరు సంస్థలు కాంట్రాక్ట్ ఆధారిత నిపుణుల(గిగ్ వర్కర్ల) నియామకానికే మొగ్గుచూపుతున్నాయి. రానున్న రోజుల్లో జావా డెవలపర్‌లు, మొబైల్ యాప్ డెవలపర్‌లు, డేటా ఇంజనీర్లు, ఫ్రంట్-ఎండ్ డెవలపర్‌లు, క్లౌడ్ ఆర్కిటెక్ట్‌లు /ఇంజనీర్లు వంటి సాంకేతిక కొలువుల్లో పుష్కలమైన డిమాండ్ ఉంటుందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో.. జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న టెక్ కొలువులు, వాటిల్లో రాణించాలంటే అవసరమైన నైపుణ్యాలపై ఫోకస్..

జావా డెవలపర్

ఇండస్ట్రీ ట్రెండ్‌తో అప్‌డేట్‌గా ఉంటూ.. తమ నైపుణ్యాలను వాస్తవ-ప్రపంచంలో ప్రభావవంతంగా అన్వయించగలిగితే జావా డెవలపర్‌లకు జాబ్ మార్కెట్‌లో అవకాశాలకు కొదవలేదు. జావా డెవలపర్‌గా రాణించాలంటే.. ఆబ్జెక్ట్-ఓరియెంటెడ్ ప్రోగ్రామింగ్, ఎక్సెప్షన్ హ్యాండ్లింగ్ సహా కోర్ జావా కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి. సర్వ్‌లెట్స్, జేఎస్‌పీ, రెస్ట్‌ఫుల్ వెబ్ సర్వీసెస్‌తో కూడిన వెబ్ డెవలప్‌మెంట్ నైపుణ్యంతోపాటు స్ప్రింగ్, హైబర్నేట్ వంటి ఫ్రేమ్‌వర్క్‌లలో ప్రావీణ్యం పెంచుకోవాలి. జేడీబీసీ లేదా ఓఆర్‌ఎం ఫ్రేమ్‌వర్క్‌లను ఉపయోగించే డేటాబేస్ కనెక్టివిటీ స్కిల్స్ ఎంతో కీలకం. టెస్టింగ్ విత్ జేయూనిట్, మావెన్ వంటి బిల్డ్ టూల్స్, గిట్ వంటి వెర్షన్ కంట్రోల్ సిస్టమ్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ సామర్థ్యాలు తదితర నైపుణ్యాలు కూడా ముఖ్యమైనవి. వ్యక్తిగత ప్రాజెక్ట్‌ల ద్వారా ప్రాక్టికల్ అనుభవాన్ని పొందడం, ఓపెన్-సోర్స్ ప్రాజెక్ట్‌లకు సహకారం అందించడం ద్వారా రిక్రూటర్‌ల దృష్టిని ఆకర్షించొచ్చు.

మొబైల్ అప్లికేషన్ డెవలపర్

టెక్ గిగ్ కొలువుల్లో మొబైల్ అప్లికేషన్ డెవలపర్‌కు మంచి డిమాండ్ నెలకొంది. ఆండ్రాయిడ్ లేదా ఐవోఎస్ డెవలప్‌మెంట్‌లో విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. మొబైల్ అప్లికేషన్ డెవలపర్‌గా రాణించాలంటే.. రియాక్ట్ నేటివ్ లేదా ఫ్లట్టర్, యూఐ/యూఎక్స్ డిజైన్, బ్యాకెండ్ డెవలప్‌మెంట్, మొబైల్ యాప్ సెక్యూరిటీ, టెస్టింగ్, డీబగ్గింగ్, క్రాస్-ప్లాట్‌ఫారమ్ అడాప్టబిలిటీ, ప్రాక్టికల్ అనుభవం, బిల్డింగ్ ఎ పోర్ట్‌ఫోలియోలో నైపుణ్యం సాధించాలి. ఇండస్ట్రీ ట్రెండ్స్‌కు తగ్గట్టుగా వినూత్న మొబైల్ యాప్‌లను రూపొందించగలగాలి.

డేటా ఇంజనీర్

మారుతున్న టెక్నాలజీకి తగ్గట్టుగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే.. డేటా ఇంజనీర్ ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ప్రోగ్రామింగ్ సామర్థ్యాలు, డేటాను సమర్థవంతంగా విశ్లేషించే సామర్థ్యం, డేటా విజువలైజేషన్ టెక్నిక్‌లలో నైపుణ్యం, క్లౌడ్ కంప్యూటింగ్‌పై దృఢమైన అవగాహన, సమర్థవంతమైన కమ్యూనికేషన్, అద్భుతమైన సాఫ్ట్ స్కిల్స్ ఉన్నవారు డేటా ఇంజనీర్‌గా సులభంగా రాణించొచ్చు. ఈ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకున్నప్పుడే సంస్థల డేటా నిర్వహణ, నిర్ణయాత్మక ప్రక్రియలపై ప్రభావాన్ని చూపగలుగుతారు.



ఫ్రంట్ ఎండ్ డెవలపర్

వెబ్‌సైట్‌లు, వెబ్ అప్లికేషన్‌ల విజువల్, ఇంటరాక్టివ్ అంశాలను రూపొందించడంలో, అభివృద్ధి చేయడంలో ఫ్రంట్ ఎండ్ డెవలపర్‌లు కీలక పాత్ర పోషిస్తారు. ఫ్రంట్ ఎండ్ డెవలపర్‌గా రాణించాలంటే.. హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావాస్క్రిప్ట్‌లలో నైపుణ్యం సొంతం చేసుకోవాలి. అప్పుడే వెబ్ పేజీలను రూపొందించడంతోపాటు వాటిని ఆకర్షణీయంగా మలచి ఫంక్షనల్‌గా కూడా యూజర్ ఫ్రెండ్లీగా తీర్చిదిద్దగలుగుతారు. ఫ్రంట్ ఎండ్ డెవలపర్‌లు సాంకేతిక నైపుణ్యంతో పాటు సమస్య-పరిష్కార సామర్థ్యాలు, సమర్థమంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలి. ప్రస్తుత జాబ్ మార్కెట్‌లో అవకాశాలు సొంతం చేసుకోవాలంటే..హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావాస్క్రిప్ట్‌లతో పాటు రియాక్ట్, యాంగులర్, వ్యూ వంటి ప్రముఖ ఫ్రేమ్‌వర్క్‌లపై కూడా పట్టు సాధించాలి.

క్లౌడ్ ఆర్కిటెక్ట్స్/ఇంజనీర్

క్లౌడ్ ఆర్కిటెక్ట్‌లు/ఇంజనీర్లు క్లౌడ్-ఆధారిత పరిష్కారాలను రూపొందించడంలో, నిర్మించడంలో, పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తారు. వీరికి వివిధ క్లౌడ్ కంప్యూటింగ్ టెక్నాలజీలపై లోతైన అవగాహన ఉండాలి. వ్యాపార అవసరాలను గుర్తించి సరైన సాంకేతిక పరిష్కారాన్ని చూపే నైపుణ్యం తప్పనిసరి. సాంకేతిక నైపుణ్యంతో పాటు బలమైన సమస్య పరిష్కార సామర్థ్యాలు, అద్భుతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను కలిగి ఉండాలి. ప్రస్తుత జాబ్ మార్కెట్‌లో అవకాశాలను సొంతం చేసుకోవాలంటే.. క్లౌడ్ ఆర్కిటెక్ట్‌లు/ఇంజనీర్‌లు ఏడబ్ల్యూఎస్, అజుర్, గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫారమ్‌లలో, జావా, పైథాన్, సీ++ వంటి ప్రోగ్రామింగ్ భాషలలో నైపుణ్యం సాధించాలి. డేటా స్టోరేజ్, రిట్రీవల్ గురించిన పరిజ్ఞానం, నెట్‌వర్కింగ్, సెక్యూరిటీ, కాస్ట్ మేనేజ్‌మెంట్ ఎజైల్ డెవలప్‌మెంట్, డెవ్‌ఓపీఎస్, క్లౌడ్-నేటివ్ డెవలప్‌మెంట్ నైపుణ్యాలున్నవారు అత్యధిక వేతనాలు పొందొచ్చు.

సీజీపీడీటీఎంలో 553 ఉద్యోగాలు



డిగ్రీ, పీజీ అర్హతతో దరఖాస్తుకు అవకాశం

కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన న్యూఢిల్లీలోని కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, డిజైన్స్ అండ్ ట్రేడ్ మార్క్స్(సీజీపీడీటీఎం), డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ ఇంటర్నల్ ట్రేడ్, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ.. పలు ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా వివిధ విభాగాల్లో 553 పోస్టులను భర్తీ చేయనుంది. ప్రిలిమినరీ,మెయిన్ పరీక్షలు, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేస్తారు. సీజీపీడీటీఎంలో ఉద్యోగాల వివరాలు..

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 553
- **విభాగాల వారీగా పోస్టుల వివరాలు:** ఎగ్జామినర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ గ్రూప్-ఎ(గెజిటెడ్) పోస్టులు.. బయోటెక్నాలజీ-50, బయోకెమిస్ట్రీ-20, ఫుడ్ టెక్నాలజీ-15, కెమిస్ట్రీ-56, పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ-09, బయోమెడికల్ ఇంజనీరింగ్-53, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్-108, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-29, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-63, ఫిజిక్స్-30, సివిల్ ఇంజనీరింగ్-09, మెకానికల్ ఇంజనీరింగ్-99, మెటలర్జికల్-04, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ 08 పోస్టులు ఉన్నాయి.

అర్హత

- ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు సంబంధిత విభాగంలో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 04.08.2023 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఐదేళ్లు, ఓబీసీలకు, ఎక్స్ -సర్వీస్‌మెన్‌కు మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ఇలా

రాత పరీక్ష ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష

- ఈ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఐదు విభాగాల నుంచి మొత్తం 150 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో జనరల్ ఇంగ్లిష్, వెర్బల్ అండ్ నాన్ వెర్బల్ రీజనింగ్, ఐపీ లెజిస్లేషన్, వీఐపీఓ సంబంధిత అంశాలు ఉంటాయి, పరీక్ష సమయం 2 గంటలు.
- జనరల్ ఇంగ్లిష్‌లో కాంప్రహెన్షన్, ప్రెసీ రైటింగ్, వొకాబ్యులరీ, షార్ట్ ఎస్సేలు ఉంటాయి. విషయాన్ని చదివి, అర్థం చేసుకుని తమ ఆలోచనలను అభ్యర్థులు స్పష్టంగా, సరిగా తెలియచేస్తారో లేదోపరీక్షిస్తారు.
- న్యూమరికల్/క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో మేథమెటికల్ కాలిక్యులేషన్స్‌లో అభ్యర్థికి ఉండే నైపుణ్యాన్ని పరీక్షిస్తారు. అర్థమెటికల్ రీజనింగ్, గ్రాఫ్ అండ్ టేబుల్ రీడింగ్, పర్సంటేజ్ అనాలిసిస్, క్వాంటిటేటివ్ అనాలిసిస్ తదితర అంశాల నుంచి ప్రశ్నలుంటాయి.
- వెర్బల్-నాన్ వెర్బల్ రీజనింగ్‌లో భాగంగా అభ్యర్థి తార్కిక నైపుణ్యం, విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. ప్రశ్నలు, చిత్రాల రూపంలో ఇచ్చిన సమాచారాన్ని అర్థం చేసుకుని సమాధానాలను గుర్తించగలగాలి.
- జనరల్ సైన్స్‌లో భాగంగా సైంటిఫిక్ మెథడాలజీ కాన్సెప్ట్స్, ప్రిన్సిపల్స్, టెక్నిక్స్ అండ్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్, ఎర్త్/స్పేస్ సైన్స్, టెక్నాలజీ మొదలైన అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్‌లో వర్తమానాంశాలపై ప్రశ్నలు అడుగుతారు. జాతీయ, అంతర్జాతీయం, ఆర్థికం, క్రీడలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంట్ సంబంధిత అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. న్యూస్ పేపర్ చదవడం, వార్తలు వినడం ద్వారా కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంచుకోవచ్చు.
- పాత ప్రశ్నపత్రాలను సాధన చేయడం ద్వారా సన్నద్ధత ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. దానికి అనుగుణంగా ప్రిపరేషనల్ ప్లాన్ రూపొందించుకోవాలి.
- ఎక్కువగా మాదిరి ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేయాలి. మాక్ టెస్టులు రాయాలి. ఫలితంగా నిర్దిష్ట సమయం లోపలే సమాధానాలు రాయగలుగుతున్నారో లేదో తెలుసుకునే వీలవుతుంది.

అర్హత మార్కులు

ఈ పరీక్షలో అన్ రిజర్వ్‌డ్ అభ్యర్థులు-30 శాతం, ఓబీసీ/ఈడబ్ల్యూస్ అభ్యర్థులు 25 శాతం, ఇతరులు 20 శాతం కనీస అర్హత మార్కులుగా సాధించాలి. పోస్టుల సంఖ్యకు అనుగుణంగా ఇరవై రెట్ల మందిని మెయిన్స్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

మెయిన్స్ పరీక్ష

- ఆఫ్‌లైన్ విధానంలో మెయిన్ రాత పరీక్ష ఉంటుంది. పేపర్-1 ఆబ్జెక్టివ్ పద్ధతిలో, పేపర్-2 డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పేపర్-1 వంద మార్కులకు, పేపర్-2 మూడు వందల మార్కులకు ఉంటాయి.
- పేపర్-1లో ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు 100 ఉంటాయి. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ 20 ప్రశ్నలు, జనరల్ ఆప్టిట్యూడ్-20 ప్రశ్నలు, ఎలిమెంటరీ మేథమెటిక్స్-20 ప్రశ్నలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ-20 ప్రశ్నలు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్-20 ప్రశ్నలు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటలు.
- టెక్నికల్/సైంటిఫిక్ విభాగంలో అభ్యర్థి అవగాహనను పరీక్షించే విధంగా పేపర్-2 ఉంటుంది. ఇందులో 300 మార్కులకు డిస్క్రిప్టివ్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి మూడు గంటలు. అభ్యర్థుల తుది ఎంపికలో ఈ రెండు పేపర్లలో సాధించిన మార్కులకు 80 శాతం వెయిటేజీ ఉంటుంది. పేపర్-2 సిలబస్ విభాగాల వారీగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.
- పేపర్-2లో సమాధానాలను స్పష్టంగా, అర్థమయ్యేలా రాయాలి. కొట్టివేతలు లేకుండా రాయడం అలవాటు చేసుకోవాలి. ఖాళీల సంఖ్యకు ఐదురెట్ల మంది అభ్యర్థులను మెయిన్స్ పరీక్ష నుంచి ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

ఇంటర్వ్యూ ఇలా

ఇంటర్వ్యూ మొత్తం 100 మార్కులకు ఉంటుంది. ఇంటర్వ్యూలో పొందిన మార్కులను తుది ఎంపికలో 20 శాతం వెయిటేజీ ఇస్తారు.

వేతనాలు

ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు లెవల్ పే 10 ప్రకారం- నెలకు రూ.53,100-రూ.1,77,500 వరకు వేతనంగా అందుతుంది. వీటితోపాటు ఇతర అలవెన్సులు కూడా చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 04.08.2023
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 03.09.2023
- **మెయిన్స్ పరీక్ష తేదీ:** 01.10.2023
- **వెబ్‌సైట్:** https://cgpdtm.qcin.org

జాబ్స్ ఇన్ఫో

ఏఏఐలో 342 కొలువులు

డిగ్రీ, అపై విద్యార్హతలు ఉన్నవారి కోసం ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. వివిధ విభాగాల్లో మొత్తం 342 జూనియర్ అసిస్టెంట్(ఆఫీస్), సీనియర్ అసిస్టెంట్(అకౌంట్స్), ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీ చేయనుంది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ వివరాలు..

- మొత్తం పోస్టులు: 342
- జూనియర్ అసిస్టెంట్(ఆఫీస్)-09, సీనియర్ అసిస్టెంట్ (అకౌంట్స్)-09, జూనియర్ ఎగ్జిక్యూటివ్(కామన్ కేడర్)-237, జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఫైనాన్స్)-66, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఫైర్ సర్వీస్)-03, జూనియర్ ఎగ్జిక్యూటివ్(లా)-18.

అర్హత

- పోస్టులను అనుసరించి డిగ్రీ, బీకాం, ఐసీడబ్ల్యూసీ, సీఏ, ఎంబీఏ, బీఈ/బీటెక్, ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతోపాటు లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- **వయసు:** 04.09.2023 నాటికి సీనియర్/జూనియర్ అసిస్టెంట్ 30 ఏళ్లు, జూనియర్ ఎగ్జిక్యూటివ్ 27 ఏళ్లు మించరాదు.

ఎంపిక ఇలా

పోస్టును అనుసరించి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, కంప్యూటర్ లిటరసీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్, ఎండ్యూరెన్స్ టెస్ట్, డ్రైవింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

పరీక్ష విధానం

- ఈ పరీక్షను రెండు పార్ట్‌లుగా 120 మార్కులకు నిర్వహిస్తారు. నెగిటివ్ మార్కులు ఉండవు.
- **పార్ట్-ఎ:** ఈ పరీక్షలో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఇందులో ఇంగ్లిష్ 20 ప్రశ్నలు-20 మార్కులు, జనరల్ ఇంటెలిజెన్స్/రీజనింగ్-15 ప్రశ్నలు-15 మార్కులు, జనరల్ ఆప్టిట్యూడ్/న్యూమరికల్ ఆప్టిట్యూడ్-15 ప్రశ్నలు-15 మార్కులు, జనరల్ నాలెడ్జ్/జనరల్ అవేర్‌నెస్ 10 ప్రశ్నలు-10 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- **పార్ట్-బి:** ఈ పరీక్షలో రెండు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.ఇందులో మ్యాథమేటిక్స్, ఫిజిక్స్ విభాగాల నుంచి 60 ప్రశ్నలకు-60 మార్కులకు పరీక్ష ఉంటుంది. రెండు పార్ట్‌లకు కలిపి పరీక్ష సమయం 120 నిమిషాలు.

ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు ప్రారంభతేదీ:** 05.08.2023
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 04.09.2023
- **వెబ్‌సైట్:** www.aai.aero

వలస కార్మికులకు ఉచిత వీసా

- ఖతార్‌కు చెందిన కంపాస్ కంపెనీ ఆఫర్
- 7న నిజామాబాద్, 8న సికింద్రాబాద్‌లలో ఇంటర్వ్యూలు

మోర్తాడ్(బాల్కొండ): ఖతార్‌లో ఉపాధి కల్పించే వీసాలకు డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో అక్కడి కంపాస్ కంపెనీ ఉచిత రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను తెలంగాణలో నిర్వహిస్తోంది. ప్రముఖ కన్సల్టెన్సీ ఏజెన్సీ జీటీఎం ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈనెల 7న నిజామాబాద్‌లో, 8న సికింద్రాబాద్‌లో ఇంటర్వ్యూలను నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఎంపికైనవారికి నయాపైసా ఖర్చు లేకుండా ఖతార్‌కు పంపించి అక్కడ క్యాటరింగ్ రంగంలో ఉపాధి కల్పించనున్నారు. 25 ఏళ్ల నుంచి 38 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఒరిజినల్ పాస్‌పోర్టులతో ఇంటర్వ్యూకు హాజరు కావాలి. కిచెన్‌లో పనిచేసే వారికి నిజామాబాద్, సికింద్రాబాద్‌లలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. క్లీనింగ్ మేనేజర్, సీనియర్ సర్వీస్ సూపర్‌వైజర్, సర్వీస్ సూపర్‌వైజర్, వెయిటర్స్, చీఫ్ స్టీవార్డ్, స్టీవార్డింగ్ సూపర్‌వైజర్, డ్రైవర్ల పోస్టులకు సికింద్రాబాద్‌లో 8న ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు.

టీఆర్‌ఈఐఆర్‌బీ చైర్మన్‌గా షఫీయుల్లా

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) చైర్మన్‌గా ఐఎఫ్ఎస్ అధికారి, తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బి.షఫీయుల్లాను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇదివరకు చైర్మన్‌గా పనిచేసిన ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి రొనాల్డ్‌రాస్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ కావడంతో ఆ కుర్చీ ఖాళీ అయింది. అనంతరం ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీ కార్యదర్శిగా ఇ.నవీన్ నికోలస్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతమున్న గురుకుల సొసైటీ కార్యదర్శుల్లో సీనియర్ అధికారికి టీఆర్‌ఈఐఆర్‌బీ చైర్మన్ పదవిని కేటాయించాలనే నిబంధన ఉంది. ఈ క్రమంలో గురుకుల బోర్డు చైర్మన్ భర్తీకోసం బోర్డు కన్వీనర్, సీఈఓ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు ఆ ప్రతిపాదనలను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం షఫీయుల్లాకు ప్రాధాన్యం ఇస్తూ చైర్మన్‌గా నియమించింది. ఈమేరకు ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా ఉత్తర్వులు జారీచేశారు.

స్టాఫ్ నర్స్ పరీక్షలకు 94.47 శాతం హాజరు

నాలుగు జిల్లాల్లో 39 కేంద్రాల్లో పరీక్ష

సాక్షి, హైదరాబాద్: స్టాఫ్ నర్స్ పరీక్షలు బుధవారం అత్యంత పకడ్బందీగా నిర్వహించినట్లు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి వెల్లడించారు. మొత్తం 40,936 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 38,674 మంది హాజరయ్యారని తెలిపారు. అంటే 94.47 శాతం మంది హాజరైనట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్‌లలో 39 కేంద్రాల్లో పరీక్ష జరిగిందన్నారు. కంప్యూటర్ ఆధారిత పద్ధతిలో పరీక్షలు నిర్వహించారు. ఒకేరోజు మూడు సెషన్లలో పరీక్ష జరిగింది. ఉదయం సెషన్ పరీక్ష 9 గంటలకు, రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 12.30 గంటలకు, ఇక మూడో సెషన్ పరీక్ష సాయంత్రం 4 గంటలకు నిర్వహించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో అవకతవకల నేపథ్యంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఎక్కడికక్కడ సీనియర్ వైద్యాధికారులు పర్యవేక్షించారు. ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి సహా పలువురు వివిధ కేంద్రాలకు వెళ్లి పరీక్ష తీరును పరిశీలించారు. త్వరలో ఫలితాలు వస్తాయని, అనంతరం పోస్టింగ్‌లుంటాయని అధికారులు చెబుతున్నారు.

మహిళా వర్సిటీ లోగో విడుదల చేసిన మంత్రి సబిత

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యలో మహిళలు ముందంజలో ఉండేందుకే తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంను ఏర్పాటు చేశామని విద్యా శాఖమంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహిళా విశ్వవిద్యాలయం ఏర్పాటుతో తెలంగాణ విద్యార్థుల కల సాకారమైందని, ఉన్నత విద్యలో మహిళల భాగస్వామ్యం మరింతగా పెరిగిందని తెలిపారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో 'తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం లోగో'ను మంత్రి విడుదల చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని, వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా సిలబస్ రూపొందించాలని అధికారుల ను ఆదేశించారు. బోధనా సౌకర్యాలు, విద్యార్థినులకు కావాల్సిన వసతులు, మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచాలని కోరారు.

రేపట్నుంచి ఎంసెట్ తుది దశ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: టీఎస్ ఎంసెట్ ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ ప్రక్రియ 4వ తేదీ నుంచి మొదలవుతుందని ఉన్నత విద్యామండలి తెలిపింది. ఈనెల 6వ తేదీవరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని, సీట్ల కేటాయింపు ఈనెల 9న ఉంటుందని వెల్లడించింది. సీటు వచ్చిన అభ్యర్థులు 12వ తేదీలోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించింది. ప్రత్యేక రౌండ్ కౌన్సెలింగ్ ఈనెల 17 నుంచి మొదలవుతుందని, 19వ తేదీ వరకు ఆప్షన్లు ఇవ్వొచ్చంది. 23న సీట్ల కేటాయింపు, 25వ తేదీలోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని పేర్కొంది. కాగా, ఇంటర్ స్లైడింగ్, స్పాట్ అడ్మిషన్లు 23వ తేదీన ఉంటాయని విద్యామండలి తెలిపింది.

బెలుగా.. భలేగా..



ప్రపంచంలోనే అతి పెద్ద కార్గో..

శంషాబాద్: సరుకు రవాణాలో ప్రపంచంలోనే అతిపెద్దదైన బెలుగా విమానం మరోసారి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. వియత్నాం నుంచి ఈజిప్ట్ వెళ్తున్న ఈ విమానంలో ఇంధనం నింపడంతో పాటు పైలట్‌ల విశ్రాంతి కోసం సోమవారం అర్ధరాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. తిరిగి బుధవారం రాత్రి ఇక్కడి నుంచి ఈజిప్ట్‌కి బయలుదేరింది. గతేడాది డిసెంబర్ 4 రాత్రి దుబాయ్ నుంచి భారీ సరుకుతో థాయ్‌లాండ్‌లోని పటాయా వెళుతూ ఇంధనం, విశ్రాంతి కోసం బెలుగా శంషాబాద్‌లో ల్యాండ్ అయింది. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద సరుకు రవాణా విమానాల్లో ఈ ఎయిర్‌బస్ బెలుగా విమానం (ఏ300-600 సూపర్ ట్రాన్స్‌పోర్టర్) ఒకటి. విమాన ఆకారం ఉబ్బెత్తు తలతో ఉండే బెలుగా రకం తిమింగలాలను పోలి ఉండటంతో ఆ పేరుతో ఖ్యాతిగాంచింది. రష్యన్ భాషలో బెలుగా అంటే తెల్లని అని అర్థం. ప్రపంచంలో ఇవి ఐదు మాత్రమే ఉన్నాయి.

బెలుగా విమానం పొడవు 56.15 మీటర్లు, ఎత్తు 17.24 మీటర్లు, బరువు మోసుకెళ్లే సామర్థ్యం 47 వేల కేజీలు, బెలుగా విమానాల తయారీలో యూకే, స్పెయిన్, ఫ్రాన్స్, జర్మనీ ఏరోస్పేస్ కంపెనీలు పాలుపంచుకున్నాయి. కాగా, అతి పెద్ద కార్గో విమానాల్లో ఒకటైన అంటోనోవ్ ఏఎస్-225 మ్రియా కూడా ఇంధనం, విశ్రాంతి కోసం 2016, మే 13న శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. అయితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో మ్రియా విమానం ధ్వంసమైంది. మ్రియా అంటే రష్యన్ భాషలో కల అని అర్థం. ప్రస్తుతం మ్రియా లేకపోవడంతో కార్గోలో బెలుగానే అతిపెద్ద విమానంగా గుర్తిస్తున్నారు.

పర్యావరణ బడ్జెట్ ఫినిష్!

ఆగస్టు 2తో ఖర్చయిపోయిన ప్రపంచ దేశాల వార్షిక బడ్జెట్

- నేటి నుంచి 'పర్యావరణ అప్పు'తోనే మన బతుకు.. గత ఏడాది ఒకరోజు ముందుగా ఆగస్టు 1తోనే నిండుకున్న బడ్జెట్
- 1971 వరకు భూగోళం ఇవ్వగలిగే పరిమితులకు లోబడే వనరుల వినియోగం
- రాను రాను భూగోళంపై పెరిగిపోయిన ఒత్తిడి.. ప్రస్తుతం అవసరమైన పర్యావరణ వనరులు సమకూరాలంటే 1.75 భూగోళాలు కావాలి
- 'గ్లోబల్ ఫుట్‌ప్రింట్ నెట్‌వర్క్' వెల్లడి
- అందరూ అమెరికన్లలా బతికితే 5 భూగోళాలు కావాలి.. అదే భారతీయుల్లా అయితే 0.8 భూగోళం చాలు.. అంటే 20% మిగులు బడ్జెట్

ప్రపంచ దేశాల పర్యావరణ బడ్జెట్ బుధవారంతో పూర్తిగా ఖర్చయిపోయింది. గురువారం నుంచి భూమి అప్పుగా సమకూర్చేదే. కాస్త వింతగా అన్పించినా ఇది వాస్తవం.

ఆర్థిక వనరులకు సంబంధించి వార్షిక బడ్జెట్లు, లోటు బడ్జెట్లు, అప్పులు ఉన్నట్టే పర్యావరణ వనరులకు కూడా బడ్జెట్ ఉంది. గ్లోబల్ ఫుట్‌ప్రింట్ నెట్‌వర్క్ తాజా అంచనా ప్రకారం.. ఆ బడ్జెట్ ఆగస్టు 2తో అయిపోయింది. అంటే..భూగోళానికున్న పర్యావరణ వనరుల సామర్థ్యం (బయో కెపాసిటీ) అంతవరకేనన్నమాట. దీన్నే 'వరల్డ్ ఎర్త్ ఓవర్ షూట్ డే'అని పిలుస్తున్నారు.

ఇక ఆగస్టు 3 నుంచి మనం వాడేదంతా భూమి తన మూలుగను కరిగించుకుంటూ కనాకష్టంగా సమకూర్చే అప్పు (అదనపు వనరులు) మాత్రమే.



గత ఏడాది ఈ పర్యావరణ బడ్జెట్ ఆగస్టు 1తోనే అంటే ప్రస్తుత ఏడాదితో పోల్చుకుంటే ఒకరోజు ముందే అయిపోయింది. ఈ ఏడాదిలో కొద్దోగొప్పో పర్యావరణ స్పృహ పెరగడంతో ఒక రోజు అదనంగా సమకూరిందన్నమాట. పర్యావరణ బడ్జెట్ 1971 వరకు భూగోళం ఇవ్వగలిగే పరిమితులకు లోబడే ఉండేదట.

1.75 భూగోళాలు కావాలి

అంటే 365 రోజులూ లోటు లేకుండా ఉండేదని గ్లోబల్ ఫుట్‌ప్రింట్ నెట్‌వర్క్ అంచనా వేసింది. ఆ తర్వాత నుంచి క్రమంగా ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరగడంతో పాటు వినియోగంలో విపరీత పోకడల వల్ల భూగోళంపై ఒత్తిడి పెరిగిపోయింది. ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ కలిసి 175% మేరకు ప్రకృతి వనరులు వాడేస్తున్నాయి. అంటే.. మనకు అవసరమైన వనరులు సునాయాసంగా సమకూర్చాలంటే 1.75 భూగోళాలు కావాలన్నమాట.

ఎక్కువ వ్యయం చేస్తున్న సంపన్న దేశాలు

ప్రకృతి వనరుల వినియోగం అన్ని దేశాల్లో ఒకేలా ఉండదు. సంపన్న దేశాలు ఎక్కువ వనరులను ఖర్చు చేస్తున్నాయి. ఉదాహరణకు.. అమెరికా వాసుల మాదిరిగా ప్రకృతి వనరులను వాడితే 5.1 భూగోళాల పర్యావరణ సేవలు మనకు అవసరమవుతాయి. చైనీయుల్లా జీవిస్తే 2.4 భూగోళాలు కావాలి. ఇక ప్రపంచ పౌరులందరూ భారతీయుల్లా జీవిస్తే 0.8 భూగోళం చాలు. అంటే.. పర్యావరణ బడ్జెట్ 20% మిగులులోనే ఉంటుందన్న మాట.

ఖతార్ బడ్జెట్ ఫిబ్రవరి 10నే ఖతం!

ప్రపంచవ్యాప్తంగా తలసరి వార్షిక పర్యావరణ వనరుల సామర్థ్యం (బయో కెపాసిటీ) 1.6 గ్లోబల్ హెక్టార్లు (బయో కెపాసిటీని, ఫుట్‌ప్రింట్ (ఖర్చు)ని 'గ్లోబల్ హెక్టార్ల'లో కొలుస్తారు). దీనికన్నా ఖర్చు (ఫుట్‌ప్రింట్) ఎక్కువగా ఉంటే పర్యావరణ బడ్జెట్ అంత తక్కువ రోజుల్లోనే అయిపోతుంది. తక్కువ ఖర్చు చేస్తే ఎక్కువ రోజులు కొనసాగుతుంది. భారత్‌లో తలసరి వార్షిక పర్యావరణ బడ్జెట్ 1.04 గ్లోబల్ హెక్టార్లు. అంటే లభ్యత కన్నా ఖర్చు తక్కువగా (20% మిగులు బడ్జెట్) ఉందన్న మాట. ఇక అత్యంత సంపన్న ఎడారి దేశం ఖతార్ పర్యావరణ బడ్జెట్ ఫిబ్రవరి 10నే అయిపోవడం గమనార్హం. కెనడా, యూఏఈ, అమెరికాల బడ్జెట్ మార్చి 13తో, చైనా బడ్జెట్ మే 1తో అయిపోగా, ఆగస్టు 12న బ్రెజిల్, డిసెంబర్ 20న జమైకా బడ్జెట్లు అయిపోతున్నాయి.

ప్రకృతి వైపరీత్యాలన్నీ ఇందుకే..

వనరులు సమకూర్చే శక్తి భూగోళానికి లేకపోయినా మనం వాడుకుంటూనే ఉన్నాం కాబట్టే భూగోళం అతలాకుతలమైపోతోంది. ఎన్నడూ ఎరుగనంత ఉష్ణోగ్రతలు, కుండపోత వర్షాలు, కరువు కాటకాలు.. ఈ ప్రకృతి వైపరీత్యాలన్నీ మనం పర్యావరణ వనరులు అతిగా కొల్లగొడుతున్న దాని ఫలితమే. పర్యావరణ లోటు బడ్జెట్‌తో అల్లాడుతున్న భూగోళాన్ని స్థిమితపరిచి మన భవిష్యత్తును బాగు చేసుకోవాలంటే.. పర్యావరణ వార్షిక బడ్జెట్ 365 రోజులకు సరిపోవాలంటే.. మానవాళి మూకుమ్మడిగా జీవన విధానాన్ని మార్చుకోవాలి. వనరులను పొదుపుగా వాడాలి.

ముఖ్యంగా ఐదు పనులు చేయాలి. పర్యావరణ హితమైన ఇంధనాలు వాడాలి. ఆహారోత్పత్తి పద్ధతులను పర్యావరణ హితంగా మార్చుకోవాలి. నగరాల నిర్వహణలో ఉద్గారాలు, కాలుష్యం తగ్గించుకోవాలి. భూగోళంపై ప్రకృతి వనరులకు హాని కలిగించని రీతిలో పారిశ్రామిక కార్యక్రమాలు చేపట్టాలి. అన్నిటికీ మించి వనరుల తక్కువ వినియోగానికి వీలుగా జనాభా పెరుగుదలను అదుపులో ఉంచుకోవాలి.

\- సాక్షి సాగుబడి డెస్క్-

గ్రూప్-2 అభ్యర్థుల కోసం టీశాట్ అదనపు ప్రసారాలు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-2 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం టీశాట్ ప్రత్యక్ష ప్రసారాలను నిర్వహించనున్నట్లు సీఈఓ శైలేశ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3వ తేదీ అదనంగా మరో 3 గంటలు పాఠ్యాంశాలు ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. నెల రోజులుగా ప్రతిరోజూ 2 గంటలు ప్రసారాలు అందించిన టీ-శాట్ నెట్‌వర్క్ చానళ్లు గురువారం నుంచి ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు ప్రసారాలు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. నిపుణ చానల్‌లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఇంగ్లిష్, జాగ్రఫీ, తెలంగాణ ఉద్యమం, చరిత్ర, ఎకానమీ సబ్జెక్టులపై ప్రసారాలుంటాయన్నారు. మరుసటి రోజు విద్యచానల్‌లో ఉదయం 5 నుంచి 10 గంటల వరకు పునఃప్రసారాలుంటాయని తెలిపారు. గ్రూప్-2 పరీక్ష ఆగస్టు 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ ప్రకటించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు శైలేశ్‌రెడ్డి తెలిపారు.

ఇంటి వద్దకే జాతీయ జెండాలు

ఈ నెల 12వరకు బుకింగ్‌కు అవకాశం
పోస్టుమాస్టర్ జనరల్ పీవీఎస్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తపాలా శాఖ మరో అడుగు ముందుకేసింది. గతేడాది వజ్రోత్సవాలలో భాగంగా చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా'కార్యక్రమానికి మంచి స్పందన లభించడంతో ఈసారి కూడా ఇంటి వద్దకే జాతీయ జెండాలను అందించే ప్రక్రియకు ఆ శాఖ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు బుధవారం తెలంగాణ సర్కిల్ పోస్టుమాస్టర్ జనరల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. 'హర్ ఘర్ తిరంగా-2'పేరిట ఆన్‌లైన్ ద్వారా, పోస్టాఫీసుల ద్వారా జాతీయ జెండాల విక్రయాన్ని చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 6,214 పోస్టాఫీసులకు జాతీయ జెండాలు సరఫరా చేస్తున్నామని, అతి తక్కువ ధర రూ.25కే 20 × 30 అంగుళాల జాతీయ జెండాలు అందిస్తున్నామని తెలిపారు. పోస్టు ఆఫీస్ పోర్టల్ ద్వారా ఈ నెల 12 అర్ధరాత్రి 12 గంటల వరకు బుక్ చేసుకునే అవకాశం కల్పించామని, ఒక్కొక్కరు 5 జాతీయ జెండాలు కొనుగోలు చేయవచ్చన్నారు. సూచించిన చిరునామాలో 13వ తేదీలోగా డెలివరీ అందిస్తామని వివరించారు. పూర్తి వివరాల కోసం దగ్గరలోని పోస్టాఫీసులో లేదా 040 -23463514 నంబర్‌కు కాల్ చేసి సంప్రదించవచ్చన్నారు. గతేడాది నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా'కార్యక్రమం ద్వారా 1.71 లక్షల జాతీయ జెండాలు విక్రయించినట్లు వెల్లడించారు.

'మనూ'లో ఎంటెక్ ప్రవేశాల గడువు పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎంటెక్ (సీఎస్ఈ), ఎంటెక్ (ఏఐ అండ్ ఎంఎల్), అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో (ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్) ప్రవేశాలకు దరఖాస్తులు సమర్పించేందుకు గడువు తేదీని పొడిగించినట్లు 'మనూ'డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వనజ తెలిపారు. జూలై 31 వరకున్న అవకాశాన్ని ఆగస్టు 20వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుందన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కింద పార్ట్‌టైమ్ స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్స్ మోడ్ కోర్సు హైదరాబాద్‌లో అందిస్తామని చెప్పారు. మనూ క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కింద హైదరాబాద్‌లోని సమనా కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ సహకారంతో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో సర్టిఫికెట్, డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు హైదరాబాద్ క్యాంపస్‌లో అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. అయితే లక్నో క్యాంపస్‌లో ఫ్యాషన్ టెక్నాలజీలో డిప్లొమా అండ్ సర్టిఫికెట్ కోర్సు అందుబాటులో ఉంటాయన్నారు. దరఖాస్తు ఫారాలు, సాధారణ సూచనలు, ఇతర వివరాలు కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని వనజ సూచించారు.









Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.